గురువారం
3•1•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 8 • సంచిక 189
• పేజీలు: 16 + 16

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE



PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD


కాళేశ్వరం ప్రాజెక్టు పర్యటనలో భాగంగా బుధవారం అన్నారం బరాజ్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

వేగం పెంచండి

- నిర్ణీత వ్యవధిలో పనులు పూర్తికావాల్సిందే
- యంత్రాలు పెరగాలి.. వర్కర్స్‌ను పెంచండి
- ప్రాజెక్టుల యాత్ర రెండోరోజు ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశం
- కన్నెపల్లి- అన్నారం గ్రావిటీ కెనాల్ పనుల పరిశీలన
- మార్చి నెలాఖరుకల్లా అన్ని పనులు పూర్తికావాల్సిందే
- ఫిబ్రవరిలో అన్నారం పంపుహౌస్ పూర్తికావాలి
- అన్నారం బరాజ్ పనులను ప్రశంసించిన సీఎం
- సుందిళ్ల పనులపై అసంతృప్తి

జయశంకర్ జిల్లా ప్రతినిధి/ కరీంనగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ

కాళేశ్వరం ప్రాజెక్టు పనుల్లో వేగంపెంచాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆదేశించారు. నిర్ణీత వ్యవధిలో పనులు పూర్తికావాల్సిందేనని స్పష్టంచేశారు. ఇందుకోసం అవసరమైన మేర యంత్రాలు పెరగాలని, కార్మికులను పెంచాలని చెప్పారు. ప్రాజెక్టుల యాత్ర రెండోరోజయిన బుధవారం ముఖ్యమంత్రి కేసీఆర్ పలు ప్రాంతాలను సందర్శించి పనులను సునిశితంగా పరిశీలించారు. అధికారులకు అవసరమైన ఆదేశాలిచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టు పనుల్లో కొన్నిచోట్ల పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా చెప్తూ.. అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇప్పుడు రాజకీయ ఒత్తిళ్లేమీ లేవని, కానీ ముందుగా చెప్పిన ప్రకారం పనులను కొనసాగించి పూర్తిచేయాల్సిందేనన్నారు. పనుల తీరుపై అధికారులను, వర్క్ ఏజెన్సీలను నిలదీశారు. లక్ష్యసాధనకోసం అన్ని వనరులతో శ్రద్ధతో సకాలంలో పనులు పూర్తిచేయాలని నిర్దేశించారు. కన్నెపల్లి- అన్నారం మధ్యలో నాలుగుచోట్ల ఆగి పనులను సునిశితంగా పరిశీలించిన ఆయన గ్రావిటీ కెనాల్ పక్కన బీటీ రోడ్డు వేయాలని

మిగతా 3వ పేజీలో

రిస్క్ తీసుకొని ఇక్కడికి వచ్చా!

- మీవల్ల అవుతుందా? లేదా?.. తేల్చుకోండి
- పొలిటికల్ కంపల్షన్ ఏమీలేదు
- దమ్ముంటే చేయండి.. లేకుంటే వదిలేయండి
- అధికారులు, కాంట్రాక్టర్లతో ముఖ్యమంత్రి కేసీఆర్
- అడవిలో హై రిస్క్ చేసిన ముఖ్యమంత్రి
- తాత్కాలిక మట్టిరోడ్డుపై 13.5 కిలోమీటర్లు ప్రయాణం
- మావోయిస్టుల ఇలాకాలో గంటన్నర
- భారీ భద్రతా ఏర్పాట్లు.. పర్యవేక్షించిన డీజీపీ మహేందర్‌రెడ్డి

జయశంకర్ జిల్లా ప్రతినిధి-నమస్తే తెలంగాణ: 'ఇక్కడికి రావద్దని పోలీసులు వారించారు. అయినప్పటికీ చాలా రిస్క్ తీసుకొన్నా. స్వయంగా గ్రావిటీ కెనాల్ పనులను పరిశీలిస్తే మంచీచెడు తెలుస్తుందని వచ్చాను' అని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిశీలనలో భాగంగా బుధవారం ఆయన అత్యంత సున్నితమైన ప్రాంతంలో పర్యటించారు. రెండు రాష్ట్రాల సరిహద్దు. మావోయిస్టుల ప్రాబల్య ప్రాంతం. పక్కన నక్సల్స్ కార్యకలాపాలతో అట్టుడికిపోతున్న మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా. దట్టమైన అడవి. పోలీసు భద్రత లేకుండా

మిగతా 3వ పేజీలో

ములుగు, నారాయణపేట జిల్లాల ఏర్పాటు

- వర్ని మండలం నుంచి కొత్తగా మోస్రా, చందూరు మండలాలు
- సిద్దిపేట రూరల్ మండలం నుంచి కొత్తగా నారాయణ్‌రావుపేట మండలం
- జనగామ నుంచి గుండాల మండలం యాదాద్రి భువనగిరి జిల్లాలోకి
- మేడ్చల్ జిల్లాలో కొత్త మండలంగా మూడుచింతలపల్లి
- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రంలో కొత్తగా మరో రెండు జిల్లాలు.. ములుగు, నారాయణపేట ఏర్పాటయ్యాయి. ఈ మేరకు ప్రభుత్వ నోటిఫికేషన్ వెలువడింది. దీనిపై నెలలోగా ఎవరికైనా అభ్యంతరాలుంటే తెలుపాల్సి ఉంటుంది. ఎన్నికల ప్రచారం సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ములుగు, నారాయణపేట జిల్లాలను ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ మేరకు 2018 డిసెంబర్ 31వ తేదీనే ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఒక రెవెన్యూ డివిజన్, 9 మండలాలతో ములుగు జిల్లాను.. ఒక రెవెన్యూ డివిజన్, 12 మండలాలతో నారాయణపేట జిల్లాను ఏర్పాటుచేశారు. వీటితో పాటు వర్ని మండలం నుంచి మోస్రా, చందూరు మండలాలు కొత్తగా ఏర్పడ్డాయి. సిద్దిపేట రూరల్ మండలం నుంచి నారాయణ్‌రావుపేట మండలం కొత్తగా ఏర్పాటయింది. గుండాల మండలాన్ని జనగామ నుంచి యాదాద్రి భువనగిరి జిల్లాలో కలుపుతూ, మేడ్చల్ జిల్లాలో మూడుచింతలపల్లిని కొత్త మండలంగా ఏర్పాటుచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. వీటిపై అభ్యంతరాలుంటే నెల వ్యవధిలోగా తెలుపాలని నోటిఫికేషన్ పేర్కొంది.

ఎకరాకు 4 వేలు

లక్ష వడ్డీలేని రుణం

తెలంగాణ 'రైతుబంధు' స్ఫూర్తితో మోదీ సర్కార్ కొత్త పథకం

రైతులకు ప్రత్యక్ష నగదు బదిలీ

ఈ వారంలోనే ప్రకటించనున్న కేంద్రం

అధికార వర్గాల వెల్లడి

'బిజినెస్ టుడే' కథనం

4



సత్తా చాటుతాం

అసెంబ్లీ ఫలితాలే మళ్లీ రావాలి.. పదహారు ఎంపీ సీట్లే లక్ష్యంగా కార్యకర్తలు కృషిచేయాలి

- దేశ రాజకీయాల్లో టీఆర్‌ఎస్ నిర్ణయాత్మకపాత్ర పోషించాలి
- పదహారు మంది ఎంపీలను కేసీఆర్ చేతుల్లో పెడితే శాసించేది మనమే
- ప్రధాని ఎవరనేది తెలంగాణ ప్రజలే నిర్ణయిస్తారు
- సనత్‌నగర్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లోనూ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలే పునరావృతం కావాలని టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు పిలుపునిచ్చారు. 2019 సంవత్సరం పార్టీకి కీలకమని, పదహారు ఎంపీ సీట్లు గెలవడం లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలని చెప్పారు. టీఆర్‌ఎస్‌ను మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలంతా కృషిచేయాలని అన్నారు. మొన్నటి ఎన్నికల్లో పార్టీకి దూరమైన వారిని మళ్లీ దగ్గరకు తెచ్చుకుందామని సూచించారు. అసెంబ్లీ ఎన్నికల్లో పలుచోట్ల మెజార్టీ తగ్గడం వ్యక్తిగతంగా బాధ కలిగించిందని, ఇందుకు ఓట్ల గల్లంతు కూడా కారణమని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో అలా జరుగకుండా ఓటర్ల నమోదును ఉధృతంగా, ఉద్యమస్ఫూర్తితో చేయించాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు. పదవుల కోసం నాయకుల చుట్టూ తిరగొద్దని, ప్రజల చుట్టూ తిరుగాలని, కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యం ఉంటుందని భరోసా ఇచ్చారు. బుధవారం హైదరాబాద్ జలవిహార్‌లో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన జరిగిన సనత్‌నగర్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఓటరు నమోదులో తప్పిదాలు, లోపాల కారణంగా అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా 22 లక్షల ఓట్లు

మిగతా 2వ పేజీలో

> బెంగాల్ ఈ రోజు ఏమి ఆలోచిస్తుందో భారతదేశం దానిని రేపు ఆలోచిస్తుందనేది నానుడి.. కానీ, ఇప్పుడు తెలంగాణ ఏం అమలు చేస్తున్నదో దేశమంతా దానిని అమలు చేయాలని చూస్తున్నది. ప్రధాని నరేంద్రమోదీ కొంచెం అటుఇటుగా వాళ్ల రంగురుద్ది రైతుబంధును దేశవ్యాప్తంగా అమలుచేసేందుకు యత్నిస్తుండటం సంతోషించదగిన విషయం.
>
> – కేటీఆర్


బుధవారం జలవిహార్‌లో సనత్‌నగర్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో బాణం ఎక్కుపెట్టిన టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కూడా ఉన్నారు.

- ఓటరు నమోదును ఉద్యమస్ఫూర్తితో చేపట్టాలి
- పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేద్దాం
- కష్టపడి పనిచేసినవారికి నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యం
- కేసీఆర్ ఏదిచేసినా కొత్త చరిత్రే
- ముందస్తుకు వెళ్లి మళ్లీ అధికారంలోకి రావడం ఓ రికార్డు
- ప్రజలు గుద్దిన గుద్దుడుకు ప్రజాకూటమి నేతలు ఆగమాగం: కేటీఆర్

అయ్యప్ప సన్నిధిలోకి ఇద్దరు మహిళలు



అయ్యప్ప ఆలయంలోకి ప్రవేశించిన కనకదుర్గ (44), బిందు (42)

- సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన మూడు నెలల తర్వాత.. ఆలయంలోకి అడుగుపెట్టిన 40 ఏండ్ల వనితలు
- ధ్రువీకరించిన కేరళ సీఎం విజయన్
- ఆలయశుద్ధి చేసిన ప్రధాన పూజారి.. గంటపాటు తలుపుల మూత
- రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు తెరతీసిన ఆరెస్సెస్, బీజేపీ
- సచివాలయం వద్ద లాఠీచార్జి.. పాత్రికేయులపై దాడి

5

వెచ్చని వార్త

తగ్గనున్న చలి

దిశ మార్చుకున్న ఉత్తరాది శీతలగాలులు

కనిష్ఠం

కామారెడ్డి జిల్లా భిక్కనూర్, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా గిన్నెధరి 4.5°

3



సంగ్రామంలో ఏకగ్రీవం

- పలు జిల్లాల్లో నమోదైన ఏకగ్రీవాలు
- నూతన పంచాయతీరాజ్ చట్టంతో మారిన రాజకీయం
- ఈసారి గ్రామాల్లో అభివృద్ధే ప్రధాన ఎజెండా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

చాలా రోజులుగా ఎదురుచూస్తున్న పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ కావడంతో పల్లెల్లో రాజకీయ వేడి రాజుకున్నది. పార్టీ గుర్తులు లేకుండా జరిగే పంచాయతీ ఎన్నికలకు గ్రామాల్లో పోరు మొదలైంది. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పంచాయతీ రాజ్ చట్టంతో గ్రామాల అభివృద్ధిపై ఇప్పుడు గతంలో ఎన్నడూ లేనంత చర్చ జరుగుతున్నది. గ్రామాల్లో ఏ ఇద్దరు కలిసినా ఎన్నికలు, అభివృద్ధిపైనే మాట్లాడుకుంటున్నారు. యువత కూడా గ్రామీణ రాజకీయలపై దృష్టి సారించి పోటీకి సిద్ధమవుతున్నది. సోషల్ మీడియాలోనూ పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్నది. బడ్జెట్ నుంచి నేరుగా నిధులు కేటాయించడం, నిధులు, అభివృద్ధిపై పాలకవర్గాలకు బాధ్యతలు పెరుగడం, స్వచ్ఛతతోపాటు సంక్షేమ అంశాలను కీలకంగా మార్చుతూ కొత్త చట్టం తయారైంది. దీంతో గ్రామీణ ఓటర్లు ప్రభుత్వం నుంచి గ్రామాల అభివృద్ధికి నిధులు తీసుకొచ్చే నాయకత్వం వైపు మొగ్గుతున్నారు. దీంతో ఏకగ్రీవాలు మొదలయ్యాయి. తాజాగా మంగళవారం నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం సల్పబండతండా (ఎస్సీ తండా) పంచాయతీ పాలకవర్గం

మిగతా 9వ పేజీలో



సచిన్ బన్సల్ అడ్వాన్స్ ట్యాక్స్ 699 కోట్లు!

వాల్‌మార్ట్ - ఫ్లిప్‌కార్ట్ ఒప్పంద నేపథ్యం


11

పంజా విసిరిన భరత్‌పూర్ సైబర్‌గ్యాంగ్

రెండురోజుల్లో 40 మందికి టోకరా!

కోటిన్నరపైగా చీటింగ్

12



రాఫెల్ యుద్ధం!

- మోదీకి దమ్ము లేదు.. అందుకే పార్లమెంట్‌కు రావడం లేదు
- రాఫెల్ డీల్ ఫైల్ పారికర్ పడక గదిలో.. అనుమతిస్తే ఆడియో టేపు బయటపెడతా
- లోక్‌సభలో రాహుల్‌గాంధీ విమర్శ.. విపక్షాలతో గొంతు కలిపిన శివసేన
- రాహుల్‌వన్నీ అబద్ధాలే.. ఎదురుదాడికి దిగిన అరుణ్‌జైట్లీ.. జేపీసీ దర్యాప్తుకు నో
- 24 మంది అన్నాడీఎంకే సభ్యుల సస్పెన్షన్

రాఫెల్ యుద్ధవిమానాల కొనుగోలు ఒప్పందంపై లోక్‌సభలో బుధవారం అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగింది. ఈ ఒప్పందానికి సంబంధించిన ఫైలు రక్షణ శాఖ మాజీ మంత్రి, గోవా సీఎం మనోహర్ పారికర్ పడకగదిలో ఉన్నట్టు ఆ రాష్ట్ర మంత్రి విశ్వజిత్‌రాణే మరొకరితో చెప్తున్న ఆడియో టేపు తన వద్ద ఉన్నదని, స్పీకర్ అనుమతిస్తే దీన్ని లోక్‌సభలో అందరికీ వినిపిస్తానని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ తెలిపారు. ఆ విన్నపాన్ని స్పీకర్ తిరస్కరించారు. అయితే రాహుల్ చెప్పేవన్నీ అబద్ధాలేనని, అది కల్పిత ఆడియో టేపని, కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ ఎదురుదాడికి దిగారు. ఆ ఆడియో టేపు నిజమైనదని నిరూపించలేకపోతే సభా హక్కుల తీర్మానంతోపాటు బహిష్కరణను సైతం ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

5

హైకోర్టు విభజన పిటిషన్‌ను

కొట్టేసిన సుప్రీంకోర్టు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

తగిన సమయం ఇవ్వకుండా, ఏపీలో హైకోర్టు భవన నిర్మాణం పూర్తికాకుండానే ఉమ్మడి హైకోర్టును విభజించారని ఆంధ్రప్రదేశ్ న్యాయవాదుల సంఘం దాఖలుచేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేసింది. బుధవారం ఈ అంశాన్ని విచారణ చేపట్టిన న్యాయమూర్తులు జస్టిస్ ఏకే సిక్రీ, జస్టిస్ అబ్దుల్‌నజీర్‌లతో కూడిన ధర్మాసనం పిటిషనర్ల వాదనను తోసిపుచ్చింది. ఉమ్మడి హైకోర్టు విభజన అంశంలో జోక్యం చేసుకోలేమని, నూతన హైకోర్టు ప్రారంభం సమయంలో కొన్ని ఇబ్బందులు ఉండటం సాధారణమేనని, త్వరలోనే పరిస్థితులు మెరుగవుతాయని వ్యాఖ్యానించింది. ఇప్పటికే రెండురాష్ట్రాల్లో హైకోర్టులు ప్రారంభమైనందున ఎలాంటి చర్యలు చేపట్టలేమని స్పష్టంచేసింది.



బుధవారం ప్రగతిభవన్‌లో టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావుకు పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్తున్న ఎంపీలు సీతారాంనాయక్, బూర నర్సయ్యగౌడ్, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, రవీంద్రకుమార్, పట్నం నరేందర్‌రెడ్డి, శంకర్‌నాయక్, టీఆర్‌ఎస్ సహాయ కార్యదర్శి పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి



ప్రగతిభవన్‌లో టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావుకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి శశిధర్‌రెడ్డి, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం, ఎమ్మెల్సీ పురాణం సతీశ్, ఎమ్మెల్యేలు ఆరికెపూడి గాంధీ, వివేకానంద, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, సినీనటుడు ప్రకాశ్‌రాజ్ తదితరులు

ప్రియాంకవర్గీస్ పదవీకాలం పొడిగింపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఐఎఫ్‌ఎస్ అధికారి, కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ప్రియాంకవర్గీస్ ముఖ్యమంత్రి కార్యాలయంలో ఎక్స్-అఫీషియో ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ పదవిలో కొనసాగనున్నారు. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఆమె ఆ పదవిలో ఉంటారని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శైలేంద్రకుమార్ జోషి బుధవారం జారీచేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సంక్రాంతి పండుగకు ప్రత్యేక రైళ్లు

రద్దీకి అనుగుణంగా

13 రైళ్లలో ప్రత్యేక చార్జీల వసూలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సంక్రాంతి పండుగ రద్దీ నేపథ్యంలో 13 ప్రత్యేక రైళ్లను నడుపనున్నట్టు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. వీటిలో రెండు మినహా, మిగిలినవి ఏపీలోని వివిధ నగరాల నుంచి హైదరాబాద్‌కు పండుగ తర్వాత తిరిగివచ్చే వారిని దృష్టిలోపెట్టుకుని నడుపనున్నారు. వీటిలో ప్రత్యేక చార్జీలు వసూలు చేస్తారు. కాకినాడటౌన్ స్టేషన్ నుంచి సికింద్రాబాద్‌కు 7, నర్సాపూర్ నుంచి సికింద్రాబాద్‌కు 3, విజయవాడ నుంచి సికింద్రాబాద్‌కు 1, సికింద్రాబాద్ నుంచి కాకినాడకు 2 ప్రత్యేక రైలు సర్వీసులు తిరుగుతాయని దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. మొత్తం 13లో 11 సువిధ ప్రత్యేక రైళ్లు కావడం గమనార్హం. వీటిలో టికెట్ల సంఖ్య తగ్గుతున్నకొద్దీ చార్జీలు పెరుగుతూ ఉంటాయి.

- **కాకినాడ- సికింద్రాబాద్:** సువిధ రైళ్లు ఈ నెల 16, 17, 20 తేదీల్లో రెండు చొప్పున, 18న ఒకటి.
- **నర్సాపూర్- సికింద్రాబాద్:** (సువిధ) 18, 19, 20 తేదీల్లో ఒక్కొక్కటి.
- **విజయవాడ- సికింద్రాబాద్:** (సువిధ) 17న ఒకటి.
- **సికింద్రాబాద్- కాకినాడ:** ప్రత్యేక చార్జీల రైళ్లు13, 20 తేదీల్లో ఒక్కొక్కటి.

సత్తా చాటుతాం



బుధవారం జలవిహార్‌లో నిర్వహించిన సనత్‌నగర్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు. చిత్రంలో ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్‌యాదవ్, బాల్కసుమన్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, గ్రంథాలయ కమిటీ చైర్మన్ అయాచితం శ్రీధర్ తదితరులు ఉన్నారు.



సనత్‌నగర్ నియోజకవర్గ సమావేశానికి హాజరైన కార్యకర్తలు

మొదటిపేజీ తరువాయి...

గల్లంతయ్యాయని తెలిపారు. ఓటరు నమోదులో కార్యకర్తలు, నాయకులు క్రియాశీలకంగా ఉంటే పార్టీ అభ్యర్థులకు మరింత మెజార్టీ వచ్చేదని చెప్పారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఇలాంటివి పునరావృతం కాకుండా జనవరి 25 వరకు జరిగే ఓటర్ల నమోదును విస్తృతంగా చేపట్టాలని సూచించారు. ప్రతి నియోజకవర్గంలో 12వేల చొప్పున ఓటరు ఎన్‌రోల్‌మెంట్ ఫారాలను అందించామని, పార్టీ శ్రేణులు ఎక్కడికక్కడ ఓటరు నమోదు కార్యక్రమాన్ని సవాల్‌గా తీసుకుని పనిచేయాలని అన్నారు. 2016 జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో డివిజన్లు, బూత్‌లవారీగా పోలైన ఓట్లు పరిశీలించి.. ప్రస్తుత ఓటర్ల జాబితాను సమీక్షించుకోవాలని సూచించారు.

16 స్థానాలతో కేంద్రంలో నిర్ణయాత్మక పాత్ర

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో 16 స్థానాలను టీఆర్‌ఎస్ గెలుచుకుంటే సీఎం కేసీఆర్.. కేంద్రం మెడలువంచి రాష్ర్టానికి రావాల్సిన ప్రయోజనాలను సాధిస్తారని కేటీఆర్ చెప్పారు. ప్రస్తుతం కేంద్రంలో యూపీఏ, ఎన్డీఏలకు మెజార్టీ వచ్చే పరిస్థితి లేదని, ఈ సమయంలో ఒక్కో పార్లమెంట్ సీటు కూడా కీలకమవుతుందని అన్నారు. ఇప్పటికే ఫెడరల్ ఫ్రంట్ ప్రయత్నాలు ముమ్మరమయ్యాయని, కేంద్రంలో కేసీఆర్ లాంటి నాయకుడి అవసరం కచ్చితంగా ఉన్నదని, 16 ఎంపీ స్థానాలను ఆయన చేతుల్లో పెడుదామని పిలుపునిచ్చారు. కేసీఆర్ పరిపాలన దేశంలో దిక్సూచిగా మారిపోయిందని, రైతుబంధు, రైతుబీమా పథకాలను ఒడిశా, జార్ఖండ్ రాష్ర్టాలు ఇప్పటికే అమలుచేస్తుండగా, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ కూడా క్రిషక్‌బంధు పేరుతో ప్రారంభించారని వివరించారు. 'బెంగాల్ ఈ రోజు ఏమి ఆలోచిస్తుందో భారతదేశం దానిని రేపు ఆలోచిస్తుందనేది నానుడి.. కానీ, ఇప్పుడు తెలంగాణ ఏం అమలుచేస్తున్నదో దేశమంతా దానిని అమలుచేయాలని చూస్తున్నది' అని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రధాని మోదీ కొంచెం అటుఇటుగా వాళ్ల రంగురుద్ది రైతుబంధును దేశవ్యాప్తంగా అమలుచేసేందుకు యత్నిస్తుండటం హర్షణీయమన్నారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పథకాలు దేశమంతటా అమలుకావాలంటే ఢిల్లీలో టీఆర్‌ఎస్ నిర్ణయాత్మక పాత్ర పోషించాల్సిన అవసరం ఉన్నదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ పక్షాన నిలబడి 16 సీట్లు కట్టబెడితే ఢిల్లీ పీఠంపై ఎవరిని కూర్చోబెట్టాలో నిర్ణయించే శక్తి తెలంగాణ ప్రజలకు వస్తుందని అన్నారు.

కేసీఆర్ అరుదైన నాయకుడు

గతంలో ముందస్తు ఎన్నికలకు వెళ్లిన ప్రతిఒక్కరికీ చేదు అనుభవాలే ఎదురయ్యాయని, ఇందిరాగాంధీ, వాజపేయి, ఎన్టీఆర్, చంద్రబాబు వంటివారందరూ ముందస్తులో ఓడిపోయారని కేటీఆర్ తెలిపారు. కానీ, ప్రజల ఆలోచనలను పసిగట్టిన నాయకుడు కేసీఆర్ మాత్రం ముందస్తులో విజయం సాధించి చరిత్రను తిరుగరాశారని అన్నారు. ఒక రాజకీయనాయకుడు తన జీవితకాలంలో ఉద్యమానికి శ్రీకారం చుట్టి దాని ఫలాలను ప్రజలకు అందించడం.. ఆ తరువాత రాష్ర్టానికి సీఎం కావడంతోపాటు, రెండోసారి ఆ పీఠాన్ని చేజిక్కించుకోవడం దేశ చరిత్రలోనే రికార్డు అని తెలిపారు. అప్పటి రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ.. కేసీఆర్‌ను ధన్యజీవి అంటూ ఆశీర్వదించారని, ఉద్యమనాయకుడికి రాష్ట్ర నాయకత్వ బాధ్యత దక్కడం చాలా అరుదు అంటూ కితాబిచ్చారని కేటీఆర్ గుర్తుచేశారు. కేసీఆర్ ఏదీచేసినా కొత్త చరిత్రే అని.. సెప్టెంబర్ 6న శాసనసభను రద్దుచేస్తున్నట్టు ప్రకటించి కేవలం గంటల వ్యవధిలోనే 105మంది అభ్యర్థులను ప్రకటించి సంచలనం సృష్టించారన్నారు. కేసీఆర్ నాయకత్వంలోనే బంగారు తెలంగాణ సాధ్యమని బలంగా నమ్మిన ప్రజలు కేసీఆర్‌కు రెండోసారి విజయం కట్టబెట్టారని వివరించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు గుద్దిన గుద్దుడుకు కిందపడిన ప్రజాకూటమి నేతలు ఇప్పటికీ లేవలేకపోతున్నారని, పాడయింది ఈవీఎంలు కాదు.. వారి బుర్రలు అని ఎద్దేవాచేశారు. ఎన్నికల ముందు బీరాలు పలికిన బీజేపీకి 103 సీట్లలో డిపాజిట్లు గల్లంతయ్యాయని అన్నారు. తెలంగాణలో టీడీపీ కథ ముగిసిందని, చంద్రబాబు అమరావతిలో అక్కసు వెళ్లగక్కుతున్నారని ఆరోపించారు. కుల, మతాలకతీతంగా ప్రజలు టీఆర్‌ఎస్‌కు ఓట్లేశారని, వారిచ్చిన బ్రహ్మాండమైన తీర్పును వమ్ముచేయకుండా వ్యవహరిస్తామని హామీఇచ్చారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతిహామీని నిలబెట్టుకొంటామని స్పష్టంచేశారు. ప్రతి టీఆర్‌ఎస్ కార్యకర్త కాలర్ ఎగరేసేలా హామీలు నెరవేరుస్తామని ధీమాగా చెప్పారు. తలసాని శ్రీనివాస్ ప్రజల మనిషి అని కేటీఆర్ కొనియాడారు. హైదరాబాద్‌లో ఏ కొత్త కార్యక్రమం ప్రారంభమైనా.. సనత్‌నగర్ నియోజకవర్గంలోనే ఉండేలా పట్టుపడతారని చెప్పారు. ఐడీహెచ్ కాలనీ, వైట్ ట్యాపింగ్ రోడ్లు, మోడల్ మార్కెట్లు, ఫంక్షన్‌హాల్స్ ఇలా ఏది ప్రారంభమైనా అది సనత్‌నగర్‌లోనే అని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బాల్క సుమన్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, గ్రంథాలయ కమిటీ చైర్మన్ అయాచితం శ్రీధర్, పార్టీ ప్రధాన కార్యదర్శి బండి రమేశ్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

నేడు సిరిసిల్లకు కేటీఆర్

సిరిసిల్ల, నమస్తే తెలంగాణ: టీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారకరామారావు గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యటించనున్నారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం విజయోత్సవ ర్యాలీకి హాజరైన కేటీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో తొలిసారి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనబోతున్నారు. సిరిసిల్లలోని పద్మనాయక ఏసీ ఫంక్షన్‌హాల్‌లో మండలాలవారీగా కార్యకర్తలతో సమావేశమై అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ తీరుపై సమీక్షించనున్నారు. పంచాయతీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, అభ్యర్థుల ఎంపికపై దిశానిర్దేశం చేయనున్నారు. ఉదయం 10 గంటలకు కేటీఆర్ బేగంపేట క్యాంపు కార్యాలయం నుంచి బయల్దేరి 12.30 గంటలకు సిరిసిల్లకు చేరుకోనున్నారు. 12.30 గంటలకు ఎల్లారెడ్డిపేట, 1.30 గంటలకు గంభీరావుపేట, 2.30 గంటలకు ముస్తాబాద్, 3.30 గంటలకు తంగళ్లపల్లి, 4.30 సిరిసిల్ల టౌన్ కార్యకర్తలతో సమావేశమవుతారు. సాయంత్రం 5 గంటలకు తిరిగి హైదరాబాద్ బయల్దేరి వెళ్లనున్నారు.

కంటివెలుగుకు మంచి స్పందన

రాష్ట్రవ్యాప్తంగా వైద్యశిబిరాల నిర్వహణ • ఇప్పటివరకు 1,18,81,765 మందికి పరీక్షలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

అంధత్వరహిత తెలంగాణ సాధన దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న కంటివెలుగు కార్యక్రమానికి ప్రజల మంచి స్పందన లభిస్తున్నది. ప్రతి పౌరుడు కంటిచూపు కోల్పోవద్దన్న లక్ష్యంతో వైద్య, ఆరోగ్యశాఖ రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నది. కార్యక్రమం ప్రారంభమైన నాటినుంచి 83వ రోజైన బుధవారం వరకు రాష్ట్రవ్యాప్తంగా 6,982 గ్రామాల్లో, 591 వార్డుల్లో నిర్వహించిన కంటి వైద్య శిబిరాల్లో 1,18,81,765 మందికి కంటి పరీక్షలు చేశారు. 18,93,167 మందికి కండ్లద్దాలను అందజేశారు. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా 1,01,456 మందికి కంటి పరీక్షలు చేశారు. ఇందులో పురుషులు 46,052, మహిళలు 55,396 మంది, ట్రాన్స్‌జెండర్లు ఎనిమిది మంది ఉన్నారు.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం మారాయిగూడెంలో బుధవారం వృద్ధురాలికి కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి

83 రోజుల వివరాలు ఇవీ..

కంటి వెలుగు

కంటి వైద్య శిబిరాల్లో సేవలు పొందిన వారి సంఖ్య

క్యాటగిరీ	బుధవారం	మొత్తం శిబిరాల్లో
పరీక్షలు చేయించుకున్న వారు	1,01,456	1,18,81,765
రీడింగ్ అద్దాలు పొందిన వారు	8,684	18,93,167
ప్రత్యేక అద్దాలకు ప్రతిపాదన	6,602	14,57,077
కంటి సమస్యలపై రెఫరల్	5,772	7,63,260
కంటి సమస్యలు లేనివారు	80,398	77,68,261



కంటి సమస్య తొలిగిపోయింది

నేను కొన్నేండ్లుగా కండ్ల మసకలతో బాధపడుతున్న. ఆర్థికస్థోమత సరిపోక ఇన్నాళ్లు చికిత్స చేయించుకోలేదు. కంటి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఉచితంగా కంటివెలుగు శిబిరాలు నిర్వహిస్తున్నదని తెలుసుకొని శిబిరానికి వచ్చా. వైద్య సిబ్బంది వైద్యపరీక్షలు చేసి కండ్లద్దాలు ఇచ్చారు. కంటి సమస్యకు పరిష్కారం లభించింది.

– రమాదేవి, గొల్లగూడెం, కొత్తగూడెం జిల్లాకేంద్రం



టీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కే తారకరామారావు బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన కేటీఆర్‌ను గవర్నర్ అభినందించారు. కేటీఆర్ వెంట ఎమ్మెల్యే బాల్కసుమన్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు ఉన్నారు.

హైకోర్టు జడ్జీల సంఖ్య పెంచాలి

లోక్‌సభలో కేంద్రాన్ని కోరిన ఎంపీ వినోద్‌కుమార్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కొత్తగా ఏర్పడిన తెలంగాణ హైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను పెంచాలని టీఆర్‌ఎస్ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ కేంద్రానికి విజ్ఞప్తిచేశారు. లోక్‌సభలో బుధవారం ప్రశ్నోత్తరాల సందర్భంగా తెలంగాణ హైకోర్టు ఏర్పాటుచేసినందుకు కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. కొత్తగా ఏర్పాటైన కోర్టులో ప్రస్తుతం 24 మంది జడ్జీల పోస్టులు మంజూరయ్యాయని, కానీ హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న లక్షల సంఖ్యలో కేసులను పరిష్కరించేందుకు ఇప్పుడున్న జడ్జీల సంఖ్య సరిపోదని చెప్పారు.


ముహూర్తం

సూర్యోదయం: 6.51 గంటలకు

సూర్యాస్తమయం: 5.50 గంటలకు

విళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, కృష్ణపక్షం, త్రయోదశి, నక్షత్రం: అనురాధ ఉదయం 11.04 వరకు, తదుపరి జ్యేష్ఠ, అమృతఘడియలు: లేవు, రాహుకాలం మధ్యాహ్నం 1.43 నుంచి 3.06 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 2.55 నుంచి సాయంత్రం 4.22 వరకు, వర్జ్యం: సాయంత్రం 5.05 నుంచి 6.41 వరకు.

లోకం పోకడ



విమాన ఇంధనం పోయించా పెట్రోల్ ధరల భారం లేదు, ట్రాఫిక్ ఫికర్ లేదు!

మధ్యంతర బడ్జెట్‌కు కసరత్తు

సాధ్యాసాధ్యాలపై ఆర్థికశాఖ అధికారుల అధ్యయనం

మూడు నెలల కాలానికి ఓట్-ఆన్-అకౌంట్!

సీఎం కేసీఆర్ ఆదేశాలతో పరిశీలిస్తున్న రాష్ట్ర ఆర్థికశాఖ

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

మధ్యంతర బడ్జెట్‌కోసం రాష్ట్ర ఆర్థికశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. రెండు లేదా మూడు నెలల కాలానికి ఓట్-ఆన్-అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టడానికి అధికారులు సన్నద్ధం అవుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం ఈ సారి ఫిబ్రవరిలో ఓట్-ఆన్-అకౌంట్‌ను ప్రవేశపెట్టనుంది. అదే సమయంలో రాష్ట్రం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడితే మంచిదా లేక కేంద్ర ప్రభుత్వం మాదిరిగా మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం శ్రేయస్కరమా అనేది అధ్యయనం చేయాలంటూ సీఎం కేసీఆర్ ఉన్నతాధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతో అధికారులు మధ్యంతర బడ్జెట్‌పై దృష్టి సారించారు. వాస్తవానికి ప్రతి సంవత్సరం కేంద్రం.. రాష్ట్ర ప్రభుత్వం కన్నా కనీసం నెల ముందు పార్లమెంటులో బడ్జెట్ ప్రవేశపెడుతుంది. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో రాష్ర్టాలకు కేటాయింపులు, మొత్తం పన్నుల్లో రాష్ర్టానికి వచ్చే వాటా, గ్రాంట్-ఇన్-ఎయిడ్‌లను సరి చూసుకొని రాష్ట్ర ప్రభుత్వాలు వచ్చే సంవత్సరానికి బడ్జెట్ అంచనాలు రూపొందిస్తాయి. అయితే కేంద్రం పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టినప్పుడే ఇది సాధ్యమవుతుంది. ఏప్రిల్‌లో పార్లమెంట్ ఎన్నికలు జరుగనున్న దృష్ట్యా ఈ సారి 2019-20 సంవత్సరానికి పూర్తి బడ్జెట్‌ను ప్రవేశపెట్టదు. ఆ తర్వాత మేలో అధికారంలోకి వచ్చే ప్రభుత్వం వీలు చూసుకుని పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెడుతుంది. ఎన్నికలు సమీపించిన సమయంలో ఓట్-ఆన్-అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం ఆనవాయితీగా వస్తున్నది. రాష్ట్ర విభజనకు ముందు 2014 మార్చి నెలలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. అప్పటి ఆర్థిక మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి రెండు నెలల కాలానికి రూ.1.83లక్షల కోట్లతో శాసనసభలో ఓట్-ఆన్-అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఆ తర్వాత జూన్ 2014లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జూన్ నుంచి మార్చి వరకు పది నెలల కాలానికి రూ.1,00,637 కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఇక అప్పటి నుంచి వరుసగా నాలుగుసార్లు 12నెలల కాల వ్యవధితో పూర్తిస్థాయి బడ్జెట్‌లను ప్రవేశపెట్టింది. కానీ ఈ సారి కేంద్రప్రభుత్వం ఓట్-ఆన్-అకౌంట్ బడ్జెట్ దృష్ట్యా అందుకు అనుగుణంగా బడ్జెట్ కోసం ఏర్పాట్లు చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఓట్-ఆన్-అకౌంట్ బడ్జెట్ అంటే..

ఓట్-ఆన్-అకౌంట్ బడ్జెట్ అంటే తాత్కాలిక అవసరాలకు ప్రవేశపెట్టే మధ్యంతర బడ్జెట్‌గా చెప్పుకోవచ్చు. మధ్యంతర బడ్జెట్‌కు పూర్తి స్థాయి బడ్జెట్ మాదిరి సుదీర్ఘ చర్చలుండవు. దీని పరిమితి గరిష్ఠంగా మూడు నెలల నుంచి నాలుగునెలల వరకే ఉంటుంది. పూర్తిస్థాయి బడ్జెట్‌లో ఆదాయం, వ్యయం మొత్తం ఉంటుంది. కానీ మధ్యంతర బడ్జెట్‌లో వ్యయమే ఉంటుందని అధికారులు చెప్తున్నారు.



'దేశానికి దిక్సూచి తెలంగాణ' పుస్తకాన్ని బుధవారం ప్రగతిభవన్‌లో ఆవిష్కరిస్తున్న టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో పుస్తక రచయిత, బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు, సభ్యులు వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, ఆంజనేయగౌడ్ కూడా ఉన్నారు.

తెలంగాణ పథకాలు అభివృద్ధి నమూనాలు

'దేశానికి దిక్సూచి తెలంగాణ' పుస్తకావిష్కరణలో కేటీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ సిద్ధాంత భావజాలంతో తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు అనేక పుస్తకాలు రచించారని, ఉద్యమ సమయంలో రాములుచేసిన సాహితీ కృషి అభినందనీయమని టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పారు. తెలంగాణ సంక్షేమ పథకాలు దేశంలోనే అభివృద్ధికి నమూనాగా నిలిచాయని తెలిపారు. బీఎస్ రాములు రచించిన 'దేశానికి దిక్సూచి తెలంగాణ' కర్రె సదాశివ్ పరిశోధనా గ్రంథం 'బీఎస్ రాములు సాహిత్యం- సమగ్ర పరిశీలన' పుస్తకాలను ప్రగతిభవన్లో బుధవారం కేటీఆర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు, టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి, బీసీ కమిషన్ సభ్యులు వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, ఈ ఆంజనేయగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



జయశంకర్ భూపాలపల్లి జిల్లా కన్నెపల్లి వద్ద సీఎం కేసీఆర్‌ను శాలువ, పూలమాలతో సత్కరించి కాళేశ్వర, ముక్తేశ్వర స్వామి చిత్రపటాన్ని, ప్రసాదాన్నిఅందజేస్తున్న ఆలయ అర్చకులు



పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం గోలివాడలో ప్రాజెక్టు నిర్మాణ పనులపై అధికారులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు



పెద్దపల్లి జిల్లా సుందిళ్ల వద్ద ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను తిలకిస్తున్న సీఎం కేసీఆర్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు గడ్డం వివేక్, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి తదితరులు

వేగం పెంచండి



జయశంకర్ భూపాలపల్లి జిల్లా కన్నెపల్లి నుంచి అన్నారం వెళ్లే గ్రావిటీ కెనాల్‌ను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో టీఎస్ఎండీసీ చైర్మన్ శేరి సుభాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, డీజీపీ మహేందర్‌రెడ్డి తదితరులున్నారు.

మొదటిపేజీ తరువాయి...

ఆదేశించారు. మార్చి నెలాఖరుకల్లా అన్ని పనులు పూర్తి కావాల్సిందేనని సీఎం స్పష్టీకరించగా.. కచ్చితంగా పూర్తి చేస్తామని ఇంజినీర్లు, వర్క్ ఏజెన్సీల ప్రతినిధులు చెప్పారు. అన్నారం బరాజ్ పనులను పరిశీలించిన ముఖ్యమంత్రి అధికారులను ప్రశంసించారు. సుందిళ్ల పనులు కమిట్‌మెంట్ ప్రకారం కావడంలేదని ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తంచేశారు. నిర్లక్ష్యాన్ని సహించేదిలేదని హెచ్చరించారు. మూడు షిఫ్టుల్లో పనులు నడుపాలని, మార్చిలోగా పూర్తికావాలని, అవసరాన్ని బట్టి మళ్లీ వస్తానని చెప్పారు. ఫిబ్రవరిలో అన్నారం పంపుహౌస్ పూర్తికావాలన్నారు. మార్చి 31 నాటికి కాళేశ్వరం, ఎస్సారెస్పీ పునర్జీవ పథకం పంపుహౌస్ పనులు పూర్తిచేయాలని ఆదేశించారు.రెండురోజుల విస్తృత పర్యటన ముగించుకుని బుధవారం రాత్రి హైదరాబాద్ చేరుకున్నారు.

మార్పులేదు.. మార్చిలోగా చేయాల్సిందే

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న సుందిళ్ల బరాజ్, సుందిళ్ల, అన్నారం పంపుహౌస్‌ల అన్ని పనులు మార్చి నెలాఖరులోగా పూర్తిచేయాల్సిందేనని అధికారులకు, ఏజెన్సీలకు ముఖ్యమంత్రి స్పష్టంచేశారు. సుందిళ్ల పనులు వేగవంతంగా లేవని నవయుగ కాంట్రాక్టర్లపై ఆగ్రహించారు. పద్ధతి మార్చుకోవాలని, వేగం పెంచాలని హెచ్చరించారు. బుధవారం మధ్యాహ్నం సుందిళ్ల బరాజ్ వ్యూ పాయింట్ వద్ద ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించిన సందర్భంలో.. దీనికి సంబంధించిన పనుల్లో అనుకున్నంత వేగం ఎందుకు కనిపించడం లేదని కంపెనీ కాంట్రాక్టర్లు, అధికారులను నిలదీశారు. అన్నారం బరాజ్‌తో పోలిస్తే సుందిళ్ల వెనుకబడిందని, ఇలా చేస్తే రైతులకు నీరెలా ఇస్తామని, పద్ధతి మార్చుకొని వేగం పెంచాలని హెచ్చరించారు. పేరు గొప్ప..ఊరు దిబ్బలా మీ కంపెనీ పనులున్నాయని మందలించారు. సుందిళ్ల బరాజ్ పనులను మార్చి 31 నాటికి పూర్తిచేయాలని ఆదేశించారు. సుందిళ్ల బరాజ్ పరిధిలో 74 గేట్ల అమరిక పూర్తయిందని, 17 కిలోమీటర్ల మేర ఉన్న ఫ్లడ్‌బ్యాంకు పనులు సాగుతున్నాయని, 89.64 శాతం ఎక్స్‌కవేషన్, 76.39 శాతం ఎర్త్ పనులు జరిగాయని, మిగిలినవి జనవరి చివరినాటికి పూర్తవుతాయని అధికారులు తెలిపారు. ఈ సందర్భంలో రివిట్‌మెంట్ పనుల పురోగతిపై సీఎం ప్రశ్నించారు. 46 శాతమే జరగడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. మార్చి చివరికల్లా కాళేశ్వరం వద్ద కాఫర్‌డ్యాం నిర్మించి పనులు పూర్తిచేస్తామన్న సీఎం.. వందశాతం నీరు అందించేలా పనుల్లో వేగం పెంచాలని ఏజెన్సీలను ఆదేశించారు. అన్నారం పంప్‌హౌస్ పనులకు సంబంధించిన సమాచారాన్ని సైతం సుందిళ్ల వ్యూ పాయింట్ వద్దే అడిగి తెలుసుకున్నారు. అన్నారం పంపుహౌస్ పనులను ఏరియల్ వ్యూ ద్వారా చూశామని చెప్పిన సీఎం.. పంపుహౌస్ పనులను సైతం సమాంతరంగా వేగంగా చేస్తూ, ఫిబ్రవరి చివరినాటికి పూర్తిచేయాలని ఆఫ్‌స్కాన్ కంపెనీ ప్రతినిధులకు సూచించారు. పంప్‌హౌస్ పరిధిలోని 8 పంపుల్లో భాగంగా ఆరింటికి మోటర్లు వచ్చాయని, వాటి పనులు చివరిదశలో ఉన్నాయని, మిగిలిన రెండు మోటర్లు చెన్నైకి చేరాయని అధికారులు తెలిపారు. నిత్యం రెండు టీఎంసీల నీటిని ఎత్తిపోసేలా పనులు నిర్వహించాలని, ఈ వానకాలం రైతులకు ఎట్టి పరిస్థితుల్లో సాగునీరందించాలన్నారు. తర్వాత సుందిళ్ల పంపుహౌస్ పనుల పరిశీలనకు వెళ్లారు.

మార్చినాటికి 9 పంపులు రన్ చేయాలి

మధ్యాహ్నం 2.25 గంటలకు సుందిళ్ల పంపుహౌస్‌కు చేరుకున్న కేసీఆర్.. క్యాంపు కార్యాలయంలో భోజనం చేశారు. అనంతరం పనులను పరిశీలించారు. మార్చి వరకు 9 పంపుల డ్రైరన్ నిర్వహించాలని ఆదేశించారు. సుందిళ్ల పంప్‌హౌస్‌లో ప్రతి రోజు రెండు టీఎంసీల నీటిని ఎత్తిపోసే సామర్థ్యమున్న 9 మోటర్లను బిగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. మూడు టీఎంసీలకు నీటిని ఎత్తిపోయడానికి సివిల్ పనులు నిర్వహిస్తున్నామన్నారు. గోలివాడ పంప్‌హౌస్‌లలో 5.6లక్షల క్యూబిక్ మీటర్ల పని జరగాల్సి ఉండగా, ఇప్పటివరకు 5లక్షల క్యూబిక్ మీటర్ల మేర పని పూర్తయినట్లు అధికారులు సీఎంకు వివరించారు. పంప్‌హౌస్‌లో నాలుగు పంపుల ఎరక్షన్ పూర్తిచేశామని, మోటర్ల బిగింపు పనులు వేగంగా జరుగుతున్నాయని, ఐదు మోటర్ల స్పైరల్ కేసింగ్ పనులు పూర్తిచేశామని తెలిపారు. రూ.1547.65కోట్ల పనులు పూర్తిచేసినట్లు చెప్పారు. మార్చి చివరినాటికి తొమ్మిది మోటర్ల బిగింపు పనులు పూర్తయ్యే విధంగా ప్రణాళికలు పూర్తిచేసుకొని అమలుపరచాలని ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పారు. మార్చి చివరినాటికి తొమ్మిది మోటర్ల డ్రైరన్ నిర్వహించాలని, జనవరి చివరినాటికి నాలుగు మోటర్ల డ్రైరన్ పూర్తిచేయాలని కేసీఆర్ నిర్మాణ సంస్థలను ఆదేశించారు. పనుల్లో వచ్చే ఆటంకాలను అధిగమిస్తూ సకాలంలో పూర్తయ్యేవిధంగా చూడాలని. ఎట్టి పరిస్థితుల్లో వానకాలం వ్యవసాయానికి సాగునీటిని అందించే విధంగా పనులు పూర్తవ్వాలన్నారు.

ప్రతి ఎకరాకూ నీరివ్వాలి

సుందిళ్ల పంప్‌హౌస్ పనుల పరిశీలన అనంతరం ముఖ్యమంత్రి అక్కడి నుంచి జగిత్యాల జిల్లాలో ఎస్సారెస్పీ పునర్జీవ పథకం పనులను పరిశీలించారు. ఇబ్రహీంపట్నం మండలం రాజేశ్వర్‌రావుపేట పంపుహౌస్ వద్దకు సాయంత్రం 4.10కి చేరుకున్న ఆయన నిర్మాణ పనులతోపాటు ఫొటో ఎగ్జిబిషన్‌ను చూశారు. ఈ సందర్భంగా పనుల వివరాలను అడిగి తెలుసుకున్న ముఖ్యమంత్రి మార్చి 31లోపు రాజేశ్వర్‌రావుపేటతోపాటుగా మల్యాల మండలం రాంపూర్ వద్ద నిర్మిస్తున్న రెండు పంపులను పూర్తిచేయాలని ఆదేశించారు. ఏప్రిల్, మే నెలల్లో డ్రై ట్రయల్ రన్ చేయాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో ఎస్సారెస్పీ పునర్జీవ పథకం పంపుహౌస్‌లు నిర్దిష్ట గడువులోపు పూర్తికావాలని ఆదేశించారు. వచ్చే వర్షాకాలం నాటికి ఎస్సారెస్పీ పునర్జీవ పథకం ద్వారా యాభై టీఎంసీల నీటిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఎత్తిపోసే విధంగా పనులు జరగాలని సూచించారు. వరద కాలువ వెంట ఉన్న ప్రతి ఎకరానికి సాగునీరు అందించేందుకు అవసరమైనచోట లిఫ్టులు ఏర్పాటుచేస్తామన్న సీఎం ఆ దిశగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జగిత్యాల, కోరుట్ల, చొప్పదండి తదితర నియోజకవర్గాల పరిధిలో వరద కాలువను వినియోగించి ప్రతి ఎకరాకు సాగునీరు అందేవిధంగా కావాల్సిన ఏర్పాట్లు, ప్రణాళికలు తయారుచేయాలని, ఇందుకోసం ఎంత డబ్బునైనా వెచ్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఫారెస్ట్ ప్రాంతంలో ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టులు పూర్తయితే ఈ ప్రాంతం టూరిజానికి కేరాఫ్ అడ్రస్‌గా మారుతుందని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. పర్యాటకుల సంఖ్య బాగా పెరుగుతుందని, 5 నుంచి 10 ఎకరాల్లో హోటళ్లు నిర్మాణం జరిగేలా ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. మల్టీనేషనల్ కంపెనీలను టూరిజం అభివృద్ధిలో భాగస్వాములను చేసేందుకు ఆలోచిస్తున్నామని చెప్పారు. రామగుండం నుంచి రైల్వేమార్గాన్ని సైతం పొడిగిస్తామని, భవిష్యత్‌లో ఈ ప్రాంతం చాలా బాగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఇకనుంచి ఎప్పటికప్పుడు తాను కూడా ప్రాజెక్టు పనులను సమీక్షిస్తానని స్పష్టంచేశారు. రాజేశ్వర్‌రావుపేట వద్దే ఆలస్యం కావడంతో ముఖ్యమంత్రి రాంపూర్ పంప్‌హౌస్‌కు వెళ్లలేకపోయారు. పర్యటనలో ముఖ్యమంత్రి వెంట ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, సీఎంవో కార్యదర్శి స్మితాసబర్వాల్, సీఎం ఓఎస్డీ శ్రీధర్‌రావు దేశ్‌పాండే, ఇంజినీర్ ఇన్ చీఫ్ మురళీధర్‌రావు, కాళేశ్వరం ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ ఎన్ వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజినీర్ వెంకటేశ్వర్లు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు, డీజీపీ మహేందర్‌రెడ్డి, నార్త్ జోన్ ఐజీ నాగిరెడ్డి, టీఎస్ఎండీసీ చైర్మన్ శేరి సుభాష్‌రెడ్డి, ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీ వివేక్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు, పెద్దపల్లి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు, మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, మాజీ ఎమ్మెల్సీ సీహెచ్ సుధాకర్‌రావు తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. జయశంకర్ భూపాలపల్లి, సిరిసిల్ల ఎస్పీలు ఆర్ భాస్కరన్, రాహుల్‌హెగ్డే, ఏటూరునాగారం ఏఎస్పీ శరత్‌చంద్ర, అదనపు ఎస్పీ రాజమహేంద్రనాయక్ బందోబస్తు నిర్వహించారు.

సీఎం పర్యటన తీరిదీ..

ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు రెండురోజుల ప్రాజెక్టుల యాత్రలో తొలిరోజు మంగళవారం కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగమైన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బరాజ్, కన్నెపల్లి పంపుహౌస్ పనులను పరిశీలించారు. రాత్రి కరీంనగర్ తీగలగుట్టపల్లిలో బసచేసిన ఆయన బుధవారం ఉదయం మళ్లీ మహదేవపూర్ మండలంలోని కన్నెపల్లి పంపుహౌజ్ వద్దకు చేరుకున్నారు. రెండోరోజు సీఎం.. మేడిగడ్డ బరాజ్ నుంచి అన్నారం బరాజ్‌లోకి తరలించడానికి కన్నెపల్లి నుంచి అన్నారం వరకు అడవిలో 13.4 కిలోమీటర్ల పొడవున నిర్మిస్తున్న గ్రావిటీ కెనాల్ పనులను పరిశీలించారు. అక్కడి నుంచి నేరుగా అన్నారం బరాజ్‌కు చేరుకొని, వ్యూపాయింట్ నుంచి పనులను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్నం 1.35 గంటలకు సుందిళ్ల వెళ్లారు. సుందిళ్ల బరాజ్‌ని, అన్నారం పంప్‌హౌస్‌ను గగనతలం నుంచి వీక్షించారు. సుందిళ్ల వద్ద హెలిప్యాడ్‌లో దిగి, వ్యూపాయింట్ వద్ద ఫొటో ఎగ్జిబిషన్‌చూశారు. మధ్యాహ్నం 2.25 గంటలకు సుందిళ్ల పంపుహౌస్‌కు చేరుకున్నారు. క్యాంపు కార్యాలయంలో భోజనం చేసిన అనంతరం పనులను పరిశీలించారు. అక్కడి నుంచి జగిత్యాల జిల్లాకు వెళ్లి ఎస్సారెస్పీ పునర్జీవ పథకంలో భాగంగా ఇబ్రహీంపట్నం మండలం రాజేశ్వర్‌రావుపేట వద్ద జరుగుతున్న పంపుహౌస్ వద్దకు సాయంత్రం 4.10గంటలకు చేరుకున్న సీఎం నిర్మాణ పనులను పరిశీలించారు. ఫొటో ఎగ్జిబిషన్‌ను చూశారు. సాయంత్రం 4.58 గంటలకు నేరుగా హెలికాప్టర్‌లో హైదరాబాద్ వెళ్లిపోయారు.

రిస్క్ తీసుకొని ఇక్కడికి వచ్చా!

మొదటిపేజీ తరువాయి...

స్థానిక ప్రజాప్రతినిధి కూడా పర్యటించలేని పరిస్థితి. ఇలాంటి హైరిస్క్‌తో కూడిన అటవీ ప్రాంతంలో సీఎం కేసీఆర్ రోడ్డు మార్గాన ప్రయాణించారు. అది కూడా తాత్కాలికంగా మట్టితో నిర్మించిన రహదారిపై. ఒకటి రెండు కాదు ఏకంగా పదమూడున్నర కిలోమీటర్లు మట్టి రోడ్డుపై అధికారులతో కలిసి వాహనంలో ప్రయాణించారు. కన్నెపల్లి-అన్నారం గ్రావిటీ కెనాల్ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ కెనాల్ కోసం నిర్మించిన తాత్కాలిక మట్టిరోడ్డుపైనే ఆయన ప్రయాణం సాగింది. మార్గమధ్యంలో నాలుగుచోట్ల ఆగారు. ప్రతీచోట కొద్దిసేపు కెనాల్ పైనే ఉండి అధికారులకు సూచనలుచేశారు. దాదాపు గంటన్నరపాటు సీఎం కేసీఆర్ ఈ ప్రాంతంలో పర్యటించడం ఆయన భద్రత అధికారుల్లో ఉత్కంఠ రేపింది. తెలంగాణలో కోటి ఎకరాలకు సాగునీరు అందించాలనే సంకల్పంతో ముందుకు వెళ్తున్న ఆయన పట్టుదలను చూసి అధికారులు ఆశ్చర్యపోయారు.

అసలు విషయం చెప్పండి.. అవుతుందా లేదా..

'ఈ సీజన్‌కు వాడుదామా వద్దా అనేది మీ డెసిషన్.. సింపుల్‌గా మళ్లీ అడుగుతున్న.. పొలిటికల్ అర్జెన్సీ ఏమీ లేదు.. దమ్మున్నది చేస్తామంటే ఈ సీజన్‌కు చేయండి.. లేదా నెక్స్ట్‌సీజన్‌కు చేయండి.. పూర్తిగా మీపైనే ఆధారపడి ఉంది.. ఈ సీజన్‌లో వాటర్ తీసుకోవాలంటే మూడు షిఫ్టుల్లో పనులు జరగాలి.. మిషనరీ, వర్కర్స్‌ను పెంచాలి.. పగలు, రాత్రి తేడాలేకుండా నిరంతరం శ్రమించాలి.. అప్పుడే మార్చి నెలాఖరుకల్లా గ్రావిటీ కెనాల్ పనుల నిర్దేశిత లక్ష్యం చేరుకుంటాం. నిర్ణీత గడువు ప్రకారం కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తవుతుంది' అని సీఎం కేసీఆర్ గ్రావిటీ కెనాల్ ద్వారా నీరు అన్నారం బరాజ్ వద్ద గోదావరిలో కలిసేచోట ఎండ్ స్ట్రక్చర్ పనులను పరిశీలించిన సమయంలో అధికారులకు గట్టిగా డెడ్‌లైన్ పెట్టారు. 'కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టుకు కన్నెపల్లి- అన్నారం గ్రావిటీ కెనాల్ అనేది లైఫ్. అనుకున్నవిధంగా ఇది పూర్తికావాలి. కాళేశ్వరం నీటి కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. ఎలాగైనా వానకాలంలో వారికి కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీరిచ్చి తీరాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఇందు కోసం మార్చి 31వ తేదీలోగా ప్రాజెక్టు పనులన్నీ పూర్తిచేయాలని చెప్తున్నా. ఇది పూర్తయితేనే మేడిగడ్డ బరాజ్‌నుంచి ఎత్తిపోతల ద్వారా గోదావరి నీరు అన్నారం బరాజ్‌కు చేరుతుంది. అప్పుడే అన్నారం బరాజ్ నుంచి సుందిళ్ల, ఎల్లంపల్లి బరాజ్‌ల ద్వారా కరీంనగర్ మిడ్ మానేరుకు కాళేశ్వరం ప్రాజెక్టు నీరు పరుగులు పెడుతుంది. ఇప్పటి వరకు జరిగిన పనులను చూస్తే ఇంకా మిషనరీ, వర్కర్స్‌ను పెంచాల్సిన అవసరం ఉందని తేలింది. మూడు షిఫ్టుల్లో పనులు నడవాలి. ప్రాజెక్టుకు ఇదే లైఫ్. ఏం చేస్తారో చేయండి. ఎట్టి పరిస్థితుల్లో వానకాలం కాళేశ్వరం ప్రాజెక్టు నీరు కరీంనగర్ మిడ్‌మానేరుకు చేరాలి' అని సీఎం స్పష్టం చేశారు. ఆయన తొలుత కన్నెపల్లి పంపుహౌస్ నుంచి ఎత్తిపోతల ద్వారా గ్రావిటీ కెనాల్‌లోకి చేరుకునే డెలివరీ స్ట్రక్చర్ వద్ద ఆగారు. అనంతరం గ్రావిటీ కెనాల్‌లో ఏడో కిలోమీటరు, 12.9వ కిలోమీటరు వద్ద, చివరగా ఎత్తిపోతల ద్వారా కెనాల్ నుంచి వచ్చే నీరు గోదావరి నదిలో కలిసేచోట ఆగి లైనింగ్, స్ట్రక్చర్లు, పెద్దవాగు అండర్ టన్నల్ (యూటీ) పనులను పరిశీలించారు. ఏడో కిలోమీటరు వద్ద పనులను పరిశీలించిన సమయంలో కెనాల్ తవ్వకానికి తీసి పక్కన కుప్పలుగా పోసిన మట్టి.. వర్షాలతో గ్రావిటీ కెనాల్‌లోకి రాకుండా అడ్డుకునేలా ఎలాంటి చర్యలు తీసుకోకపోవటాన్ని సీఎం ప్రశ్నించారు. 'ఇది అటవీ ప్రాంతం. ఇక్కడ వర్షాలు ఎక్కువగా కురుస్తాయి. వరదకు మట్టి కొట్టుకొచ్చి కెనాల్‌లో పడే అవకాశం ఉంది. కెనాల్ తవ్వకానికి తీసిన మట్టే కాకుండా వరదలతో అటవీ ప్రాంతం నుంచి మట్టి గ్రావిటీ కెనాల్‌లోకి రావొచ్చు. కెనాల్ పక్కన వాల్ లేదా రోడ్డుగానీ నిర్మిస్తే మట్టి గ్రావిటీ కెనాల్‌లో పడకుండా ఆపవచ్చు. ఎలాగూ కెనాల్ పక్కన రోడ్డు అవసరం. కన్నెపల్లి పంపుహౌస్ నుంచి అన్నారం బరాజ్ వద్దకు గ్రావిటీ కెనాల్ పక్కన బీటీ రోడ్డు వేయండి' అని తన వెంట ఉన్న అధికారులను ఆదేశించారు. 12.9వ కిలోమీటరు వద్ద ఆగిన సమయంలో స్ట్రక్చర్ల నిర్మాణపనుల్లో వేగంలేకపోవడంపై సాగునీటిశాఖ ఇంజినీర్లను నిలదీశారు. 'ఏం చేస్తారో తెలియదు. ఎట్టి పరిస్థితుల్లో ఇవన్నీ కూడా మార్చి నెలాఖరులోగా పూర్తికావాలి. ఇందుకోసం పనుల్లో వేగం పెంచండి. యంత్రాలు కూడా పెరగాలి. వర్కర్స్‌ను పెంచండి. నిరంతరం పనులు జరగాలి' అని అధికారులు, వర్క్ ఏజెన్సీలకు చెప్పారు.



జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం రాజేశ్వర్‌రావుపేట వద్ద పంప్‌హౌస్ పనులను పరిశీలిస్తున్న సీఎం కేసీఆర్, చిత్రంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు గడ్డం వివేక్, అధికారులు తదితరులున్నారు.

భారీ భద్రతా ఏర్పాట్లు

కన్నెపల్లి నుంచి అన్నారం వరకు గ్రావిటీ కెనాల్ నిర్మాణ పనులు జరుగుతున్న అటవీ ప్రాంతం మావోయిస్టులకు పట్టు ఉన్న ఏరియా. సీఎం కేసీఆర్ ప్రయాణం ఈ కెనాల్ మీదుగానే సాగింది. ఆయన మార్గమధ్యంలో ఆగిన ఏడో కిలోమీటరుకు నూట యాభై మీటర్ల దూరంలోనే గతంలో మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావును మావోయిస్టులు హతమార్చారు. గతేడాది అప్పటి భారీ నీటిపారుదలశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు గ్రావిటీ కెనాల్ నిర్మాణ పనులను పరిశీలించడం కోసం ఇదేరోడ్డుపై ప్రయాణించారు. అనూహ్యరీతిలో సీఎం కేసీఆర్ గ్రావిటీ కెనాల్ పనులు పరిశీలించేందుకు రావడంతో ఆయన వెంట రాష్ట్ర డీజీపీ మహేందర్‌రెడ్డి, నార్త్ జోన్ ఐజీ నాగిరెడ్డి, జయశంకర్ భూపాలపల్లి, సిరిసిల్ల జిల్లాల ఎస్పీలు ఆర్ భాస్కరన్, రాహుల్ హెగ్డే ప్రయాణించారు. 13.40 కిలోమీటర్ల పొడవున గ్రావిటీ కెనాల్ పక్కన వంద మీటర్లకు ఒకరి లెక్కన పోలీసు బలగాలను మోహరించారు. ఐదువందలమంది పోలీసులు ఇక్కడ సీఎం పర్యటనకు బందోబస్తు నిర్వహించారు. రెండ్రోజుల ముందునుంచే కన్నెపల్లి, అన్నారం ప్రాంతాలను ప్రత్యేక బలగాలను మోహరించడం ద్వారా తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు. సీఎం కేసీఆర్ గ్రావిటీ కెనాల్ పర్యటన ప్రశాంతంగా ముగిసిన తర్వాత పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.



నిజామాబాద్ నగరశివారుపై కమ్ముకున్న పొగమంచు

చలికాలం

జిల్లా	కనిష్ఠం	గరిష్ఠం
కామారెడ్డి	4.5	34.8
ఆదిలాబాద్	4.7	36.1
సంగారెడ్డి	4.7	35.5
వికారాబాద్	4.9	24.6
సిద్దిపేట	5.3	34.6
మెదక్	6.0	34.6
నాగర్‌కర్నూల్	6.3	35.1
మేడ్చల్	6.3	35.5
మంచిర్యాల	6.4	28.8
కుమ్రంభీం ఆసిఫాబాద్	6.4	28.8
మహబూబ్‌నగర్	6.8	35.6
నిర్మల్	7.4	35.5
నిజామాబాద్	7.4	35.5
జనగామ	7.7	33.5
జోగుళాంబ గద్వాల	8.2	34.6
యాదాద్రి భువనగిరి	8.4	32.9
కరీంనగర్	8.8	37.0
మహబూబాబాద్	8.8	34.6
పెద్దపల్లి	9.4	30.4
రంగారెడ్డి	9.6	36.1
హైదరాబాద్	9.8	35.5
వనపర్తి	10.7	34.6
జగిత్యాల	11.0	33.0
వరంగల్ అర్బన్	11.5	31.0
సూర్యాపేట	12.0	28.0
జయశంకర్ భూపాలపల్లి	13.0	29.0
రాజన్న సిరిసిల్ల	13.0	29.0
వరంగల్ రూరల్	13.0	29.0
భద్రాద్రి కొత్తగూడెం	13.0	30.0
ఖమ్మం	14.0	29.0
నల్లగొండ	14.6	29.4

తగ్గనున్న చలి తీవ్రత

మారిన ఉత్తరాది శీతలగాలుల దిశ.. రెండ్రోజుల్లో పెరగనున్న కనిష్ఠ ఉష్ణోగ్రతలు

కనిష్ఠంగా కామారెడ్డి జిల్లా భిక్కనూరు, ఆసిఫాబాద్ జిల్లా గిన్నెధరిలో 4.5 డిగ్రీలు

చలికి తట్టుకోలేక ముగ్గురు, చలి మంటలు అంటుకొని ఒకరు మృతి

ప్రత్యేకప్రతినిధి, నమస్తే తెలంగాణ: ఉత్తరాది నుంచి వీస్తున్న శీతలగాలులు బుధవారం దిశ మార్చుకున్నాయి. గురువారం నుంచి కేవలం ఈశాన్యగాలులే వీస్తాయని, రాష్ట్రంలో శనివారం నుంచి కనిష్ఠ ఉష్ణోగ్రతలు పెరిగి చలితీవ్రత తగ్గుతుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు వివరించారు. బుధవారం కామారెడ్డి జిల్లా భిక్కనూరు, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా గిన్నెధరిలో 4.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. సంగారెడ్డి జిల్లా కోహిర్, ఆదిలాబాద్ జిల్లా బేలలో 4.7, సంగారెడ్డి జిల్లా అల్గోల్, ఆదిలాబాద్ జిల్లా అర్లి(టి)లో 5, సిద్దిపేట జిల్లా పోతారెడ్డిపేటలో 5.3, రంగారెడ్డి జిల్లా మంగల్‌పల్లి, చందనవెల్లి, వికారాబాద్ జిల్లా మర్పల్లిలో 5.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత, హైదరాబాద్‌లో 9.8 డిగ్రీలుగా నమోదైంది. ఆదిలాబాద్ జిల్లాలో గత ఏడాది జనవరి 2న 14.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదవగా, ఈ ఏడాది జనవరి 2న 4.7గా నమోదైంది. దీంతో ఏజెన్సీ ప్రాంతాల్లోని అడవులు, గుట్టలున్న గ్రామాలు కశ్మీర్‌ను తలపిస్తున్నాయి. బుధవారం రాత్రివరకు రాష్ట్రవ్యాప్తంగా శీతలగాలుల తీవ్రత కొనసాగింది. చలి తీవ్రతను తట్టుకోలేక రాష్ట్రవ్యాప్తంగా బుధవారం ముగ్గురు మృత్యువాతపడ్డారు. ఖమ్మం జిల్లా వైరా మండలం దాచాపురంలో మడుపల్లి సావిత్రమ్మ(70), సంగారెడ్డి జిల్లా మనూరులో అనుదీప్(18), యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలోని వంజరివాడకు చెందిన యాదగిరి (70) మృతి చెందారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం అనంతారం గ్రామానికి చెందిన కానూరి పుల్లయ్య(75)బుధవారం తెల్లవారుజామున చలి మంట వేసుకొని కూర్చున్నాడు. ఈ క్రమంలో ఒంటిపై ఉన్న కోటుకు నిప్పంటుకోవడంతో ఒక్కసారిగా వెనుకకు విరుచుకొని పడటంతో తలకు గాయమైంది. దీంతో స్పృహ తప్పిపోయిన పుల్లయ్య ఒంటిపై ఉన్న దుస్తులు కాలి మృతిచెందాడు.

రైతు తలరాత మార్చేందుకే రీడిజైన్

- ప్రాజెక్టుల ప్రగతి, ఆర్థిక ఇబ్బందులపై సీఎంకు నివేదిస్తాం
- ట్రీ కన్వీనర్ శ్యాంప్రసాద్‌రెడ్డి వెల్లడి



నాగర్‌కర్నూల్ మండలం గుడిపల్లిగట్టు వద్ద ఎంజీకేఎల్ఐ మూడో లిఫ్ట్ పంప్‌హౌస్‌ను పరిశీలిస్తున్న తెలంగాణ రిటైర్డ్ ఇంజినీర్ల బృందం

అచ్చంపేట నమస్తే తెలంగాణ/అమ్రాబాద్ రూరల్, నాంపల్లి (మర్రిగూడ): రాష్ట్రంలో కోటి ఎకరాలకు సాగునీరు అందించి రైతుల తలరాత మార్చేందుకే సీఎం కేసీఆర్ ప్రాజెక్టుల రీడిజైన్‌తో పనులను వేగవంతం చేస్తున్నారని తెలంగాణ రిటైర్డ్ ఇంజినీర్ల బృందం (ట్రీ) కన్వీనర్ శ్యాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ప్రాజెక్టుల పరిశీలనలో భాగంగా బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంటలోని ఎస్సెల్బీసీ ప్రాజెక్టును బృందంతో కలిసి సందర్శించారు. ఎస్సెల్బీసీ ప్రాజెక్టు సొరంగం పనులు నిలిచిపోయేందుకు తలెత్తుతున్న సాంకేతిక అంశాలను అధికారులతో అడిగి తెలుసుకొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. టన్నెల్ పనులు 44 కిలోమీటర్లకుగానూ 34 కిలోమీటర్ల మేర పూర్తయ్యాయని చెప్పారు. ప్రభుత్వం ఇప్పటికే రూ.1,400 కోట్లు ఖర్చు చేసిందన్నారు. వాస్తవానికి 2019 నాటికల్లా పూర్తికావాల్సి ఉండగా.. అక్టోబర్ నుంచి సొరంగంలోకి నీరు చేరడంవల్లే పనులు నిలిచిపోయి పనులు ఆలస్యమయ్యాయని చెప్పారు. నాగర్‌కర్నూల్ మండలంలోని గుడిపల్లిగట్టు వద్ద ఎంజీకేఎల్ఐ ఎత్తిపోతల మూడో లిఫ్ట్ పంప్‌హౌస్‌ను కూడా బృందం పరిశీలించింది. డిండి ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని చర్లగూడం, నాంపల్లి మండలం లక్ష్మణాపూర్‌లో నిర్మిస్తున్న రిజర్వాయర్ల పనులను కూడా ట్రీ బృందం పరిశీలించింది. ప్రాజెక్టుల నిర్మాణంలో క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి తగిన నివేదికను సీఎంకు అందించనున్నట్లు శ్యాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. బృందంలో ఇంజినీర్లు చంద్రమౌళి, నరేంద్రరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, జగదీశ్, దేవేందర్‌రెడ్డి,రాంరెడ్డి, నరేందర్‌రావు ఉన్నారు.

ఎల్లుండి దేవాదుల సందర్శన

సీతారామ ప్రాజెక్టు పనులను గురువారం పరిశీలించనున్న బృందం.. ఎల్లుండి దేవాదుల ఎత్తిపోతల పథకం పనులను సందర్శించనున్నది.

లంచం తీసుకున్న సైన్యాధికారులు

కేసు నమోదు చేసిన సీబీఐ



న్యూఢిల్లీ, జనవరి 2: ఐదుగురు సైన్యాధికారులపై సీబీఐ కేసు నమోదు చేసింది. అసోం, అరుణాచల్ ప్రదేశ్‌లో విధులు నిర్వర్తిస్తున్న సైనికులకు అవసరమైన సరుకుల కొనుగోలులో అవకతవకలు జరిగాయని, ఈ ఐదుగురు కలిసి సరుకులను సరఫరా చేసే కాంట్రాక్టరు(సప్లయర్) నుంచి రూ.18 లక్షలు తీసుకున్నారని ఆరోపిస్తూ ఆర్మీ సీబీఐకి ఫిర్యాదు చేసింది. దీంతో కల్నల్ రమణ్ దాదా, లెఫ్టినెంట్ కల్నల్ మహేందర్ కుమార్, సుబేదార్లు దేవేంద్రకుమార్, సహురన్ సాహూ, హవల్దార్ అభయ్ సింగ్, సప్లయర్ కేకే యాంగ్‌ఫోలపై సీబీఐ అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసింది. కల్నల్ రమణ్‌దాదా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డాడని, సప్లయర్ యాంగ్‌ఫో నుంచి రెండు విడుతలుగా రూ.4.15 లక్షలు స్వీకరించాడని సైన్యం ఆరోపించింది. సరుకుల నాణ్యతను పరిశీలించాల్సిన మహేందర్‌కుమార్ కూడా అధికార దుర్వినియోగానికి పాల్పడి సప్లయర్ నుంచి లక్ష రూపాయలు లంచం తీసుకున్నాడని తెలిపింది. దేవేంద్రకుమార్ రూ.2.04 లక్షలు, అభయ్‌సింగ్ రూ.98వేలు, సహురన్ సాహూ రూ.7.65 లక్షలు లంచంగా స్వీకరించారని సైన్యం ఫిర్యాదులో పేర్కొంది. దీంతో ప్రాథమిక దర్యాప్తు జరిపిన సీబీఐ అవకతవకలు జరిగినట్లు గుర్తించి కేసు నమోదు చేసింది.

'అత్యధిక కాలం జీవించిన' రికార్డుపై వివాదాలు

తల్లి పేరిట చెలామణి అయిన కూతురు



జియాన్నే కాల్మెంట్

మాస్కో, జనవరి 2: ప్రపంచంలోనే అత్యధిక కాలం జీవించిన వ్యక్తిగా ఫ్రెంచి మహిళ జియాన్నే కాల్మెంట్ పేరిట ఉన్న రికార్డుపై వివాదాలు అలుముకున్నాయి. ఈ రికార్డులో మోసం జరిగిందని రష్యా పరిశోధకులు ఆరోపిస్తున్నారు. జియాన్నే కాల్మెంట్ 122 ఏండ్ల 164 రోజులు జీవించి 1997లో మరణించారు. అత్యధిక కాలం జీవించిన వ్యక్తిగా ఇప్పటికీ ఆమె పేరిటే రికార్డు ఉంది. అయితే రష్యాకు చెందిన గణితవేత్త నికోలై జాక్ కొన్ని నెలల పాటు ఆమె చరిత్రపై పరిశోధన చేశారు. ఆమె ఇంటర్వ్యూలు, ఫొటోలు, ప్రభుత్వ రికార్డులు పరిశీలించారు. వాటన్నింటినీ విశ్లేషించిన ఆయన... కాల్మెంట్ అన్నేండ్లు జీవించలేదని వెల్లడించారు. 1934లో కాల్మెంట్ కూతురు యువాన్నే మరణించినట్లు ప్రభుత్వ రికార్డులు వెల్లడిస్తున్నాయని, అయితే అప్పుడు మరణించినది కాల్మెంట్ కూతురు కాదని, కాల్మెంటే మరణించారని వివరించారు. వారసత్వ పన్నును తప్పించుకునేందుకు యువాన్నే తన తల్లి పేరిట చలామణీ అయ్యారని వెల్లడించారు.

క్యూబా విప్లవానికి 60 ఏండ్లు



అమరవీరుల సంస్మరణ కేంద్రం వద్ద మాట్లాడుతున్న రౌల్ కాస్ట్రో

హవానా, జనవరి 2: క్యూబా విప్లవానికి మంగళవారంతో 60 ఏండ్లు పూర్తయ్యాయి. దీంతో ఆ దేశం ఘనంగా వేడుకలను నిర్వహించింది. 'కాస్ట్రో'యేతరుల పాలనలో వేడుకలు నిర్వహిస్తుండడం ఇదే మొదటిసారి. 'క్రేడిల్ ఆఫ్ ది రెవల్యూషన్'గా పిలిచే శాంటియాగో డి క్యూబాలో సంస్మరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి రౌల్ కాస్ట్రో హాజరయ్యారు. దేశ వీరులు జోస్ మార్టీ, ఫిడెల్ క్యాస్ట్రో సమాధుల వద్ద ఆయన ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. గతేడాది ఏప్రిల్‌లో దేశాధ్యక్షుడిగా మిగ్వెల్ డియాజ్ కానెల్ బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. అమెరికా మద్దతుతో పాలన సాగించిన నియంత బటిస్టా.. విప్లవం నేపథ్యంలో 1958 డిసెంబర్ 31న దేశాన్ని విడిచి పారిపోయారు. దీంతో 1959 జనవరి 1న ఫిడెల్ కాస్ట్రో దేశంలో ఏకపార్టీ కమ్యూనిస్టు పాలనకు నాందిపలికారు.

మందిరం కోసం చట్టం తీసుకురావాలి

- **వీహెచ్‌పీ నేత అలోక్ కుమార్ డిమాండ్**



న్యూఢిల్లీ, జనవరి 2: అయోధ్యలో రామ మందిరం నిర్మాణానికి కోర్టు తీర్పుతో సంబంధం లేకుండా ముందే చట్టం తీసుకురావాలని విశ్వ హిందూ పరిషత్(వీహెచ్‌పీ) సూచించింది. ప్రస్తుత ప్రభుత్వ పాలన పూర్తయ్యేలోపే ఈ చట్టం తీసుకొచ్చే విధంగా ప్రధాని మోదీని ఒప్పిస్తామని తెలిపింది. రామాలయం నిర్మాణానికి ఆర్డినెన్స్ తీసుకొచ్చే విషయంలో సుప్రీంకోర్టు తీర్పు తర్వాతే స్పందిస్తామని ప్రధాని మోదీ పేర్కొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వీహెచ్‌పీ అంతర్జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు అలోక్ కుమార్ స్పందిస్తూ కోర్టు తీర్పు వచ్చే వరకు వేచి చూసే ఓపిక హిందువులకు లేదని, అందుకే చట్టాన్ని తీసుకొచ్చి ఆలయ నిర్మాణానికి మార్గం సుగమం చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో చర్చించడానికి ప్రధాని మోదీని సమయం కోరుతామని తెలిపారు.



గోవులతో యూపీ సీఎం యోగి

యూపీలో గో సంరక్షణ పన్ను

రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం ■ మండిపడుతున్న ప్రతిపక్షాలు

లక్నో, జనవరి 2: గో సంరక్షణ కోసం సెస్(పన్ను)ను విధించాలని ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలోని ఎనిమిది లాభదాయక ప్రభుత్వ రంగ మౌలిక సదుపాయాల కంపెనీలపై గో సంరక్షణ పేరుతో అదనంగా 0.5 శాతం సెస్‌ను విధించనుంది. రాష్ట్రంలోని కొన్ని ఎక్స్‌ప్రెస్ వేలు, మద్యం దుకాణాలు కూడా ఈ సెస్ పరిధిలోకి రానున్నాయి. అలాగే కొన్ని మార్కెట్ సముదాయాలు గో సంరక్షణ కోసం ఇప్పటికే తమ ఆదాయంలో ఒక్కశాతాన్ని ఇస్తున్నాయి. ఇకపై 2 శాతం ఇవ్వాలని ప్రభుత్వం కోరుతున్నది. సెస్ ద్వారా వచ్చిన ఆదాయాన్ని గోశాలల నిర్మాణం, నిర్వహణకు వినియోగించనుంది. అడిషనల్ చీఫ్ సెక్రటరీ అవినాశ్ అవస్తి మాట్లాడుతూ 'గో కల్యాణ్' పథకం కింద ఈ సెస్‌ను వసూలు చేయనున్నామని, దీనికి సంబంధించిన ఉత్తర్వులు వారంలో జారీ చేస్తామని చెప్పారు. మరోవైపు ప్రభుత్వ నిర్ణయంపై ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. అదనపు సెస్ వల్ల ప్రజలపై భారం పడుతుందని పేర్కొన్నాయి. సమాజ్‌వాదీ పార్టీ అధికార ప్రతినిధి రాజేంద్ర చౌదరి స్పందిస్తూ గో సంరక్షణ పేరుతో ప్రజలపై ఎందుకు భారం మోపుతున్నారని ప్రశ్నించారు. బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతి మాట్లాడుతూ బీజేపీకి దమ్ముంటే ఇలాంటి సెస్‌ను జాతీయ స్థాయిలో విధించాలని కోరారు. ఉత్తర్‌ప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడు మహేంద్రనాథ్ పాండే స్పందిస్తూ గో సంరక్షణ చర్యల వల్ల రైతులకు ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. ఈ గోశాలలను అన్ని గ్రామాలు, పంచాయతీలు, మున్సిపాలిటీలల్లో ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. కాగా, గత వారం అలీగఢ్, ఫిరోజాబాద్ జిల్లాల్లోని రెండు గ్రామాల్లో తిరుగుతున్న పశువులను స్థానికులు పాఠశాలల్లో కట్టేశారు. పశువుల రక్షణ కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అప్పటి వరకు పాఠశాలల నుంచి వాటిని బయటికి వదిలిపెట్టమని హెచ్చరించారు. దీంతో ఈ విషయంపై దృష్టి సారించిన సీఎం యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం రాష్ట్రంలోని రోడ్లపై తిరుగుతున్న పశువులకు రక్షణ కల్పించాలని, ఇందుకోసం గోశాలలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

కేంద్రంలో 'రైతుబంధు'

- **తెలంగాణ స్ఫూర్తితో మోదీ సర్కార్ కొత్త పథకం**
- **ఎకరాకు రూ.4 వేల చొప్పున రైతులకు ప్రత్యక్ష నగదు బదిలీ**
- **వడ్డీ లేకుండా రూ.లక్ష వరకు రుణాలు**
- **ఈ వారంలోనే ప్రకటించనున్న కేంద్రం**



న్యూఢిల్లీ, జనవరి 2: తెలంగాణలో అన్నదాతల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నేతృత్వంలోని టీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతుబంధు పథకం దేశంలోని వివిధ రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు కేంద్రంలోని ఎన్డీఏ సర్కారుకు కూడా స్ఫూర్తిగా నిలుస్తున్నది. రాష్ట్రంలో ప్రతి రైతుకు ఎకరాకు ఏటా రూ.10 వేల చొప్పున పంట పెట్టుబడిని అందజేస్తున్న రైతుబంధు పథకాన్ని నరేంద్రమోదీ ప్రభుత్వం ఆదర్శంగా తీసుకొని రైతులకు ఒక్కో సీజన్‌లో రూ.4 వేల చొప్పున ఇచ్చేందుకు ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) పథకాన్ని ప్రారంభించడంతోపాటు అన్నదాతలకు వడ్డీ లేకుండా లక్ష రూపాయల వరకు రుణాలను అందజేయనున్నట్టు అధికార వర్గాలు వెల్లడించాయని 'బిజినెస్ టుడే' పత్రిక పేర్కొన్నది. ఈ రెండు పథకాలకు సాలీనా రూ.2.3 లక్షల కోట్లు ఖర్చవుతుందని అంచనా. ఈ పథకాలను అమలు చేసేందుకు వీలుగా ప్రస్తుతం ఎరువులపై రైతులకు ఇస్తున్న రూ.70 వేలకోట్ల సబ్సిడీని వీటిలో విలీనం చేయనున్నట్టు తెలుస్తున్నది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన ఓటమిని దృష్టిలో ఉంచుకొని రైతులను ప్రసన్నం చేసుకోవడం ద్వారా లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు మోదీ ప్రభుత్వం ఈ వారంలోనే రెండు పథకాలను ప్రవేశపెట్టనున్నట్టు సమాచారం. దీనికి సంబంధించిన ప్రకటనను ఖరారు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధాని కార్యాలయంతో పాటు నీతి ఆయోగ్‌లో అత్యవసర సమావేశాలను నిర్వహించనున్నది. సంబంధిత శాఖలకు చెందిన అధికారులు సమావేశమై ఈ పథకాల అమలులో అవరోధాలు తలెత్తకుండా చూడాలని ప్రభుత్వం కోరింది. అలాగే ఈ పథకాలకు సంబంధించిన ప్రతిపాదనలపై చర్చించేందుకు ప్రధాని మోదీ రైతు సంఘాల నాయకులతో సమావేశం కానున్నారు.

కుటుంబ సంక్షేమ పథకాలు కొనసాగింపు

కేంద్ర క్యాబినెట్ నిర్ణయం

న్యూఢిల్లీ: కుటుంబ సంక్షేమ పథకాల కొనసాగింపునకు కేంద్రం క్యాబినెట్ ఆమోదం తెలిపింది. 'కుటుంబ సంక్షేమం, ఇతర ఆరోగ్య సేవల ఏకీకృత పథకం' కింద ఐదు పథకాలను అమలు చేయనున్నారు. ఇందులో స్వస్థ నాగ్‌రిక్ అభియాన్, గర్భనిరోధక సాధనాల ఉచిత పంపిణీ, గర్భ నిరోధక సాధనాల మార్కెటింగ్, హెల్త్ సర్వేస్ అండ్ హెల్త్ రీసెర్చ్(హెచ్‌ఎస్‌హెచ్‌ఆర్), పాపులేషన్ రీసెర్చ్ సెంటర్స్ (పీసీఆర్‌ఎస్) ఉన్నాయి. ఈ పథకాలను 2019-20లోనూ అమలుచేయనున్నారు. వీటికి 100 శాతం నిధులను కేంద్ర ప్రభుత్వమే అందిస్తుంది. 14వ ఆర్థిక సంఘం సమయంలో మొత్తంగా రూ.2381.84 కోట్లను ఈ పథకం కింద ఖర్చు చేయనున్నారు. జాతీయ ఆరోగ్య విధానం-2017, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు(ఎస్‌డీజీఎస్) సాధించడంలో ఈ పథకాలు కీలకమని కేంద్రం తెలిపింది. గర్భనిరోధక సాధనాల ఉచిత పంపిణీ, గర్భ నిరోధక సాధనాల మార్కెటింగ్ పథకాలు అల్పాదాయ వర్గాల కోసం ప్రవేశపెట్టినవైనా, మొత్తంగా అంబ్రెల్లా పథకం దేశ ప్రజలందరికీ వర్తిస్తుందని వివరించింది.

నేషనల్ హెల్త్ అథారిటీ ఏర్పాటుకు ఆమోదం

ఆయుష్మాన్ భారత్ పథకాన్ని సమర్థంగా అమలు చేసేందుకుగాను నేషనల్ హెల్త్ ఏజెన్సీ స్థానంలో నేషనల్ హెల్త్ అథారిటీని ఏర్పాటు చేసేందుకు కేంద్రం నిర్ణయించింది. ఇంతకు ముందు వివిధ దశల్లో నిర్ణయ ప్రక్రియ సాగేదని, నేషనల్ హెల్త్ అథారిటీ ద్వారా వేగంగా నిర్ణయాలు తీసుకోవచ్చునికేంద్రం తెలిపింది.

తెలంగాణపై చంద్రబాబుకు విద్వేషం

- **ఓటమి వల్ల అక్కసుతోనే అలా మట్లాడుతున్నారు**
- **తెలంగాణలో మహాకూటమికి పట్టిన గతి ఏమిటో తెలిసిందే**
- **ఏఎన్ఐ ఇంటర్వ్యూలో ప్రధాని మోదీ వ్యాఖ్యలు**



న్యూఢిల్లీ, జనవరి 2: తెలంగాణపై విద్వేషంతోనే ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఏఎన్ఐ వార్తా సంస్థకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఒక ప్రశ్నకు బదులిస్తూ, చంద్రబాబుకు తెలంగాణ అంటే ద్వేషం అని చెప్పారు. అందుకే తనకూ, కేసీఆర్‌కు సంబంధం అంటగట్టేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. 'ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు ఆయన పార్టీని దేనికీ పనికిరాకుండా చేశారు. అందుకే ఆయన ఆ రాష్ట్రంపై అక్కసుతో అలా మాట్లాడుతున్నారు. అది ఆయన సమస్య' అని అన్నారు. జాతీయ స్థాయిలో చంద్రబాబు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్న మహాకూటమికి ఎటువంటి ప్రాధాన్యం ఉండదని చెప్పారు. వారి రాజకీయాలను ప్రజలు తిరస్కరిస్తారని అన్నారు. తెలంగాణలో మహాకూటమికి పట్టిన గతి ఏమిటో తెలిసిందేనని మోదీ వ్యాఖ్యానించారు.

నేటి నుంచి ఇండియన్ సైన్స్ కాంగ్రెస్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పంజాబ్‌లోని జలంధర్‌లో ఉన్న లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ క్యాంపస్‌లో గురువారం(3వ తేదీ) నుంచి 106వ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ జరుగనుంది. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిస్తారు. సాంకేతిక ఫలాలను సామాన్యుడి చెంతకు చేర్చడానికి, దేశం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సాంకేతికతను ఉపయోగించడం లక్ష్యంగా ఈ సదస్సు జరుగనుంది. 'చాయ్ పే చర్చ'లో భాగంగా ముగ్గురు నోబెల్ బహుమతి గ్రహీతలతో ప్రధాని చర్చించనున్నారు.

ఈ ఏడాది నుంచే స్విస్ ఖాతాల సమాచారం

న్యూఢిల్లీ, జనవరి 2: స్విస్ బ్యాంకుల్లో డబ్బులు దాచిన భారతీయుల వివరాలు ఈ ఏడాది నుంచి మనకు అందుతాయని కేంద్ర ప్రభుత్వం బుధవారం లోక్‌సభలో ప్రకటించింది. రష్యా నుంచి కొనుగోలు చేయనున్న ఎస్-400 ట్రయాంఫ్ గగనతల రక్షణ క్షిపణి వ్యవస్థలు వచ్చే ఏడాది అక్టోబర్ నుంచి మనకు సరఫరా అవుతాయని తెలిపింది.

దేశ ప్రయోజనాలే ప్రాథమ్యం కావాలి



బుధవారం మేడ్చల్ జిల్లా శామీర్‌పేటలోని నల్సార్ లా వర్సిటీలో పట్టాలు ప్రదానంచేస్తున్న తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి టీబీ రాధాకృష్ణన్

- **తెలంగాణ హైకోర్టు సీజే టీబీ రాధాకృష్ణన్**
- **నల్సార్ లా వర్సిటీలో పీజీ డిప్లొమా ఎస్ఐలకు పట్టాల ప్రదానోత్సవం**

శామీర్‌పేట: జాతీయ పారిశ్రామిక సంస్థలకు రక్షణ కల్పించడంలో నేషనల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ అకాడమీ (నిస్సా) అద్భుతమైన విధులు నిర్వహిస్తున్నదని తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి టీబీ రాధాకృష్ణన్ పేర్కొన్నారు. ఆ క్రమంలోనే విధి నిర్వహణలో దేశ ప్రయోజనాలకు ప్రాధాన్యమిస్తూ ముందుకుసాగాలని ఆయన సూచించారు. బుధవారం మేడ్చల్ జిల్లా శామీర్‌పేటలోని నల్సార్ లా యూనివర్సిటీలో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ లా అండ్ మేనేజ్‌మెంట్ పూర్తిచేసిన నిస్సా ఎస్ఐలకు పట్టాల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి రాధాకృష్ణన్ మాట్లాడుతూ ప్రతి సంస్థకు విధి విధానాలు ఉంటాయని, వాటిని పాటిస్తే మంచిపేరు వస్తుందని చెప్పారు. కొన్ని క్లిష్టమైన కేసుల్లో వైద్యులు, ఇంజినీర్లు, పారిశ్రామికవేత్తలు తదితరులు విధి విధానాలను పాటిస్తున్నారా? లేదా ? అనే విషయాన్ని పరిగణనలోకి తీసుకుంటామని ఉదాహరణ ఇచ్చారు. అనంతరం నల్సార్ వైస్‌చాన్స్‌లర్ ఫైజన్‌ముస్తఫా మాట్లాడుతూ డిప్లొమా తీసుకున్నవారు న్యాయ విద్యార్థుల్లాగే ఆలోచించాలన్నారు. 446 మందికి పట్టాలను అందజేశామని, మొదటి మూడుస్థానాల్లో నిలిచిన పూజాయాదవ్, మదీప్‌కౌర్, సంచిత్ పన్వర్‌లకు మెరిట్ పతకాలను ప్రదానం చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ బాలకిష్టారెడ్డి, నిస్సా ఐజీ, డైరెక్టర్ అంజనాసిన్హా, డీఐజీ టీ విక్రమ్, ఎఫ్ఎస్టీఐ నిస్సా డీఐజీ శిఖర్‌సహాయ్, కమాండెంట్ పుష్కర్ పరాషత్ పాల్గొన్నారు.

అందరి సహకారంతో సత్వర న్యాయం

- **తెలంగాణ హైకోర్టులో 1.87 లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి**
- **తొలిరోజు విధుల సందర్భంగా చీఫ్ జస్టిస్ టీబీ రాధాకృష్ణన్**

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అందరి సహకారంతో కక్షిదారులకు సత్వర న్యాయంచేస్తామని హైకోర్టు చీఫ్ జస్టిస్ టీబీ రాధాకృష్ణన్ చెప్పారు. మంగళవారం తెలంగాణ హైకోర్టు తొలిరోజు విధుల ప్రారంభం సందర్భంగా న్యాయవాదులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. బార్ కౌన్సిల్, హైకోర్టు బార్ అసోసియేషన్, న్యాయవాదులు, న్యాయాధికారులు, ఉద్యోగుల సహకారంతో వేగంగా కేసులను పరిష్కరిస్తామని చెప్పారు. తెలంగాణ హైకోర్టులో ఇప్పటివరకు 1.87 లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. బార్ అండ్ బెంచ్ సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. కొత్త సంవత్సరంలో కొత్త హైకోర్టు ప్రారంభమైన సందర్భంగా న్యాయవాదులకు, ఉద్యోగులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. ఉమ్మడి హైకోర్టుగా ఉండి.. తెలంగాణ రాష్ట్ర హైకోర్టుగా మారిన నేపథ్యంలో అందరిపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ తెలంగాణ హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం, అడ్వకేట్ జనరల్ కార్యాలయం, న్యాయ సమాజం తరపున మాట్లాడటం తనకు లభించిన గొప్ప గౌరవంగా భావిస్తున్నానని తెలిపారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ ఏ నర్సింహారెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ పాలకుడు ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ నిర్మించిన ఈ అద్భుత కట్టడం ఎన్నో పరిణామాలకు సాక్షిగా నిలిచిందని చెప్పారు. హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ హైకోర్టులో పనిచేసిన పలువురు సుప్రీంకోర్టు జడ్జీలు అయ్యారని, పలు చారిత్రాత్మక తీర్పుల్లో భాగస్వాములయ్యారని పేర్కొన్నారు.

హైకోర్టు ఉద్యోగులను అసంబద్ధంగా విభజించారు

- **150 మంది తెలంగాణ ఉద్యోగులను ఏపీకి పంపారు**
- **హైకోర్టు తెలంగాణ ఉద్యోగుల నిరసన**

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉమ్మడి హైకోర్టులో విధులు నిర్వహిస్తున్న సుమారు 1700 మంది ఉద్యోగులు, సిబ్బందిని అసంబద్ధంగా విభజించారని హైకోర్టు తెలంగాణ ఉద్యోగులు ఆవేదన వ్యక్తంచేశారు. తమకు న్యాయంచేయాలని హైకోర్టు అడ్మినిస్ట్రేషన్ రిజిస్ట్రార్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. తెలంగాణ ప్రాంతానికి చెందిన సుమారు 150 మంది ఉద్యోగులకు ఏపీ హైకోర్టులో పోస్టింగ్ ఇచ్చారని తెలిపారు. విభజన మార్గదర్శకాల్లో లోపాలు ఉన్నాయని వాటిని సవరించాలని విజ్ఞప్తిచేశారు. గతంలో పలు రాష్ట్రాల హైకోర్టులు విడిపోయినప్పుడు స్థానికత ఆధారంగానే ఉద్యోగులను విభజించారని, కానీ, ప్రస్తుతం సీనియార్టీ ప్రకారం విభజించడం వల్ల తెలంగాణ ప్రాంతం వారికి తీరని అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తంచేశారు. తాము రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులమైనందున న్యాయాధికారులకు వర్తింపజేసిన సీనియార్టీ నిబంధన తమకు వర్తించదని తెలిపారు.


వడగాలులకు 100 మంది బలి

- **2017లో తెలంగాణలో మృతుల సంఖ్య**
- **దేశవ్యాప్తంగా తొమ్మిదేండ్లలో 6,100 మంది మృతి**
- **లోక్‌సభలో కేంద్రమంత్రి హర్షవర్ధన్ వెల్లడి**

న్యూఢిల్లీ: వడగాలుల కారణంగా దేశవ్యాప్తంగా 2017లో 375 మంది చనిపోతే అందులో తెలంగాణ రాష్ట్రంలోనే 100 మంది మృతిచెందగా, ఏపీలో 236 మంది మృత్యువాతపడ్డారు. దేశవ్యాప్తంగా గత తొమ్మిదేండ్లలో వడగాలులకు 6,100 మంది బలయ్యారు. బుధవారం లోక్‌సభలో ఓ ప్రశ్నకు కేంద్ర మంత్రి హర్షవర్ధన్ ఈ మేరకు రాతపూర్వకంగా సమాధానం ఇచ్చారు. వడగాలుల కారణంగా 2010లో 269 మంది, 2011లో 12 మంది, 2012లో 729, 2013లో 1433, 2014లో 548, 2015లో 2,081, 2016లో 700, 2017లో 375, 2018లో 20 మంది ప్రాణాలు వదిలారని చెప్పారు. దేశంలోని చాలా ప్రాంతాల్లో వేడిగాలుల తీవ్రత పెరుగుతున్నదని మంత్రి వివరించారు. మార్చి నుంచి జూలై మధ్యకాలంలో వీచే వేడిగాలుల తీవ్రతపై భారత వాతావరణ విభాగం (ఐఎండీ) సహకారంతో రాష్ట్ర ఆరోగ్యశాఖలు ముందస్తుగా అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టాయి.

44 లక్షల ఖాతాల్లోకి నగదు


- **మిగతావాటిలో జమకు పంచాయతీ ఎన్నికల కోడ్ అడ్డు!**
- **తప్పుడు వివరాల నమోదుతో 53 వేల ఖాతాల్లో పడని పెట్టుబడి సాయం**



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రైతుబంధు పథకం కింద యాసంగికి రాష్ట్రంలోని సుమారు 44 లక్షల మంది అన్నదాతల బ్యాంకు ఖాతాల్లో పెట్టుబడి సాయం జమైంది. యాసంగిలో 50 లక్షలమంది ఖాతాలకు ఎకరాకు రూ.4 వేలచొప్పున జమచేయాల్సి ఉండగా, వ్యవసాయ విస్తరణ అధికారులు 45.53 లక్షల మంది రైతుల నుంచి ఖాతాల వివరాలు సేకరించారు. ఇందులో దాదాపు 44 లక్షల మంది వివరాలను ట్రెజరీలకు అంజేయగా వారిఖాతాల్లో రైతుబంధు సొమ్ము పడింది. బ్యాంకు ఖాతా నంబర్, ఐఎఫ్‌ఎస్సీ కోడ్ తప్పుగా నమోదుచేయడంతో దాదాపు 53 వేలమంది ఖాతాల్లో డబ్బు జమకాలేదు. వారి వివరాలను మరోసారి నమోదుచేసేందుకు వ్యవసాయశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. వానకాలంలో పాసుబుక్కులు పొందని సుమారు 1.96 లక్షల మంది రైతులు యాసంగిలో కొత్తగా రైతుబంధుకు అర్హత సాధించారు. వీరినుంచి ఖాతాల వివరాలను అధికారులు సేకరించారు. ఈ పథకం కింద మిగిలిన రైతుల ఖాతాల్లో జనవరి మొదటివారంలో పెట్టుబడి సొమ్ము జమచేయాలని వ్యవసాయశాఖ భావించింది. కానీ, పంచాయతీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో రైతుబంధును నిలిపివేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం పేర్కొన్నది. దీంతో బ్యాంకు ఖాతాల్లో డబ్బు జమకాని రైతులు ఎన్నికలు ముగిసే వరకు ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొన్నది.

యాసంగిలో పంటల సాగు మూడోవంతే

- **18 జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులు**
- **పంటల సాధారణ సాగువిస్తీర్ణం 33.45 లక్షల ఎకరాలు**
- **ఇప్పటివరకు సాగుచేసింది 10.77 లక్షల ఎకరాలే**
- **వ్యవసాయశాఖ వారాంతపు నివేదిక వెల్లడి**



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: యాసంగి పంటల విస్తీర్ణం నిరాశాజనకంగా మారింది. జనవరి వచ్చినా పంటల సాగు విస్తీర్ణం పెరుగలేదు. పంటలు మూడోవంతు విస్తీర్ణంలోనే సాగయ్యాయి. వ్యవసాయశాఖ బుధవారం విడుదలచేసిన వారాంతపు నివేదిక ప్రకారం.. యాసంగి సీజన్లో పంటల సాధారణ సాగు విస్తీర్ణం 33.45 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు కేవలం 10.77 లక్షల (32 శాతం) ఎకరాల్లోనే పంటలను సాగుచేశారు. అందులో ఆహార పంటల సాధారణ సాగువిస్తీర్ణం 26.12 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 7.32 (28శాతం) లక్షల ఎకరాల్లోనే సాగయ్యాయి. ఆహారధాన్యాల్లో కీలకమైన వరి యాసంగి సాధారణ సాగు విస్తీర్ణం 17.62 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 1.92 లక్షల (11 శాతం) ఎకరాల్లోనే సాగయింది. మక్కజొన్న సాధారణ సాగువిస్తీర్ణం 4.15 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 2.25 లక్షలు (54 శాతం) ఎకరాల్లో సాగైంది. ఇక నూనెగింజల సాగులో కీలకమైన వేరుశనగ సాధారణ సాగువిస్తీర్ణం 3.57 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 2.32 లక్షలు (65 శాతం) ఎకరాల్లో సాగైంది. వరినాట్లు పుంజుకోకపోవడంతో అప్రమత్తమైన వ్యవసాయశాఖ.. సాగునీటి వనరులు లేనిచోట వరికి బదులు ప్రత్యామ్నాయ వర్షాధార పంటలు వేయాలని రైతులకు విజ్ఞప్తిచేసింది. విత్తనాలను సిద్ధంచేయాలని అధికారులను ఆదేశించింది.

మక్కజొన్నకు కత్తెరపురుగు

రాష్ట్రంలోని 18 జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని వ్యవసాయశాఖ తెలిపింది. ప్రధానంగా నిజామాబాద్, కామారెడ్డి, వరంగల్ అర్బన్ , వరంగల్ రూరల్, నిర్మల్, కరీంనగర్, మహబూబాబాద్ జిల్లాల్లో మక్కజొన్నకు కత్తెరపురుగు సోకిందని పేర్కొన్నది. అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయా జిల్లాల వ్యవసాయాధికారులను ఆదేశించింది.



బుధవారం ఎస్పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న సంస్థ డైరెక్టర్లు

తెలంగాణ విద్యుత్ రంగం రికార్డులు

- **వ్యవసాయానికి 24 గంటల విద్యుత్‌కు ఏడాది పూర్తి**
- **ప్రాజెక్టులు పూర్తయితే పెరుగనున్న డిమాండ్: ఎస్పీడీసీఎల్ చైర్మన్ జీ రఘుమారెడ్డి**

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ సరఫరా ప్రారంభించి ఏడాది పూర్తయింది. ఎస్పీడీసీఎల్ సీజీఎం, ఎస్ఈల ఆధ్వర్యంలో ఆ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జీ రఘుమారెడ్డి కేక్ కట్‌చేసి అధికారులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ విద్యుత్ రంగం అనతికాలంలోనే అనేక రికార్డులను సృష్టించిందని, వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరాతోపాటు అన్నిరంగాలకు నిరంతర విద్యుత్‌ను సరఫరా చేసిందన్నారు. ఏన్నడూ లేనివిధంగా 2018 సెప్టెంబర్ 11న రాష్ట్రంలో 10,818 మెగావాట్లు, అక్టోబర్ 9న 6,961 మెగావాట్ల గరిష్ఠ విద్యుత్ డిమాండ్ ఎదురవగా.. ఆరోజు 233.44 మిలియన్ యూనిట్ల విద్యుత్ సరఫరా చేసినట్టు వివరించారు. గత వేసవిలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 2,958 మెగావాట్ల గరిష్ఠ విద్యుత్ డిమాండ్ ఏలాంటి అంతరాయాలు లేకుండా సరఫరా అయిందని, 2018 మే 29న నగరంలో 62.83 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను సరఫరా చేసినట్టు తెలిపారు. వచ్చే వేసవిలోనూ అవాంతరాలు లేకుండా విద్యుత్‌ను సరఫరాచేస్తామని ధీమావ్యక్తంచేశారు. అనంతరం సీజీఎం, ఎస్ఈలతో ఏర్పాటుచేసిన సమావేశంలో.. రాష్ట్రంలో చేపట్టిన పలు ఇరిగేషన్ ప్రాజెక్టుల వల్ల నీటి లభ్యత పెరుగుతున్నదని, ఫలితంగా వ్యవసాయ రంగం నుంచి డిమాండ్ ఎక్కువగా ఉండే అవకాశమున్నదన్నారు. దానికి అనుగుణంగా ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్ల నిర్వహణను సమర్థంగా నిర్వహించాలని ఆదేశించారు. అంతకుముందు సంస్థ డైరెక్టర్లు టీ శ్రీనివాస్, జే శ్రీనివాసరెడ్డి, జీ పర్వతం, ఎస్ స్వామిరెడ్డి, పీ నరసింహారావు తదితరులు సీఎండీ రఘుమారెడ్డికి పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



తిరువనంతపురంలోని సచివాలయం వద్ద పోలీసుల బందోబస్తు

అయ్యప్ప ఆగ్రహాన్ని చవిచూస్తారు: కాంగ్రెస్, బీజేపీ

తిరువనంతపురం: ఇద్దరు 40 ఏండ్ల వయస్సు గల మహిళలు శబరిమల ఆలయంలో ప్రవేశించడానికి ముఖ్యమంత్రి పినరాయి విజయన్ కారణమని ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీ మండిపడ్డాయి. ఆ మహిళలిద్దరు అయ్యప్ప భక్తుల మనోభావాలను దెబ్బతీశారని కాంగ్రెస్ నేత రమేశ్ చెన్నితల పేర్కొన్నారు. శుద్ధి చేయడం కోసం ఆలయ తలుపులు మూసివేయడం '100 శాతం సరైనదే' అని చెప్పారు. కేరళ ప్రభుత్వం అయ్యప్ప ఆగ్రహాన్ని చవిచూడక తప్పదని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ శ్రీధరన్ చెప్పారు. 'కమ్యూనిస్టు నాయకులు, వారి భవిష్యత్ తరాలు, కేరళ ప్రభుత్వం అయ్యప్ప ఆగ్రహాన్ని తప్పించుకోలేరు' అంటూ శాపనార్థాలు పెట్టారు. ఆలయ ప్రవేశం చేసిన మహిళలు చరిత్ర సృష్టించారన్న మీడియా వ్యాఖ్యలను బీజేపీ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ తప్పు పట్టారు. మీడియాకు సిగ్గుచేటు అని ఆయన వ్యాఖ్యానించారు. ఆలయంలోకి మహిళల ప్రవేశంపై హర్షం వ్యక్తం చేసిన సామాజిక కార్యకర్త తృప్తి దేశాయ్ 'ఇది సమానత్వానికి లభించిన విజయం' అని వ్యాఖ్యానించారు. శబరిమలలోకి ప్రవేశించడానికి దేశాయ్ ప్రయత్నించినప్పుడు అధికారులు ఆమెను విమానాశ్రయం నుంచే వెనుకకు పంపించిన సంగతి తెలిసిందే. అన్ని వయస్సుల మహిళలు బహిరంగంగా ఆలయంలోకి ప్రవేశించాలని, ఇలా రహస్యంగా కాదని సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి అన్నారు. శబరిమలలో పూజలు చేసే హక్కు ప్రతి మహిళకు ఉండాలని సీపీఎం నాయకురాలు బృందాకరత్ అన్నారు.

200 ఏండ్లకు ముందు కూడా నిషేధం

తిరువనంతపురం: శబరిమల ఆలయంలోకి రుతుస్రావం వయస్సు మహిళలు ప్రవేశించకూడదన్న నిషేధం ఎప్పటినుంచి అమలులో ఉందో ఎవరికీ తెలియదు. 19వ శతాబ్దం నాటి బ్రిటీషువారి సర్వే రిపోర్టు ప్రకారం 200 ఏండ్లకు పూర్వం కూడా నిషేధం అమలులో ఉన్నట్టు తెలుస్తున్నది. పది నుంచి 50 ఏండ్లలోపు మహిళలకు ఆలయ ప్రవేశంపై ఉన్న నిషేధానికి 1991లో కేరళ హైకోర్టు చట్టబద్ధత కల్పించింది. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టు గత ఏడాది సెప్టెంబర్ 28న తీర్పును వెలువరించింది. ఆలయంలోకి అన్ని వయస్సుల మహిళలను అనుమతించాలని స్పష్టం చేసింది.

అయ్యప్ప సన్నిధిలోకి ఇద్దరు మహిళలు

- వెలువడిన మూడు నెలల తర్వాత సుప్రీంకోర్టు తీర్పు అమలు
- ఆలయాన్ని శుద్ధి చేసిన ప్రధాన పూజారి.. గంటపాటు తలుపుల మూత
- రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు తెరతీసిన ఆరెస్సెస్, బీజేపీ
- సీపీఎం కార్యకర్తలతో ఘర్షణ: బాష్పవాయువు ప్రయోగం
- సచివాలయం వద్ద పాత్రికేయులపై దాడి

శబరిమల ఆలయంలోకి అడుగుపెట్టిన 40 ఏండ్ల వనితలు
ధ్రువీకరించిన కేరళ సీఎం



కొచ్చిలో స్వీట్లు పంచుకొంటున్న మహిళలు



శబరిమల అయ్యప్ప ఆలయంలోకి ప్రవేశిస్తున్న కనకదుర్గ, బిందు

శబరిమల/తిరువనంతపురం, జనవరి 2: శతాబ్దాల పురాతన సంప్రదాయాన్ని బద్దలు కొడుతూ 50 ఏండ్లలోపు మహిళలు ఇద్దరు శబరిమల ఆలయంలోకి ప్రవేశించారు. హిందూత్వ వాదుల బెదిరింపులను బేఖాతరు చేస్తూ బుధవారం తెల్లవారు జామున శబరిమల ఆలయంలో అడుగుపెట్టిన ఆ మహిళలు చరిత్రను తిరగరాశారు. పోలీసు రక్షణలో పవిత్ర స్థలంలోకి అడుగుపెట్టడం ద్వారా అయ్యప్పను దర్శించుకున్న తొలి బహిష్టు వయస్సుగల మహిళలుగా చరిత్ర సృష్టించారు. అయ్యప్ప ఆలయంలోకి 10 నుంచి 50 ఏండ్ల మధ్య వయస్సుగల మహిళల ప్రవేశంపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మూడు నెలల తరువాత అమలుకావడం విశేషం. నల్లటి దుస్తులు ధరించి, ముఖానికి ముసుగులు వేసుకున్న కనకదుర్గ (44), బిందు (42) వేకువజామున 3:38 నిమిషాలకు ఆలయంలోకి ప్రవేశించారు. ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి పినరాయి విజయన్ ధ్రువీకరించారు. కేరళ ఉత్తర భాగంలోని కాసర్‌గోడ్ నుంచి దక్షిణ భాగంలోని తిరువనంతపురం వరకు 620 కి.మీ. పొడవున 35 లక్షలమందికి పైగా మహిళలు భుజం భుజం కలిపి లింగ సమానత్వం కోసం మానవ హారం నిర్మించిన మరుసటి రోజే ఈ చారిత్రక ఘటన చోటు చేసుకుంది. నిషేధిత వయస్సుగల మహిళలు శబరిమల ఆలయంలోకి ప్రవేశించారన్న వార్త స్థానిక చానెళ్లలో ప్రసారం కాగానే హిందూత్వ సంస్థలు రాష్ట్రంలోని అనేక ప్రాంతాలలో ఆందోళనలు చేపట్టాయి. జాతీయ రహదారులను దిగ్బంధించిన కార్యకర్తలు పలు చోట్ల దుకాణాలను, మార్కెట్లను మూసివేయించారు. తిరువనంతపురంలో బీజేపీ యువజన విభాగం కార్యకర్తలకు, సీపీఎం శ్రేణులకు తీవ్ర స్థాయిలో ఘర్షణలు జరిగాయి. వారిని చెదరగొట్టేందుకు పోలీసులు స్టన్ గ్రెనేడ్లు, బాష్పవాయు గోళాలు, నీటి ఫిరంగులను ప్రయోగించారు. దీంతో తిరువనంతపురంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వివిధ హిందూత్వ గ్రూపులకు గొడుగు సంస్థగా ఉన్న శబరిమల కర్మ సమితి, అంతర్రాష్ట్రీయ హిందూ పరిషద్‌లు గురువారం రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చాయి. మరోవైపు మహిళలు ఆలయ ప్రవేశం చేశారన్న విషయం తెలియగానే శబరిమల ప్రధాన పూజారి కందారు రాజీవరు 'ఆలయ శుద్ధి'కి ఆదేశించారు. దాదాపు గంటపాటు ఆలయం తలుపులు మూసివేసి 'శుద్ధి కలశం (సంప్రోక్షణ)' నిర్వహించారు. రోజూ ఆలయాన్ని మధ్యాహ్నం 12.30 గంటలకు మూసివేస్తారు. కానీ బుధవారం నాడు ఉదయం 10.30 నుంచి 11.30 వరకు మూసివేశారు. ఆలయ పూజారుల చర్యను కోర్టు ధిక్కరణగా కేరళ మంత్రి ఈపీ జయరాజన్ పేర్కొన్నారు.

చరిత్ర సృష్టించిన ఆ ఇద్దరు మహిళలు

శబరిమల ఆలయంలో అయ్యప్పను దర్శించుకున్న కనకదుర్గ, బిందులను పోలీసులు వెంటనే పథనంతిట్టకు తీసుకొచ్చి, అక్కడి నుంచి గుర్తు తెలియని ప్రదేశానికి తరలించారు. వారి ఇండ్ల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. కోజికోడ్ జిల్లా కోయిలాండికి చెందిన బిందు సీపీఐ(ఎంఎల్) కార్యకర్త. ఆమె కాలేజీ లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. మలప్పురంలోని అంగడిపురం పౌరసరఫరాల విభాగంలో కనకదుర్గ కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నారు. వీరిద్దరు మీడియాతో మాట్లాడుతూ, మంగళవారం అర్ధరాత్రి తాము పంబకు చేరుకున్నామని, పోలీసుల రక్షణ లేకుండానే సన్నిధానం వరకు వచ్చామని తెలిపారు. '18 మెట్లు ఎక్కి అయ్యప్పను దర్శించుకున్నాం, మమ్మల్ని ఎవరూ అడ్డుకోలేదు' అని చెప్పారు. తాము ఆలయం మెట్లు ఎక్కుతున్నప్పుడు గానీ, అయ్యప్పకు పూజ చేస్తున్నప్పుడు గానీ ఎవరు ప్రతిఘటించలేదని అన్నారు. తాము కొండపైకి ఎక్కుతున్నప్పుడు అక్కడక్కడా కొందరు భక్తులు కనిపించారని, కానీ వారు తమను అడ్డుకోలేదని తెలిపారు. అయ్యప్ప దర్శనానికి వెళ్లే మహిళలు ధరించే దుస్తులనే తాముకూడా వేసుకున్నామని తెలిపారు. నిజానికి రాజకీయ ఎజెండా ఉన్న వారు మాత్రమే మహిళలను అడ్డుకుంటున్నారని, సామాన్యులకు ఎటువంటి అభ్యంతరం లేదని వారన్నారు. ఇంతకుముం దు డిసెంబర్ 18న కూడా బిందు, కనకదుర్గ అయ్యప్పను దర్శించుకునేందుకు ప్రయత్నించారు. పోలీసుల సాయంతో వారు పంబ నుంచి సన్నిధానానికి కిలోమీటరు దూరంలో ఉన్న మారకూట వరకు వెళ్లా రు. కానీ అక్కడ భక్తులు వీరిని అడ్డుకోవడంతో పోలీసులు వారిని వెనుకకు పంపించారు. శబరిమల ఆలయ సంప్రదాయాన్ని కనకదుర్గ ఉల్లంఘించారని ఆమె కుటుంబ సభ్యులు వ్యాఖ్యానించారు. కొన్ని రోజులుగా ఆమె ఆచూకీ లేదని, దీనిపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేశామని ఆమె సోదరుడు భరత్‌భూషణ్ చెప్పారు. మరోవైపు ఆ ఇద్దరు మహిళలు సాహసం చేశారంటూ పలువురు ట్విట్టర్ ద్వారా ప్రశంసల వర్షం కురిపించారు. లింగ సమానత్వం దిశగా వారు వేసింది ఒక చిన్న అడుగు మాత్రమేనని పేర్కొన్నారు. కొచ్చిలో మహిళలు స్వీట్లు పంచుకున్నారు.



మహిళల ప్రవేశం అనంతరం ఆలయాన్ని శుద్ధి చేస్తున్న పూజారులు

మహిళల అయ్యప్ప దర్శనం నిజమే: విజయన్

కనకదుర్గ, బిందు శబరిమలలో అయ్యప్పను దర్శించుకోవడం నిజమేనని కేరళ సీఎం పినరాయి విజయన్ పేర్కొన్నారు. ఆ మహిళల వెంట కొందరు మఫ్టీలో ఉన్న పోలీసులు వెళ్లారని చెప్పారు. 'ఇంతకుముందు కొన్ని అడ్డంకుల కారణంగా మహిళలు ఆలయంలోకి ప్రవేశించలేకపోయారు. ఈసారి వీరికి ఎటువంటి ఇబ్బందులు ఎదురుకానందున ఆలయంలోకి ప్రవేశించారు. పోలీసులు వారికి రక్షణ కల్పించారు' అని ఆయన ఒకింత విజయగర్వంతో వ్యాఖ్యానించారు. పోలీసుల రక్షణ లేకుండానే తాము ఆలయ ప్రవేశం చేశామని ఆ ఇద్దరు మహిళలు పేర్కొనగా, వారికి పోలీసు రక్షణ కల్పించామని సీఎం చెప్పడం గమనార్హం.

ఇది చరిత్ర కాదు.. సంప్రదాయాలకు విరుద్ధం

నిషేధిత వయస్సున్న మహిళలు శబరిమల ఆలయంలోకి ప్రవేశించడం చరిత్ర సృష్టించడం కాదని, వారు సంప్రదాయాలను ఉల్లంఘించారని పందలం రాజవంశీకుడు శశివర్మ వ్యాఖ్యానించారు. తాము సంప్రదాయాలను మార్చడానికి వ్యతిరేకమని చెప్పారు. ఆలయాన్ని శుద్ధి చేయాల్సిందేనని వర్మ పేర్కొన్నారు. వర్మ ప్రకటన వెలువడిన వెంటనే శబరిమల ఆలయంలో 'ఆలయశుది' జరిపించారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

రాష్ట్ర వ్యాప్తంగా ఆరెస్సెస్, బీజేపీ ఆందోళనలు

ఇద్దరు మహిళలు శబరిమలలోని అయ్యప్పను దర్శించుకున్నారన్న వార్త వెలువడగానే ఆరెస్సెస్, బీజేపీ వాటి అనుబంధ సంస్థలు కేరళ అంతటా ఆందోళన ప్రారంభించాయి. రోడ్లపై బైఠాయిస్తూ, దుకాణాలను, మార్కెట్లను మూసివేసేందుకు వాటి కార్యకర్తలు ప్రయత్నించారు. కోలంచచెరిలో బస్సులపైకి రాళ్లు రువ్వారు. కరుణాగపల్లిలో పోలీసులపై దాడికి యత్నించారు. ఇద్దరు రాష్ట్ర మంత్రులకు నల్లజెండాలతో నిరసన తెలిపారు. రాష్ట్ర సచివాలయం వద్ద విధులలో ఉన్న వివిధ వార్తా సంస్థలకు చెందిన పాత్రికేయులపై బీజేపీ, యువమోర్చా కార్యకర్తలు దాడి చేశారు. ఈ దాడిలో ఏషియానెట్ రిపోర్టర్ ప్రకులా, డెక్కన్ క్రానికల్ ఫొటోగ్రాఫర్ పీతాంబరన్, మాతృభూమి వీడియోగ్రాఫర్ బిజూకు గాయాలయ్యాయి. వారి కెమెరాలు కూడా ధ్వంసమయ్యాయి. సీఎం విజయన్ రాజీనామా చేసేంతవరకు తమ ఆందోళనలు కొనసాగుతాయని శబరిమల కర్మ సమితి నాయకురాలు కేపీ శశికళ అన్నారు. అయితే సుప్రీంకోర్టు తీర్పు అనంతరం రాష్ట్రంలో ఇది ఏడవ బంద్ అని, దీనికి తాము సహకరించబోమని వాణిజ్య సంఘాలు ప్రకటించాయి.



మోదీకి దమ్ము లేదు

- అందుకే పార్లమెంట్‌కు రావడం లేదు
- రాఫెల్ కుంభకోణంపై సమాధానం చెప్పకుండా గదిలో దాక్కొని మొహం చాటేస్తున్నారు
- అనుమతిస్తే ఆడియో టేపు బయటపెడతా
- లోక్‌సభలో రాహుల్‌గాంధీ డిమాండ్
- మద్దతు తెలిపిన శివసేన

న్యూఢిల్లీ, జనవరి 2: రాఫెల్ యుద్ధవిమానాల కొనుగోలు ఒప్పందం విషయమై బుధవారం లోక్‌సభలో అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం సాగింది. ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ప్రధాని నరేంద్రమోదీపై ధ్వజమెత్తారు. మోదీ గదిల్లో దాక్కొంటున్నారని, రాఫెల్ ఒప్పందంపై ప్రశ్నలను ఎదుర్కొనేందుకు పార్లమెంట్‌కు వచ్చే దమ్ము మోదీకి లేదని నిప్పులు చెరిగారు. ఈ ఒప్పందానికి సంబంధించి గోవా మంత్రి మాట్లాడినట్టుగా చెప్తున్న ఓ ఆడియో టేపును లోక్‌సభలో వినిపించేందుకు రాహుల్ స్పీకర్ అనుమతిని కోరడంతో సభలో హైడ్రామా చోటుచేసుకున్నది. ఇది తప్పుడు టేప్ అని, కల్పితమని ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ పేర్కొన్నారు. ఈ ఆడియో టేపు నిజమైనదేనని రాహుల్ నిరూపించగలరా? అని జైట్లీ ప్రశ్నించారు. ఇది కల్పితమని నిరూపితమైతే రాహుల్ సభా హక్కుల తీర్మానాన్ని ఎదుర్కోవడంతోపాటు బహిష్కరణకు కూడా గురికావలసి ఉంటుందని జైట్లీ హెచ్చరించారు. దీంతో ఆ ఆడియో టేపును ప్లేచేయబోనని, దాని వాస్తవికతను నిరూపించబోనని రాహుల్ పేర్కొనడంతో.. అది తప్పుడు టేపని రాహుల్‌కు తెలుసని, అందుకే ఆయన భయపడ్డారని, రాహుల్ చెప్తున్నవన్నీ అబద్ధాలేనని జైట్లీ విమర్శించారు. ఈ వాదోపవాదాలతో గందరగోళం నెలకొనడంతో సభా కార్యకలాపాలను పదేపదే వాయిదా వేయాల్సి వచ్చింది. ఆ తర్వాత ఆ ఆడియో క్లిప్‌ను ప్లేచేసేందుకు స్పీకర్ అనుమతించలేదు. దీంతో ఈ ఆడియో క్లిప్‌ను చూసి బీజేపీ సభ్యులు భయపడుతున్నారని రాహుల్ ఎద్దేవా చేశారు. రాఫెల్ ఒప్పందానికి సంబంధించిన ఫైలు రక్షణశాఖ మాజీ మంత్రి, గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారికర్ బెడ్‌రూంలో ఉన్నదని గోవా మంత్రి విశ్వజిత్‌రాణే మరెవరితోనే చెప్తున్నట్టు ఈ ఆడియో టేపులో ఉన్నది. అయితే ఇది కల్పిత టేప్ అని రాణే ఇప్పటికే స్పష్టంచేశారని అరుణ్‌జైట్లీ తెలిపారు. రాఫెల్ ఒప్పంద వ్యవహారంలో తనపై వ్యక్తిగత ఆరోపణలేమీ రాలేదంటూ ప్రధాని మోదీ ఓ ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలను కూడా రాహుల్ తన ప్రసంగంలో ప్రస్తావించారు. మోదీ వ్యాఖ్యల్లో నిజం లేదని, యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పంద విషయమై యావత్తు దేశం ఆయనను సూటిగా ప్రశ్నిస్తున్నదని రాహుల్ పేర్కొన్నారు. ఏఎన్‌ఐ వార్తాసంస్థకు మంగళవారం ఇచ్చిన ఇంటర్వ్యూలో మోదీ 90 నిమిషాలపాటు సుదీర్ఘంగా మాట్లాడినప్పటికీ రాఫెల్ వ్యవహారానికి సంబంధించిన ప్రశ్నలకు ఆయన సమాధానమివ్వలేదన్నారు. ఈ ఒప్పందంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)తో దర్యాప్తు జరిపించాలన్న కాంగ్రెస్ పార్టీ డిమాండ్‌ను రాహుల్ పునరుద్ఘాటించారు. 'రాఫెల్ ఒప్పందంలో అవినీతి జరిగింది. ప్రభుత్వరంగ సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్) నుంచి రాఫెల్ ఒప్పందాన్ని లాక్కున్నారు. దీనిపై జేపీసీతో దర్యాప్తు జరిపించాలని మేము డిమాండ్ చేస్తున్నాం. 'డబుల్ ఏ' (అనిల్ అంబానీ) జేబులో మోదీ అప్పనంగా రూ.30 వేలకోట్లు ఎందుకు వేశారో దేశ ప్రజలు తెలుసుకోవాలనుకొంటున్నారు' అని రాహుల్ అన్నారు. అనిల్ అంబానీ లోక్‌సభ సభ్యుడు కానందున ఆయన పేరును సభలో ప్రస్తావించవద్దని స్పీకర్ వారించడంతో ఆయనను 'డబుల్ ఏ' అంటూ రాహుల్ సంబోధించారు. అనిల్ అంబానీని 'విఫలమైన వ్యాపారవేత్త'గా మోదీకి 'ఆప్త మిత్రుడి'గా అభివర్ణించారు. ఫ్రాన్స్ సంస్థ దస్సాల్ట్ నుంచి రాఫెల్ ఆఫ్‌సెట్ కాంట్రాక్టును దక్కించుకోవడానికి కేవలం పది రోజుల ముందే అనిల్ అంబానీ రక్షణ సంస్థ రిజిస్టర్ అయిందని ఆరోపించారు. సభలో రాహుల్ ప్రసంగిస్తున్నప్పుడు ఏఐఏడీఎంకే సభ్యులు కావేరీ నదీ జలాల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వెల్‌లోకి దూసుకెళ్లి నిరసన వ్యక్తం చేశారు. దీంతో మోదీని రక్షించేందుకే ఏఐఏడీఎంకే సభ్యులు ఇలా వ్యవహరిస్తున్నారని రాహుల్ ఆరోపించారు. పార్లమెంట్‌కు రాకుండా మోదీ తన గదిలో దాక్కొంటుంటే.. సభలో ఉన్న రక్షణశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఏఐఏడీఎంకే సభ్యుల వెనుక దాక్కొంటున్నారని రాహుల్ దుయ్యబట్టారు.


> 'రాఫెల్ ఒప్పందంలో అవినీతి జరిగింది. ప్రభుత్వరంగ సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్) నుంచి రాఫెల్ ఒప్పందాన్ని లాక్కున్నారు.
>
> 'డబుల్ ఏ' (అనిల్ అంబానీ) జేబులో మోదీ అప్పనంగా రూ.30 వేలకోట్లు ఎందుకు వేశారో దేశ ప్రజలు తెలుసుకోవాలనుకొంటున్నారు'
>
> జేపీసీతో దర్యాప్తు జరిపించాలని మేము డిమాండ్ చేస్తున్నాం. ఇందుకు బీజేపీ నేతలు ఎందుకు జంకుతున్నారో అర్థంకావడంలేదు.

అవినీతి జరుగకపోతే భయమెందుకు: శివసేన

రాఫెల్ కుంభకోణంపై జేపీసీతో దర్యాప్తు జరిపించాలన్న విపక్షాల డిమాండ్‌కు బీజేపీ మిత్రపక్షమైన శివసేన కూడా మద్దతు తెలిపింది. ఈ అంశాన్ని బోఫోర్స్ కుంభకోణంతో పోల్చింది. పారదర్శకత గురించి పదేపదే మాట్లాడుతున్న మోదీ ప్రభుత్వం.. ఈ ఒప్పందంపై జేపీసీతో దర్యాప్తు జరిపించేందుకు ఎందుకు నిరాకరిస్తున్నది? అని లోక్‌సభలో చర్చ సందర్భంగా శివసేన ఎంపీ అరవింద్ సావంత్ ప్రశ్నించారు.

రాఫెల్‌పై జేపీసీ దర్యాప్తు అనవసరం

- మోదీ సర్కారుపై బురద చల్లేందుకే కట్టుకథలు
- కల్పిత ఆడియో టేపుతో అబద్ధాలను వండుతున్నారు
- రాహుల్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తిన అరుణ్‌జైట్లీ
- పేపర్ ప్లేన్లతో కాంగ్రెస్ సభ్యుల నిరసన




> 'అవినీతితో కాంగ్రెస్ చేతులు ఇప్పటికే మకిలమయ్యాయి. అందుకే ఆ పార్టీ మచ్చలేని మోదీ సర్కారుపై బురద చల్లుతుంది

న్యూఢిల్లీ, జనవరి 2: రాఫెల్ యుద్ధవిమానాల కొనుగోలు ఒప్పందంపై జేపీసీతో దర్యాప్తు జరిపించాలని లోక్‌సభలో బుధవారం కాంగ్రెస్ పార్టీ చేసిన డిమాండ్‌ను కేంద్ర ప్రభు త్వం తోసిపుచ్చింది. ఈ ఒప్పందంలో కుంభకోణం జరిగిందని ఆరోపించిన కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీపై ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ ఎదురుదాడికి దిగారు. రాఫెల్ ఒప్పందం పట్ల ఇప్పటికే సుప్రీంకోర్టు సంతృప్తిని వ్యక్తంచేసిందని, కనుక దీనిపై జేపీసీతో దర్యాప్తు జరిపించాల్సిన అవసరం లేదని జైట్లీ స్పష్టం చేశారు. దీంతో కాంగ్రెస్ సభ్యులు నిరసన వ్యక్తంచేస్తూ జైట్లీ ప్రసంగాన్ని అడ్డుకున్నారు. కొందరు కాంగ్రెస్ సభ్యులు మరో అడుగు ముందుకేసి పేపర్ ప్లేన్లను విసరడంతో.. 'మీరింకా చిన్న పిల్లలేనా?' అంటూ స్పీకర్ సుమిత్రా మహాజన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జేపీసీ పక్షపాతంతో కూడినదని, అది సజావుగా దర్యాప్తు జరుపలేదని జైట్లీ చెప్పారు. లోక్‌సభలో అబద్ధాలు చెప్తూ కల్పిత ఆడియో టేపుతో రాహుల్ కట్టుకథలు అల్లుతున్నారని జైట్లీ పేర్కొంటూ.. గతంలో మహానాయకులు నడిపించిన కాంగ్రెస్ పార్టీకి ఇప్పుడు ఓ జెంటిల్‌మన్ నాయకత్వం వహిస్తున్నారని, యుద్ధవిమానాల గురించి ఆయనకు కనీస అవగాహన లేకపోవడం విషాదకరమని అన్నారు. అనంతరం బోఫోర్స్, అగస్టా వెస్ట్‌ల్యాండ్, నేషనల్ హెరాల్డ్ కేసులను జైట్లీ ప్రస్తావించారు. 'జేమ్స్‌బాండ్ చిత్రంలో విలన్ చెప్పినట్టుగా ఏదో ఒక అవినీతి కేసు అయితే ఆ కుటుంబాన్ని (నెహ్రూ- గాంధీ కుటుంబాన్ని) అనుమానంతో వదిలేయవచ్చని, రెండు కేసులైతే కాకతాళీయమనుకోవచ్చు. కానీ మూడు కేసులంటే వారు కచ్చితంగా అవినీతికి పాల్పడ్డారని స్పష్టమవుతున్నది' అని జైట్లీ అన్నారు.

'రాఫెల్ తీర్పు'ను పునఃసమీక్షించండి

- సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేసిన యశ్వంత్ సిన్హా, అరుణ్ శౌరి, ప్రశాంత్ భూషణ్



అరుణ్‌శౌరి, యశ్వంత్ సిన్హా

న్యూఢిల్లీ, జనవరి 2: రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందంపై దాఖలైన అన్ని పిటిషన్లను కొట్టివేస్తూ డిసెంబర్ 14న వెలువరించిన తీర్పును పునఃసమీక్షించాలని కోరుతూ కేంద్ర మాజీ మంత్రులు యశ్వంత్ సిన్హా, అరుణ్ శౌరి, సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ బుధవారం అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కేంద్ర ప్రభుత్వం సీల్డ్ కవర్‌లో కోర్టుకు సమర్పించిన పత్రం పూర్తి అసత్యాలతో కూడుకున్నదని, దానిపైన ఎవరి సంతకం లేదని, ఆ పత్రం ఆధారంగా కోర్టు తీర్పు వెల్లడించిందని పేర్కొన్నారు. ఆ పత్రంలో కేంద్రం పేర్కొన్న అంశాలను పరిశీలించేందుకు తమకు అవకాశం ఇవ్వలేదని, దీంతో సదరు పత్రం వల్ల మొత్తం తీర్పు ప్రభావితమైందని వివరించారు. రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందంలో అనుమానించదగ్గ విషయాలేమీ లేవని పేర్కొంటూ డిసెంబర్ 14న సుప్రీంకోర్టు అన్ని పిటిషన్లను కొట్టివేసిన విషయం తెలిసిందే. ఈ తీర్పుపై తాజాగా రివ్యూ పిటిషన్ దాఖలైంది. అలాగే ఈ పిటిషన్‌పై బహిరంగ కోర్టులో విచారణ జరపాలని పిటిషనర్లు కోరారు. విమానాల ధరలకు సంబంధించి కేంద్రం సుప్రీంకోర్టుకు ఓ నోట్ సమర్పించిందని, అయితే దాన్ని పిటిషనర్లకు చూపించలేదన్నారు. ధరల వివరాలను కాగ్‌కు పంపించినట్లు, కాగ్ నివేదికను ప్రజాపద్దుల కమిటీ పరిశీలించినట్లు కేంద్రం సుప్రీంకోర్టును తప్పుదోవపట్టించిదన్నారు.వాస్తవానికి కాగ్ ఇంకా ఆడిట్ పూర్తి చేయలేదని వివరించారు.


పారికర్ పడకగదిలో రాఫెల్ ఫైలు

- డబ్బు వసూలు కోసమే ఆ సమాచారాన్ని తనవద్ద ఉంచుకొన్నారు
- గోవా మంత్రి, మరో వ్యక్తికి మధ్య జరిగిన సంభాషణ ఆడియోను వినిపించిన కాంగ్రెస్ నేత సూర్జేవాలా

న్యూఢిల్లీ, జనవరి 2: రాఫెల్ యుద్ధవిమానాల కొనుగోలు ఒప్పందానికి సంబంధించిన పూర్తి ఫైలు గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారికర్ పడకగదిలో ఉన్నట్టు ఆ రాష్ట్ర మంత్రి విశ్వజిత్‌రాణే మరెవరితోనే చెప్తున్నట్టు ఉన్న ఆడియో టేపులోని వివరాలను కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి రణ్‌దీప్ సూర్జేవాలా బుధవారం మీడియాకు వెల్లడించారు. 'ముఖ్యమంత్రి పారికర్ చాలా ఆసక్తికరమైన ప్రకటన చేశారు. రాఫెల్ ఒప్పందానికి సంబంధించిన పూర్తి సమాచారం తన ఫ్లాట్‌లోని బెడ్‌రూంలో ఉన్నదని, ఈ ఒప్పందానికి సంబంధించిన ప్రతి పత్రం తనవద్ద ఉన్నదని పారికర్ తెలిపారు. డబ్బు వసూలు కోసమే పారికర్ ఈ పత్రాలను తనవద్ద ఉంచుకున్నట్టు స్పష్టమవుతున్నది' అని విశ్వజిత్‌రాణే ఓ వ్యక్తికి చెప్తున్నట్టు ఆ ఆడియో క్లిప్‌లో ఉన్నది. ఈ ఆడియో క్లిప్‌ను లోక్‌సభలో వినిపించేందుకు అనుమతి ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ చేసిన విజ్ఞప్తిని స్పీకర్ సుమిత్రా మహాజన్ తిరస్కరించడంతో పార్లమెంట్ వెలుపల సూర్జేవాలా ఆ ఆడియో టేపులోని సంభాషణను మీడియాకు వినిపించారు. అయితే ఆ ఆడియో క్లిప్పులోని మాటలు రాణే మాట్లాడినవేనని నిర్ధారణ కాలేదు. ఇది కల్పిత ఆడియో టేపని, దీనిపై గోవా ప్రభుత్వం విచారణకు ఆదేశించిందని విశ్వజిత్‌రాణే బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాకు తెలిపారు.

లోక్‌సభకు ఆధార్ సవరణ బిల్లు

- ఆధార్ లింక్ చేయడం ఇక తప్పనిసరి కాదన్న కేంద్రం
- బిల్లును వ్యతిరేకించిన కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్
- 24 మంది అన్నాడీఎంకే ఎంపీలను సస్పెండ్ చేసిన స్పీకర్



లోక్‌సభ వెల్‌లో నినాదాలు చేస్తున్న ఏఐఏడీఎంకే సభ్యులు

న్యూఢిల్లీ, జనవరి 2: ఆధార్ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం బుధవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ప్రైవేట్ సంస్థలు ఆధార్ వినియోగించడంపై ఆంక్షలు విధిస్తూ సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన నేపథ్యంలో.. బ్యాంకు ఖాతాలు తెరవడానికి, మొబైల్ కనెక్షన్లు తీసుకోవడానికి ఆధార్ ఇవ్వడం వినియోగదారుల ఐచ్ఛికంగా పేర్కొంటూ తాజా సవరణ బిల్లును కేంద్రం ప్రవేశపెట్టింది. అత్యున్నత న్యాయస్థానం వెలువరించిన తీర్పుకు అనుగుణంగానే సవరణలు చేశామని కేంద్ర మంత్రి రవిశంకర్‌ప్రసాద్ స్పష్టం చేశారు. గోప్యత ఉల్లంఘనకు ఇక తావుండదన్నారు. సమాచారణ పరిరక్షణ బిల్లును కేంద్రం సిద్ధం చేసిందని, త్వరలోనే దీన్ని పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. ఆధార్ లింక్ చేయడం ఇక తప్పనిసరి కాదన్నారు. అయితే ఈ బిల్లుపై కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, ఆర్‌ఎస్‌పీ సభ్యులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు.సుప్రీంకోర్టు తీర్పును తాజా బిల్లు అతిక్రమిస్తున్నదన్నారు. ముందు సమాచార పరిరక్షణ చట్టాన్ని సవరించాల్సిన అవసరం ఉందన్నారు. మరోవైపు కావేరి సమస్యను పరిష్కరించాలంటూ వరుసగా నిరసన తెలుపుతూ సభా కార్యకలాపాలను అడ్డుకుంటున్న అన్నాడీఎంకే ఎంపీలు 24 మందిని లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ బుధవారం సస్పెండ్ చేశారు. వీరంతా వెల్‌లోకి దూసుకొచ్చి ప్లకార్డులతో నిరసన తెలుపడమే కాకుండా కొన్ని పేపర్లు చించి లోక్‌సభ సిబ్బందిపై విసిరారు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన స్పీకర్ వరుసగా ఐదు సమావేశాలకు హాజరుకావొద్దని ఆదేశించారు.

రాజ్యసభలోనూ డీఎంకే, అన్నాడీఎంకే ఆందోళన

కావేరీ అంశంపై డీఎంకే, అన్నాడీఎంకే సభ్యులు రాజ్యసభలోనూ ఆందోళన కొనసాగించారు. ఎంత చెప్పిన వినకపోవడంతో వారిని సభ నుంచి బయటకు వెళ్లాల్సిందిగా రాజ్యసభ చైర్మన్ ఆదేశించారు. అయినా వారు వినకపోవడంతో సభ గురువారానికి వాయిదా పడింది.కాగా, దేశవ్యాప్తంగా 123 కోట్ల మందికి ఆధార్ కార్డులు ఇచ్చినట్లు కేంద్రమంత్రి హన్స్‌రాజ్ రాజ్యసభలో వెల్లడించారు.



రాఫెల్ కుంభకోణం గురించిన ఫైల్ ఒకటి తన బెడ్‌రూములో ఉన్నదని మనోహర్ పారికర్ అన్నారు. అలాంటప్పుడు కాపలాదారు ఎందుకు పారికర్‌కు భయపడుతున్నాడు. ఇప్పటికైనా మోదీ ప్రభుత్వం నిజాలను దాయాలని ప్రయత్నించవద్దు. నిజాయితీ ఉంటే జేపీసీ వేయాలి.


రణ్‌దీప్‌సింగ్ సుర్జేవాలా, కాంగ్రెస్ అధికార ప్రతినిధి

భారత రాజకీయాల్లో సుదీర్ఘ చరిత్ర కలిగి, ఉద్దండులు నాయకత్వం వహించిన కాంగ్రెస్‌కు నేతగా ఓనమాలు తెలియనివారు ఇప్పుడు నాయకుడయ్యాడు. ఆయనకు కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ అంటే తెలియదు, చెబితే అర్థం చేసుకోలేడు. కొందరికి నిజాన్ని ఒప్పుకోలేని సహజ గుణమేదో ఉంటుంది. అదే రాహుల్ సమస్య.



అరుణ్ జైట్లీ, కేంద్రమంత్రి

చరిత్రలో నేడు



1910

ఎనిమిది గంటల పనిదినం కోసం బ్రిటిష్ గని కార్మికుల సమ్మె.

1925

ఇటలీ పార్లమెంట్‌ను రద్దుచేసి అధినేతగా ప్రకటించుకున్న ముస్సోలిని.





1958

దక్షిణ ధృవాన్ని చేరుకున్న ఎడ్మండ్ హిల్లరీ.

1960 దశకంలో కేరళ నుంచి మొదటితరం గల్ఫ్ దేశాలకు వలసలు ప్రారంభమైన నాటినుంచి కేరళ ఆర్థిక స్వరూపమే మారిపోయింది. ఒకానొక దశలో కేరళ ఆర్థిక వ్యవస్థలో గల్ఫ్ వలసదారుల ఆర్థిక వనరులు మూడింట ఒక వంతుగా నమోదయ్యాయి. అయితే గల్ఫ్ దేశాలు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయినా కేరళ ఆర్థిక కార్యకలాపాల్లో తగ్గుముఖం పట్టలేదు. కేరళ నుంచి గల్ఫ్‌కు బదులు ఐటీ, కంప్యూటర్ నిపుణులుగా పాశ్చాత్య దేశాలకు వలసలు పెరుగటంతో కేరళ ఆర్థికరంగం స్థిరంగా ముందుకుపోతుండటం గమనార్హం.

ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్

2020లో జరుగబోయే అమెరికా అధ్యక్ష ఎన్నికల బరిలో డెమోక్రాట్ల తరఫున ఎలిజబెత్ వారెన్ పేరు ప్రముఖంగా వినిపిస్తున్నది. హిల్లరీ క్లింటన్ కన్నా ట్రంప్‌పై విమర్శల్లో దూకుడుగా ఉన్న వారెన్ వర్ణ, జాతి వివక్ష, మధ్యతరగతి వర్గాల ఆర్థిక స్థితిగతులు ప్రధాన ప్రచారాస్త్రంగా చేసుకుంటున్నారు. అలాగే ట్రంప్ అనుసరిస్తున్న విచ్ఛిన్నకర రాజకీయాల మూలంగానే అమెరికా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నదని విమర్శిస్తూ దాడిచేస్తున్న వారెన్ డెమోక్రాట్ల ఆశాకిరణంగా మారిపోయారు.

ది హిందూ

గ్రామ స్వరాజ్యం

తెలంగాణ రాష్ట్రంలో తొలిసారిగా పంచాయతీ ఎన్నికలు జరుగడానికి రంగం సిద్ధమైంది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ నాలుగున్నరేండ్లలో ముఖ్యమంత్రి కేసీఆర్ సాగించిన పరిపాలన విధానం ఈ పంచాయతీ ఎన్నికల ప్రాధాన్యాన్ని పెంచింది. ఏడు దశాబ్దాలకు పైగా స్వతంత్ర పాలనలో కేంద్ర రాష్ట్రాల్లో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా గ్రామాభ్యుదయంపై దృష్టి సారించ లేదు. దేశంలో అధిక సంఖ్యాకులు గ్రామాల్లోనే ఉంటారు. ఇప్పటికీ మనది వ్యవసాయ సమాజమే. అయినా అభివృద్ధి అంతా నగరాలకే పరిమితమైంది. గ్రామీణుల జీవితాలు బడ్జెట్‌లో ప్రాధాన్యం పొందలేకపోయాయి. వ్యవసాయం, కులవృత్తులు సంక్షోభంలో పడ్డాయి. కానీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గ్రామాల అవసరాలకు అనుగుణమైన బడ్జెట్ రూపొందాలనే విధానం మొదలైంది. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలనే దృక్పథంలో రైతుల సంక్షేమానికి అనుసరించిన విధానాలు గ్రామాభివృద్ధికి బాటవేశాయి. మరోవైపు కుల వృత్తులకు ప్రోత్సాహం లభించింది. సంక్షేమ పథకాలు భారీస్థాయిలో అమలయ్యాయి. గ్రామాలకు మౌలిక వసతులు పెరిగాయి. ఈ క్రమంలో గ్రామాలకు కోట్లాది రూపాయలు ప్రవహించాయి. పరాయిపాలనలో చితికిపోయిన తెలంగాణ సమాజం మళ్ళా చిగురించింది. గ్రామాలను అభివృద్ధి చేయడం కాదు, గ్రామాలు తమకు తామే అభివృద్ధి చెందాలనేది కేసీఆర్ అభిమతం. అందువల్లనే ఈ ఎన్నికలు గతంతో పోలిస్తే ప్రత్యేకమైనవిగా చెప్పవచ్చు.

గ్రామాలకు తగినన్ని అధికారాలు, బాధ్యతలు ఉండాలనే ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచనకు అనుగుణంగా కొత్త పంచాయతీరాజ్ చట్టానికి రూపకల్పన జరిగింది. దీనిప్రకారం సర్పంచ్‌కు విశేష అధికారాలు, బాధ్యతలు ఉంటాయి. గతంలో పంచాయతీ ఎన్నికలంటే పార్టీల మధ్య కుమ్ములాటలు అధికంగా ఉండేవి. ప్రభుత్వ పథకాలను సక్రమంగా అమలుచేయకుండా, ప్రతి పనికి దళారులు ఉండేవారు. వీరు రాజకీయ నాయకులను ఆశ్రయించేవారు. పైనుంచి నిధులు తెచ్చుకోవడం, ఖర్చు చేయడమే ప్రధానంగా ఆలోచించేవారు. రాజకీయ నాయకులు లాలూచీ పడటం, ప్రజల గురించి పట్టించుకోకపోవడం పరిపాటి. ఉదాహరణకు ప్రతి గ్రామంలో నీటి ట్యాంకు ఉంటుంది. కాంట్రాక్టు కోసం వాటిని కట్టించడం గురించి చూపిన ఆసక్తి ప్రజలకు మంచినీళ్లు అందించడంపై ఉండేది కాదు. ఈ నిధుల దుర్వినియోగంలో సాగే అవినీతి మూలంగా ప్రజాస్వామ్య సౌధం పునాదులే అవినీతిమయమయ్యాయి. గ్రామం అభివృద్ధి చెందినా, ప్రజల్లో చైతన్యం పెరిగినా తమ స్వార్థ ప్రయోజనాలకు ముప్పు అనే దురాలోచన నాయకులకు ఉండేది. ఢిల్లీలో, రాష్ట్రస్థాయిలో ఎన్ని గొప్ప పథకాలు చేపట్టినా ఆచరణలో విఫలం కావడానికి కారణం గ్రామాల్లోని ఈ బాధ్యతారాహిత్యమే. అందుకే ముఖ్యమంత్రి కేసీఆర్ గ్రామాలకు అధికారాలతో పాటు జవాబుదారీతనం ఉండాలని భావిస్తున్నారు. గతంలో మాదిరిగా కాకుండా ఇప్పుడు ప్రతి పంచాయతీకి నిధులు పెంచుకునే అవకాశాలు ఉంటాయి. నిధులను సద్వినియోగం చేయడం, ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం తప్పనిసరి అయ్యేవిధంగా కట్టుదిట్టాలు ఉంటాయి. అంతిమంగా ప్రజల చైతన్యమే గ్రామాభివృద్ధికి బాట వేస్తుంది.

> **ఇప్పుడు ప్రతి చిన్న పల్లె కూడా పంచాయతీగా మారడం వల్ల అక్కడి జనం సొంతంగా అభివృద్ధి చెందడానికి అవకాశం ఏర్పడ్డది. ఈ నేపథ్యంలో ఈ కొత్త గ్రామాల, తండాల ప్రజలు విభేదాలు మరిచి ఒక్కతాటిపై నిలిచి ఏకగ్రీవ ఎన్నికల వైపు మొగ్గు చూపాలె. పరాయి పాలనలో పెంచిపోషించిన విద్వేషాలు ఇప్పుడు తెలంగాణ పల్లెల్లో లేవు. అందువల్ల కొత్తవే కాకుండా పాత గ్రామాల ప్రజలు ఏకగ్రీవ ఎన్నికలు జరుపుకొని, అభివృద్ధి పథంలో పయనిస్తే, దేశానికి మార్గదర్శనం చేసినవారమవుతాం.**

పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలకు అనేక కోణాలుంటాయి. పార్టీల విధానాలతో పాటు అనేక అంశాలను బేరీజు వేసుకొని చూడాల్సి ఉంటుంది. ఉదాహరణకు ఇప్పటివరకు జరిగిన రెండు అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ అస్తిత్వ పరిరక్షణ ప్రధానాంశంగా నిలిచింది. కానీ పంచాయతీ ఎన్నికలు ఇందుకు భిన్నమైనవి. ఒక్కమాటలో చెప్పాలంటే ఇదొక ప్రత్యక్ష ప్రజాస్వామ్య పద్ధతి. పార్టీలు, గ్రూపులకు అతీతంగా ప్రజలు కలిసికట్టుగా అభివృద్ధి చెందడానికి ఈ ఎన్నికలను ఉపయోగించుకోవాలనేదే మనం కోరుకోవలసింది. అందుకే పంచాయతీస్థాయిలో పార్టీ ప్రాతిపదికను తొలిగించారు. ప్రజలంతా ఒక అవగాహనకు వచ్చి, ప్రతి గ్రామంలో ఏకగ్రీవ ఎన్నిక జరిగే విధంగా చూడాలె. ముఖ్యంగా చదువుకున్నవారు, యువత ఈ విషయంలో చొరవ చూపాలె. ఏకగ్రీవ ఎన్నిక జరిగిన పంచాయతీకి పది లక్షల రూపాయల నిధి బహుమానంగా లభిస్తుంది. అదనంగా వచ్చే ఈ పది లక్షల రూపాయలను గ్రామీణాభివృద్ధికి ఉపయోగించుకోవచ్చు. ప్రభుత్వం అనేక శివారు పల్లెలను, తండాలను పంచాయతీలుగా ప్రకటించింది. దీనివల్ల నాలుగు వేలకు పైగా కొత్త పంచాయతీలు ఏర్పడ్డాయి. ఇంతకాలం గ్రామానికి ఆనుకొని ఉన్న చిన్న పల్లెలను ప్రధాన గ్రామంలోని నాయకులు పట్టించుకునేవారు కాదు. ఇక తండాల సంగతి చెప్పవలసిన అవసరం లేదు. ఇప్పుడు ప్రతి చిన్న పల్లె కూడా పంచాయతీగా మారడం వల్ల అక్కడి జనం సొంతంగా అభివృద్ధి చెందడానికి అవకాశం ఏర్పడ్డది. ఈ నేపథ్యంలో ఈ కొత్త గ్రామాల, తండాల ప్రజలు విభేదాలు మరిచి ఒక్కతాటిపై నిలిచి ఏకగ్రీవ ఎన్నికల వైపు మొగ్గు చూపాలె. పరాయి పాలనలో పెంచిపోషించిన విద్వేషాలు ఇప్పుడు తెలంగాణ పల్లెల్లో లేవు. అందువల్ల కొత్తవే కాకుండా పాత గ్రామాల ప్రజలు ఏకగ్రీవ ఎన్నికలు జరుపుకొని, అభివృద్ధి పథంలో పయనిస్తే, దేశానికి మార్గదర్శనం చేసినవారమవుతాం.

స్మరణ

మహిళా పోరాట స్ఫూర్తి

సమాజం మారాలని స్త్రీ లోకపు ఆత్మగౌరవం కోసం జీవితాన్ని త్యాగం చేసిన ధీరమాత సావిత్రీబాయి పూలే. ఆమె తొలి భారతీయ సంఘ సంస్కర్త, ఉపాధ్యాయిని, రచయిత్రి. నిమ్న వర్గాల అభ్యున్నతికి కృషిచేసిన జ్యోతి పూలే భార్య. కుల, మత భేదాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమ స్వరూపిణి. ఆకాశంలో సగం అంటూ.. అందని ఆకాశం కాదు, కింద నేలమీద సగం కావాలి అంటూ తన జీవితం ద్వారా స్ఫూర్తి రగిలించారు సావిత్రిబాయి.

పిల్లల్ని కనాలనే కోరికను త్యజించి ప్రపంచమే ఇల్లుగా చేసుకొని అనాథలను తన బిడ్డలుగా చేసుకున్నది సావిత్రీ బాయి. 19వ శతాబ్దంలో కుల వ్యతిరేక ఉద్యమాల్లో స్త్రీ హక్కుల పొరాటంలో సావిత్రి బాయి నిర్వహించిన పాత్ర ఎనలేనిది. 1890లో భర్త జ్యోతిరావు పూలే మరణిస్తే అంత్యక్రియలు జరిపే సందర్భంలో బంధువులు, దత్తపుత్రులు ఘర్షణ పడుతుంటే తానే చితికి నిప్పంటించి అంత్యక్రియలు పూర్తిచేసింది.



మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలని ఆమె చేసిన కృషి, పోరాటం, వృథా కారాదు. స్త్రీ జీవితం అడుగడుగునా వివక్షకు, అణిచివేతకు గురవుతుందని అందరికీ తెలిసిందే. పుట్టకముందే వారిని చంపేస్తున్నారు. రోజు రోజుకూ బాలికలపై, స్త్రీలపై జరుగుతున్న అకృత్యాలు పెరుగటం విషాదం. సమాజంలో స్త్రీలకు సరైన రక్షణ, సదుపాయాలు కల్పించడంలో విఫలమవుతున్నాం. పూలే పోరాడి బాటలు వేసి ఇప్పటికి 200 ఏండ్లు అయినప్పటికీ గృహహింస, అఘాయిత్యాలు ఇంకా జరుగుతున్నాయి. మహిళా బిల్లు ఇప్పటికీ ఆమోదం పొందలేదు, ఎప్పటికి అవుతుందో తెలియదు. ఆమె ఆశయాలు ఫలించాలంటే మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి. అన్ని రంగాలతో పాటు రాజకీయరంగంలో సమాన వాటా దక్కితేనే మహిళలు నిజమైన అభివృద్ధిని సాధించగలుగుతారు. ఆమె ఆశయసిద్ధి కోసం ప్రతి ఒక్కరు నడుం బిగించాలి. ఆ రోజు త్వరగా రావాలని ఆశిద్దాం.

- కాళంరాజు వేణుగోపాల్

(నేడు సావిత్రీబాయి పూలే జయంతి)

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

ఆలోకన



టంకశాల అశోక్

కకావికలమైన కమ్యూనిస్టులు

వామపక్షాలు ఇతర పార్టీలతో కన్న ఎక్కువగా తమలో తాము, తమతో తాము చేసుకునే యుద్ధం వల్ల ఇట్లా ఛిన్నాభిన్నమైపోయాయి. సీపీఐ, సీపీఎంలకు తమ అంతర్గత విధానాలు ఏమిటో, తమ పరస్పర సంబంధాలు ఏమిటో బోధపడకుండా ఉంది. ఇది వారి మౌలిక వైఫల్యం కాగా, ప్రజలకు సంబంధించిన పరిస్థితులు ఏమిటో, వారితో తమ సంబంధాలు ఏమిటో, తాము బూర్జువాలు అని పిలిచే పార్టీలతో వ్యవహరించటం ఏ విధంగానో ఏదీ అంతుబట్టకుండా మారింది. ఇది వారి సర్వ సమగ్ర దివాళాకోరుతనం వలె కనిపిస్తున్నది.

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఈ రెండు కమ్యూనిస్టు పార్టీలకు మొత్తం ఎన్నికల చరిత్రలోనే ఎన్నడూ లేనంత తక్కువ ఓట్లు లభించాయి. సీట్ల సంఖ్య ఇరువురికి కూడా శూన్యమయ్యాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014 ఎన్నికల్లో చెరొక స్థానం రాగా ఈసారి అవి కూడా మిగులలేదు. ఓట్లు చెరొక అర శాతం ప్రాంతంలో ఉన్నట్లున్నాయి. సీపీఐ, సీపీఎం, విప్లవ గ్రూపులు కలిపి ఒకే పార్టీగా ఉండినప్పుడు అరువై ఏండ్ల కిందట మహోధృతమైన రీతిలో రైతాంగ సాయుధ పోరాటం చేశాయి. తర్వాత జరిగిన మొదటి అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం ముంగిట నిలిచాయి. అప్పటినుంచి అరువై ఏండ్ల అనంతరం తెలంగాణ రాష్ట్రం ఏర్పడగా, గతకాలపు రైతాంగ పోరాట ప్రతిష్ఠపై చాలా ఆశలు పెట్టుకున్నాయి. అప్పటి చరిత్ర ఇప్పటితరాల ఓటర్లకు ఇంకా గుర్తుంటుందని, కనుక వారు తమకు ఓటు వేయగలరని అనుకున్నారు. అదేవిధంగా మరొక ఆశ పెట్టుకున్నారు. తెలంగాణ ప్రజల్లో 85 శాతం మంది బడుగు బలహీనవర్గాల వారు గనుక, వారు ఆటోమేటిక్‌గా కమ్యూనిస్టు సిద్ధాంతపు పార్టీలకు ఓటు వేస్తారనుకున్నారు. ఈ రెండు మనం చేస్తున్న ఊహాగానాలు కావు. వేర్వేరు మాటల్లో వారినుంచి వినవచ్చిన అభిప్రాయాలే. కానీ చివరకు జరిగిందేమిటో కన్పిస్తున్నదే.

ఉభయ కమ్యూనిస్టులు ఇంత దారుణమైన రీతిలో ఎందుకు దివాళా తీశారన్నది ప్రశ్న. ఈ ప్రశ్న చాలా సీరియస్‌ది. అందుకు సమాధానం లేదా సమాధానాలు గాని, పరిష్కారం లేదా పరిష్కారాలు గాని ఎంత మాత్రం తేలిక కాదు. అది కూడా చిరకాలం పాటు తీవ్రమైన మేధోమథనాలు జరిపితే తప్ప. నిజాయితీతో, చిత్తశుద్ధితో, ధైర్యంతో ఆత్మవిమర్శలు చేసుకుంటే తప్ప. అదేవిధంగా ప్రస్తుత పరిస్థితులపై తమ ప్రస్తుత అవగాహనలను మార్చుకొని, తగిన సరికొత్త అవగాహనలను ఏర్పరుచుకొని, అందుకు తగినవిధంగా కార్యాచరణ రూపొందించుకుంటే తప్ప, పూర్వ వైభవం పొందలేవు.

కానీ అటువంటి లక్షణాలేవీ వారిలో కన్పించటం లేదు. ఆవగింజంత మేర అయినా కన్పించటం లేదు. ఒకసారి 2014కు వెళ్లి చూద్దాం. తర్వాత 2018కి వద్దాం. 2014లో చిత్తుగా ఓడినప్పుడు వారికి, తమ రైతాంగ పోరాట రికార్డు, తెలంగాణ ప్రజల్లో 85 శాతం బడుగు బలహీనురు కావటమనేది ఆటోమేటిక్‌గా ఉపయోగపడేది కాదనే అవగాహన కలుగవలసింది. తాము ప్రత్యేక తెలంగాణను వ్యతిరేకించటం ఎంత పెద్ద తప్పో సీపీఎంకు బోధపడవలసింది. అదేవిధంగా 1948-2014 మధ్య తమ సైద్ధాంతిక వైఫల్యాలు, కార్యాచరణ వైఫల్యాలేమిటో లోతుగా సమీక్షించుకోవలసింది. కానీ అటువంటివేమీ చేయకుండా వారు 2014 అక్టోబర్‌లో మరికొన్ని వామపక్షాలతో కలిసి ఉమ్మడి సమావేశం ఒకటి నిర్వహించుకున్నారు. అక్కడ, 2019 నాటికి ఇక తామే ప్రత్యామ్నాయంగా ఎదుగగలమంటూ వాగాడంబరపు ప్రకటన ఒకటి చేశారు. కానీ పైన పేర్కొన్నటువంటి సమీక్షలు, ఆ మేరకు ఆచరణలు ఏమీ లేని స్థితిలో వారి తీర్మానం ఒక లోతులేని ఇసుక కయ్యగా మిగిలిపోయింది. అందుకు తగినట్లు మరొకవైపు సీపీఎం తన తెలంగాణ వ్యతిరేకతను మార్చుకునేందుకు అప్పటికీ సిద్ధపడలేదు. సరికదా, తమ వ్యతిరేకత ఇక సమస్య కాదని, ఆ వ్యతిరేకతను తెలంగాణ ప్రజలు మరిచిపోతున్నారంటూ తర్వాతకాలంలో రాష్ట్ర పార్టీ సభల్లో తీర్మానించింది. తెలంగాణవాదాన్ని వట్టి ప్రాంతీయ తత్వంగా ముద్రవేస్తూ జాతీయ సభల్లో తీర్మానాన్ని ఆమోదించింది.

విషయమేమంటే 2019 నాటికి ప్రత్యామ్నాయంగా మారటం మాట అట్లుంచి, కనీసం 2014 నాటి ఓట్లు, సీట్లు అయినా మిగులకుండా పోయేందుకు మార్గం సిద్ధం చేసుకున్నారు. తెలంగాణ అన్నది ఒక కోణం మాత్రమే. వాస్తవానికి అంతే బలమైన కోణాలు మరికొన్ని కూడా ఉన్నాయి. ఉభయ కమ్యూనిస్టులకు మధ్య 2014 అక్టోబర్ సంకల్పం తర్వాత కొద్దికాలానికే పొసగకుండా పోయింది. సీపీఎం దాదాగిరి వల్ల సీపీఐతో, కేవలం ఎన్నికల రాజకీయం చుట్టూ వ్యవహారాన్ని తిప్పి చూడటం వల్ల విప్లవ కమ్యూనిస్టు గ్రూపులతో, కొన్ని ప్రజా సంఘాలతో చెడిపోయింది. వీరందరికీ కలిసి కూడా పరిస్థితుల పట్ల లోతైన అవగాహన, నిజాయితీతో కూడిన ఓపెన్ మైండెడ్ పరిశీలన, ఆ మేరకు తగిన వైఖరులు తీసుకోవటం, కార్యాచరణ వంటి వేమీలేక అంతా గాలి వ్యవహారంగా మారింది. 2019 నాటికి ప్రత్యామ్నాయం కావటమన్నది హాస్యాస్పదం కావటానికి పునాదులు ఆ విధంగా అప్పటినుంచే పడుతూ రాసాగాయి. సీపీఐ, సీపీఎం, ఎం-ఎల్ గ్రూపులు ఎవరిదారి అవి చూసుకోవటం మొదలుపెట్టాయి. సీపీఐ నాయకత్వం తాము బూర్జువాలు అనే కాంగ్రెస్, టీడీపీలవైపు దృష్టిసారించగా, విప్లవ గ్రూపులు ఒంటరిగా మిగిలాయి . సీపీఎం నాయకత్వం బీఎల్‌ఎఫ్ పేరిట కొత్త భ్రమలను సృష్టించుకోసాగింది. బహుజన సంఘాలు అంటూ ముందుకువస్తున్న వారు ప్రధానంగా ఆకాంక్ష వర్గాలు (యాస్పిరేషనల్ సెక్షన్లు). పూలే, అంబేద్కర్‌ల పేరిట ప్రత్యేక సంఘాలుగా ఏర్పడుతున్న వారిలోనే సైద్ధాంతిక నిష్ఠ, ఐక్యత లేక దశాబ్దాలు గడిచినా పురోగతి లేకుండా ఉన్నది. వారికి, కమ్యూనిస్టులకు మధ్య కులం-వర్గం ప్రశ్న నేటికీ తీరకుండా పెచ్చరిల్లుతూనే ఉన్నది. అత్యధికులు పాలకవర్గాల వెంట యాస్పిరేషనల్ క్లాస్‌గానే నడుస్తున్నారు. అటువంటి పరిస్థితుల మధ్య ఈ యాస్పిరేషనల్ క్లాస్‌లో ఒక పిడికెడు మందిని తమ వెంట లాల్-నీల్ పేరిట చేర్చుకోగలుగటం ఒక మహత్తరమైన మార్పునకు దారితీయగలదని భావించటం భ్రమ మాత్రమే అవుతుంది. కనుకనే ఎన్నికల ఫలితాల్లో అది ప్రతిఫలించింది. ఇది చాలదన్నట్లు, తెలంగాణ ఎన్నికల తర్వాత సీపీఎం కేంద్ర కమిటీ తెలంగాణ కమిటీకి లేఖ రాస్తూ వర్గ రాజకీయానికి బదులు కుల రాజకీయం చేయటంపై మందలించినట్లు వార్తలు వెలుడినాయి.

> సమీక్షలను, ఇతరత్రా వారు చేసిన ప్రకటనలను ఒకసారి జాగ్రత్తగా గమనించండి. తాము 2014లో గాని, 2014-18 మధ్య గాని, 2018 డిసెంబర్ 11 సాయంత్రానికి ఎన్నికల ఫలితాలు వెలువడినప్పటి నుంచి గాని నేర్చుకున్నది ఒక పెద్ద సున్నా అయినట్లు ఎవరైనా చెప్పగలరు. ఈ పార్టీలు ఎప్పటికైనా బాగుపడుతాయో లేదో తెలియదు గాని, అందుకు ఒక చిన్న ఆశాకిరణమైనా కన్పించాలంటే అన్నింటికన్న ముందు జరుగవలసింది ఉభయ కమ్యూనిస్టుల కార్యకర్తలు, అభిమానులు, మధ్యమ శ్రేణి వారు ఆ నాయకత్వాలపై తిరుగబడి తీవ్రంగా నిలదీయటం. అప్పటికీ వారిలో మార్పు లక్షణాలు కన్పించకపోతే నాయకత్వాలను కూలదోయటం. కొత్తవారిని తెచ్చుకోవటం.

తెలంగాణ ఎన్నికల పరాభవం అనంతరం ఉభయ కమ్యూనిస్టుల సమీక్షలను, ఇతరత్రా వారు చేసిన ప్రకటనలను ఒకసారి జాగ్రత్తగా గమనించండి. తాము 2014లో గాని, 2014-18 మధ్య గాని, 2018 డిసెంబర్ 11 సాయంత్రానికి ఎన్నికల ఫలితాలు వెలువడినప్పటి నుంచి గాని నేర్చుకున్నది ఒక పెద్ద సున్నా అయినట్లు ఎవరైనా చెప్పగలరు. ఈ పార్టీలు ఎప్పటికైనా బాగుపడుతాయో లేదో తెలియదు గాని, అందుకు ఒక చిన్న ఆశాకిరణమైనా కన్పించాలంటే అన్నింటికన్న ముందు జరుగవలసింది ఉభయ కమ్యూనిస్టుల కార్యకర్తలు, అభిమానులు, మధ్యమ శ్రేణి వారు ఆ నాయకత్వాలపై తిరుగబడి తీవ్రంగా నిలదీయటం. అప్పటికీ వారిలో మార్పు లక్షణాలు కన్పించకపోతే నాయకత్వాలను కూలదోయటం. కొత్తవారిని తెచ్చుకోవటం. ఇటువంటి తీవ్రమైన పరిణామాలు ఏవో చోటుచేసుకోని పక్షంలో 2023 నాటికి తెలంగాణ వామపక్షాలు మరెంత దుర్గతికి చేరేది చెప్పటం కష్టం.

గ్రామాల్లో నిశ్శబ్ద ఆర్థిక విప్లవం

తెలంగాణం



నాగేందర్ మాధవరం

టైమ్ మాగజైన్ ఫిబ్రవరి 22, 1937వ సంచికలో నిజాం ముఖచిత్రాన్ని ప్రచురిస్తూ భారతదేశంలో హైద్రాబాద్ రాష్ట్రం అంత ధనవంతమైన, సంపన్నమైన, విస్తారమైన ప్రాంతం మరొకటి లేదు. ఈ ప్రాంత పాలకుడైన ఉస్మాన్ అలీఖాన్ ప్రపంచంలో అత్యంత ధనవంతుడు షష్టిపూర్తి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నాడని పేర్కొన్నది. 1937లో నిజాం ఆస్తుల విలువ బ్రిటిష్ ఇండియా బడ్జెట్ కంటే రెండు రెట్లు అధికం. నిజాం వ్యక్తిగత ఆధీనంలో ఉన్న మూడున్నర లక్షల ఎకరాల సారవంతమైన సర్ఫ్ ఏ కాస్ భూమిని లెక్కించకుండా వేసిన అంచనా ప్రకారం బ్రిటిష్ రాణి కంటే ధనవంతుడు.

రైతుల పరిస్థితి మాత్రం పూర్తిగా భిన్నంగా ఉండేది. పరిమితమైన నీటి వనరులతో, పెట్టుబడి లేమితో, అధిక భూమి శిస్తుతో రైతులు నిజాం సంపదను పెంచడానికే బతికారు. నిజాం ప్రభుత్వం 1929లో కేశవ అయ్యంగార్ నాయకత్వంలో ఆర్థిక పరిస్థితిని అంచనా వేయడానికి ఒక కమిటీని నియమించింది. ఆ కమిటీ రైతుల దీనస్థితిని క్షుణ్ణంగా వివరిస్తూ 54 శాతం ప్రజలు తీవ్ర అప్పుల్లో కురుకుపోయారని, 50 శాతం వరకు ఉన్న వడ్డీ రేటు భరించరానిదిగా ఉన్నదని, కొన్ని అప్పులు తరతరాలుగా కొనసాగుతూ రైతులకు గుదిబండగా మారాయని పేర్కొన్నది. అప్పులు చేయడానికి ప్రధాన కారణాల్లో భూమి శిస్తు ఒకటని కూడా కమిటీ పేర్కొన్నది. తెలంగాణలో సంపన్నమైన ప్రభుత్వం ఉండగా రైతులు పేదరికాన్ని అనుభవిస్తూ వచ్చారు.

స్వాతంత్ర్యానంతరం ఏర్పడిన ప్రభుత్వాలు కూడా పరిస్థితిని మెరుగుపరచలేదు. చిలకమర్తి లక్ష్మీనరసింహం మాటల్లో 'ఆంధ్ర వారను గడసరి గొల్లవారు పితుక్కున్నారు మూతులు బిగయగట్టి. గత ఏడు దశాబ్దాలుగా ప్రభుత్వాల పీడన వల్ల తెలంగాణ రైతులు నీరును నిధులను కోల్పోయి కటిక దారిద్ర్యంలోకి నెట్టివేయపడి ఆత్మవిశ్వాసం కోల్పోయి ఆత్మహత్యలు చేసుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతుబంధు పథకం రైతుల పాలిట సంజీవనియే కాక చాలారకాలుగా విశిష్టమైనది. ఇంతవరకు బ్యాంకుల్లో అప్పు తీసుకొని చెల్లించని వారిని మాత్రమే ప్రభుత్వాలు ఆదుకున్నవి. పరోక్షంగా ప్రభుత్వాలు ఆర్థిక ఆచారాన్ని ప్రోత్సహించాయి. నిజాయితీగా అప్పులు చెల్లించినవారిని నిరుత్సాహానికి గురిచేశాయి. సార్వత్రిక పెట్టుబడి సహాయం ద్వారా ఆర్థిక క్రమశిక్షణకు కూడా ప్రోత్సాహం లభిస్తుంది. పరోక్షంగా ఇచ్చే రాయితీలు ప్రజలకు చేరాలంటే అనేక అంతరాలను దాటాలి. దళారీ వ్యవస్థలకు అవినీతికి ఆస్కారం లేకుండా ప్రజలకు నేరుగా నగదు బదిలీ విధానం వల్ల ఉద్యోగిస్వామ్య, మధ్య దళారీ పాత్ర తగ్గింది. ఇతరులకు ఇవ్వడం తప్ప ఏమీ ఆశించని రైతాంగానికి తలుపు తట్టి డబ్బు ఇవ్వడం ద్వారా ప్రభుత్వం రైతుల్లో గొప్ప మనోధైర్యాన్ని, కొత్త ఆశలను, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించింది.

కౌలు రైతులకు కూడా డబ్బులు ఇవ్వాలని అడిగేవారు హైద్రాబాద్‌లో అమలుపర్చిన కిరాయిదారు రక్షణ చట్టం సృష్టించిన బీభత్సాన్ని గుర్తుకు తెచ్చుకోవాలి. హైద్రాబాద్ రాష్ట్రం మూడు ప్రాంతాలుగా విడిపోయాక శతాబ్దాలుగా హైద్రాబాద్‌లో ఉన్న చాలామంది మరాఠీయిలు, కన్నడిగులు ఇక్కడే ఉండిపోయారు. మారిన పరిస్థితులకు అనుగుణంగా ఆర్థిక వెసలుబాటు కోసం తమ ఇండ్లను కొంతభాగం అద్దెకు ఇచ్చుకొని వచ్చే ఆదాయంతో జీవించేవారు. కిరాయిదారు రక్షణ చట్టం వల్ల నగరంలో కొత్త గుండాలు పుట్టుకొచ్చారు. కిరాయిదారులకు ఆశలు కలిపించి ఇంటి యజమానులనే నేరస్తులని చేసి కట్టుబట్టలతో తరిమేశారు. సాంప్రదాయంగా బతుకుతున్న అనేక కుటుంబాలు నిలువ నీడలేకుండా శరణార్థులుగా మారాయి. స్థానిక రాజకీయ నాయకులు చేతనైనంత దోచుకున్నారు. రాజకీయ పలుకుబడి లేని అనేక మధ్య తరగతి కుటుంబాలు నష్టపోయి వీధి పాలయ్యాయి. చరిత్రను మరిచిపోయి కౌలుదారులకు కూడా రైతుబంధు పథకం అమలుచెయ్యాలనే కొత్త నినాదంతో గ్రామాల్లో చిచ్చు పెట్టడానికి ప్రయత్నం జరుగుతున్నది. అంగ బలం కలిగిన పెద్ద భూస్వాములకు సమస్యలు రావు. కానీ, దిక్కులేని ఆడవారికి, చిన్న కమతాల యజమానులకు, వ్యవసాయం చేసుకునే స్థోమత లేక కౌలుకు ఇచ్చుకునే పేదవారికి చాలా నష్టం జరిగే అవకాశం ఉన్నది. కొత్త తరహా గుండాలు పుట్టుకొచ్చి నిస్సహాయుల భూములను దౌర్జన్యంగా ఆక్రమించుకొనే అవకాశాలున్నాయి. దశాబ్దాలుగా ప్రభుత్వాలను నడిపిన అనుభవం ఉన్నవారు, కౌలుదారులకు కూడా బ్యాంకులు అప్పులు ఇవ్వాలని ఇంత వరకు అడుగనివారు అకస్మాత్తుగా ప్రమాదకరమైన విధానాన్ని ప్రతిపాదిస్తూ గ్రామాల్లో రావణకాష్టం పెట్టాలని చూస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న పట్టాదారుకు మాత్రమే పెట్టుబడి సహాయం అనే విధానం సహేతుకమైనది. కౌలుదారుకు, భూమి యజమానికి మధ్య ప్రభుత్వానికి ఎలాంటి పాత్ర ఉండరాదు.

> **శతాబ్దాలుగా దగాపడిన పల్లెలు ఇప్పుడు కొత్త పథకాలతో జీవం పోసుకుంటున్నాయి. గ్రామాలకు పట్టణాల నుంచి వలసలు ప్రారంభమయ్యాయి. గ్రామాల్లో నిశ్శబ్ద ఆర్థిక విప్లవం అప్రతిహతంగా సాగుతున్నది. ప్రజల పరిస్థితి మెరుగుపడితే అనేక చిన్నతరహా పరిశ్రమలు స్థాపించబడుతాయి. నిరుద్యోగ భూతం రాష్ట్రం నుంచి తరిమివేయబడుతుంది. వివిధ పన్నుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి బలపడుతుంది.**

ధనవంతులకు మాత్రమే ఈ పథకం లాభం చేస్తుందని ప్రచారం చేయడానికి కొంతమంది చాలా ప్రయాస పడుతున్నారు. మొత్తం 58,38,000 మంది రైతుల్లో 50 ఎకరాలకు మించి భూమి కలిగినవారు కేవలం 298 మంది మాత్రమే వారిలో చాలామంది డబ్బును ప్రభుత్వానికే తిరిగి ఇచ్చేస్తున్నారు. రాజకీయం కోసమే ఈ పథకం ప్రారంభించారని మరొక వాదన తెస్తున్నారు. ప్రజాస్వామ్యంలో అత్యున్నత నిర్ణయాలన్నీ రాజకీయమైనవే. రాజకీయ నిబద్ధత లేకుండా ఇంత ఖర్చుతో కూడుకున్న విధానం అమలుజరుగదు. సివిల్ సర్వీస్ ఉద్యోగాల్లో 50 శాతం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కేటాయించాలని వాదించిన రైతు పక్షపాతి చౌదరి చరణ్ సింగ్. అతను జీవించి ఉంటే నిస్సందేహంగా ఈ విప్లవాత్మకమైన పథకాన్ని ప్రశంసించేవారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.12,000 కోట్లు పంచడం ద్వారా దివాళా తీస్తుందని ఒక వాదన వినిపిస్తున్నది. ఆర్థిక శాస్త్రవేత్తల అభిప్రాయం, అమెరికా అనుభవం ఈ వాదనకు భిన్నంగా ఉన్నది. అమెరికా ఆర్థికమాంద్యంలో చిక్కుకొని అభివృద్ధి రేటు పడిపోయినప్పుడు ఒబామా ప్రభుత్వం అమెరికా రికవరీ, రీ ఇన్వెస్ట్‌మెంట్ చట్టం 2009 ద్వారా 787 మిలియన్ డాలర్లను ప్రజలకు వివిధ రూపాల్లో పంచింది. తద్వారా అమెరికా ఆర్థిక వ్యవస్థ తిరిగి పునరుజ్జీవనం పొందింది. రాష్ట్ర ప్రభుత్వం అమలుపరుస్తున్న వివిధ సంక్షేమ పథకాలు గ్రామాల్లో ఆర్థిక కార్యకలాపాలను ఆశ్చర్యకరంగా పెంచాయి. సామాజిక పెట్టుబడి విధానాలైన రైతుబంధు, గొర్రెల పెంపకం, చేపల పెంపకం, చేనేత సహాయ పథకం, వివిధ వృత్తుల సహాయ పథకాల వల్ల డబ్బు ప్రజలకు చేరి సామాజిక పునఃనిర్మాణం జరుగుతున్నది. మౌలిక సదుపాయాలు కల్పించే రోడ్ల నిర్మాణం, రెండు గదుల ఇండ్లు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, ఎత్తిపోతల పథకాలు వేల కోట్ల రూపాయలను ప్రజలకు అందజేస్తున్నాయి. ఉచిత కరెంట్, పునరుద్ధరింపబడిన చెరువులు, ఎత్తిపోతల పథకం ద్వారా వేలాది ఎకరాలు కొత్తగా సాగులోకి వచ్చి గ్రామాలు కళకళాడుతున్నాయి. రైతుబంధు పథకం మే నెలలో సంక్రాంతి సంబురాలను తెచ్చింది. శతాబ్దాలుగా దగాపడిన పల్లెలు ఇప్పుడు కొత్త పథకాలతో జీవం పోసుకుంటున్నాయి. గ్రామాలకు పట్టణాల నుంచి వలసలు ప్రారంభమయ్యాయి. గ్రామాల్లో నిశ్శబ్ద ఆర్థిక విప్లవం అప్రతిహతంగా సాగుతున్నది. ప్రజల పరిస్థితి మెరుగుపడితే అనేక చిన్నతరహా పరిశ్రమలు స్థాపించబడుతాయి. నిరుద్యోగ భూతం రాష్ట్రం నుంచి తరిమివేయబడుతుంది. వివిధ పన్నుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి బలపడుతుంది. తెలంగాణ ప్రజలు శతాబ్దాలుగా ఎదురుచూస్తున్న సహాయం కేసీఆర్ రూపంలో ఇప్పుడు వచ్చింది. మంచినీటి, సాగునీటి కొరత, ఆకలి చావులు లేని నవ తెలంగాణకు ధృడమైన పునాదులు పడుతున్నాయి.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078, Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.



మెదక్ జిల్లా పెద్దశంకరంపేట పట్టణంలోని అజ్మీర్‌దర్గాలో బుధవారం హోంమంత్రి మహమూద్‌అలీ, నారాయణఖేడ్ ఎమ్మెల్యే ఎం భూపాల్‌రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం దర్గాకు చాదర్ కప్పి, పూల మాలలు వేశారు. కార్యక్రమంలో రాష్ట్ర గీత పారిశ్రామిక సహకార సంస్థ మాజీ చైర్మన్ రామాగౌడ్, కేంద్ర ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. - పెద్దశంకరంపేట

కేయూ దూరవిద్యలో ప్రవేశాలు

డిగ్రీ, పీజీ కోర్సుల్లో రెండో విడుత, బీఈడీలో మొదటి విడుత ప్రవేశాలు

షెడ్యూల్ విడుదల చేసిన కేయూ వీసీ సాయన్న, డైరెక్టర్ వీరన్న


హన్మకొండ, నమస్తే తెలంగాణ: వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీ దూరవిద్యాకేంద్రం అందిస్తున్న డిగ్రీ, పీజీ కోర్సుల్లో 2018-19 విద్యా సంవత్సరానికి రెండో విడుత ప్రవేశాలకు, బీఈడీ మొదటి విడుత ప్రవేశాలకు షెడ్యూల్‌ను విడుదల చేసినట్టు కేయూ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ ఆర్ సాయన్న, దూర విద్యాకేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ జీ వీరన్న తెలిపారు. బుధవారం వారు కేయూలో మాట్లాడుతూ.. బీఈడీ రెండు సంవత్సరాల కోర్సులో ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు మాత్రమే ప్రవేశం ఉంటుందన్నారు. రెండు విడుతల్లో మొత్తం వెయ్యి మందికి ప్రవేశాలు కల్పిస్తామన్నారు. ఈ నెలలో 500 మందికి, జూలైలో జరిగే రెండో విడుతలో మరో 500 మందికి ప్రవేశాలు కల్పించనున్నట్టు తెలిపారు. మొదటి విడుత ప్రవేశాలకు ఈ నెల 4వ తేదీన నోటిఫికేషన్ జారీ అవుతుందని, ఈ నెల 25వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అపరాద రుసుముతో ఫిబ్రవరి 2వ తేదీవరకు అవకాశం ఉంటుందన్నారు. ఫిబ్రవరి 18న ప్రవేశార్హత పరీక్ష నిర్వహించనున్నట్టు చెప్పారు. జనగామలోని ఏకశిల కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, పెద్దపల్లిలోని ట్రినిటి కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, ఖమ్మంలోని అనిసెంట్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, నిర్మల్‌లోని పంచశీల కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

డిగ్రీ, పీజీ కోర్సులకు...

ఇంటర్ ఉత్తీర్ణులైన వారికి నేరుగా డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలను కల్పిస్తామని, 2015 నుంచి 2018 వరకు డిగ్రీ ప్రవేశార్హత సాధించిన వారు ప్రవేశాలకు అర్హులని తెలిపారు. ఏ విద్యార్హత లేనివారికి ప్రవేశార్హత పరీక్షను నిర్వహించి, ఉత్తీర్ణత ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామన్నారు. ఈ నెల 4న షెడ్యూల్‌ను విడుదలచేసి, ఫిబ్రవరి 2 వరకు దరఖాస్తులు విక్రయిస్తామన్నారు. ఫిబ్రవరి 6న ప్రవేశార్హత పరీక్ష ఉంటుందని, ఫిబ్రవరి 10 నుంచి 15 వరకు ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు. డిగ్రీ పూర్తయిన వారికి పీజీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తామన్నారు. పూర్తి వివరాల కోసం www.sdlceku.co.in అనే వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కే పురుషోత్తం, కేయూ పరీక్షల నియంత్రాణాధికారులు ప్రొఫెసర్ ఎస్ మహేందర్‌రెడ్డి, డాక్టర్ పీ సాదానందం, డాక్టర్ వై వెంకయ్య, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల డైరెక్టర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



కేయూలో దూరవిద్య ప్రవేశాల షెడ్యూల్‌ను విడుదల చేస్తున్న వైస్‌చాన్స్‌లర్ సాయన్న, రిజిస్ట్రార్ పురుషోత్తం తదితరులు



బుధవారం సిద్దిపేటలో మాట్లాడుతున్న మాజీమంత్రి హరీశ్‌రావు. చిత్రంలో కలెక్టర్ కృష్ణభాస్కర్ తదితరులు

విద్యాకేంద్రంగా సిద్దిపేట

- కేంద్రీయ విద్యాలయాన్ని ప్రారంభించిన కలెక్టర్ కృష్ణభాస్కర్
- ఉత్తమ విద్యార్థులను అందించాలి: మాజీమంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట కలెక్టరేట్, నమస్తే తెలంగాణ: సిద్దిపేట జిల్లా విద్యాకేంద్రంగా మారుతున్నది. బుధవారం సిద్దిపేటలో కేంద్రీయ విద్యాలయాన్ని(కేవీ) ప్రారంభించారు. జిల్లా కేంద్రమైన సిద్దిపేటలోని ఎల్లంకి కాలేజీలో తాత్కాలికంగా ఏర్పాటుచేసిన కేంద్రీయ విద్యాలయ తరగతులను కలెక్టర్ కృష్ణభాస్కర్ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మాజీమంత్రి హరీశ్‌రావుతో కలిసి విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కేంద్రీయ విద్యాలయం ప్రారంభంతో ఈ ప్రాంత విద్యార్థులకు మంచి అవకాశం లభించిందన్నారు. కేవీలపై ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని నిలబెడుతూ, ఉత్తమ విద్యార్థులను తీర్చిదిద్దేందుకు కృషిచేస్తామన్నారు. సిద్దిపేట కేవీకి స్పందన బాగున్నదని, ప్రవేశాల కోసం పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చాయని చెప్పారు.

కల సాకారమైంది: మాజీమంత్రి హరీశ్‌రావు

మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. సిద్దిపేటకు కేంద్రీయ విద్యాలయం తీసుకురావాలన్న తన కల స్వరాష్ట్రంలో సాకారమైందన్నారు. సిద్దిపేట కేంద్రీయ విద్యాలయం ఆదర్శంగా నిలిచి ఉత్తమ విద్యార్థులను రేపటి తరానికి అందించాలని ఆకాంక్షించారు. సిద్దిపేట ప్రజల్లో, తల్లిదండ్రుల్లో ఈ పాఠశాలపై అపారమైన నమ్మకం ఉన్నదని, దానిని నిలబెట్టేదిశగా ఉపాధ్యాయులు, అధ్యాపకులు పనిచేయాలని సూచించారు. పాఠశాల ను తీసుకురావడం కోసం మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేకంగా మూడేండ్లపాటు శ్రమించారని అభినందించారు. పాఠశాలకు సిద్దిపేట శివారులోని మెడికల్ కళాశాల పక్కన ఐదు ఎకరాల భూమిని కేటాయించినట్టు తెలిపారు. గతంలో కేంద్రీయ విద్యాలయం సిద్దిపేటకు వచ్చినట్టే వచ్చి చేజారి ఏపీ రాష్ట్రానికి వెళ్లిపోయిందని గుర్తుచేశారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఇది రెండో కేవీ కాగా, సిద్దిపేట జిల్లాలో మొదటి పాఠశాల అని చెప్పారు.

దేశ రాజకీయాల్లో పెనుమార్పులు..

సీఎం కేసీఆర్‌తోనే సాధ్యం

అభివృద్ధికి కేరాఫ్‌గా తెలంగాణ ▪ మాజీమంత్రి జీ జగదీశ్‌రెడ్డి ▪ రాష్ట్రవ్యాప్తంగా టీఆర్‌ఎస్‌లోకి కొనసాగుతున్న చేరికలు

సూర్యాపేట టౌన్ / వనపర్తి అర్బన్ / నర్సంపేట రూరల్: దేశ రాజకీయాల్లో పెనుమార్పులు సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమని మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ర్టాన్ని అభివృద్ధికి కేరాఫ్‌గా నిలిపారని కొనియాడారు. ఆయన నాయకత్వం కోసం అన్ని రాష్ర్టాలు ఎదురుచూస్తున్నాయని చెప్పారు. టీఆర్‌ఎస్ పార్టీలోకి చేరికలు కొనసాగుతున్నాయి. పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు భారీసంఖ్యలో టీఆర్‌ఎస్‌లో చేరుతున్నారు. సూర్యాపేట, వనపర్తి, నర్సంపేటల్లో ఎమ్మెల్యేలు జగదీశ్‌రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి సమక్షంలో వివిధ పార్టీలకు చెందిన నేతలు టీఆర్‌ఎస్‌లో చేరారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో చివ్వెంల, పెన్‌పహాడ్ మండలాలకు చెందిన కాంగ్రెస్, బీజేపీలకు చెందిన 700 మంది మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. ఆయన వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌తోనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమని ప్రజలు నమ్మారన్నారు. ఎవరెన్ని ప్రలోభాలు పెట్టినా ప్రజలంతా టీఆర్‌ఎస్‌కే అండగా నిలబడ్డారని చెప్పారు. తెలంగాణలో రాజకీయాలకతీతంగా సంక్షేమపథకాలను అమలు చేస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, రౌతు నర్సింహారావు, షేక్ బాషా, మారిపెద్ది శ్రీనివాస్ పాల్గొన్నారు.



బుధవారం సూర్యాపేటలో మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరిన చివ్వెంల మండలానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు



టీఆర్‌ఎస్‌లో చేరిన ఖానాపురం మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకులతో ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

వనపర్తి జిల్లాలో..

నియోజకవర్గ అభివృద్ధి కోసం టీఆర్‌ఎస్‌లోకి చేరికలు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని నాలుగో వార్డుకు చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

వరంగల్ రూరల్ జిల్లాలో..

వరంగల్‌రూరల్ జిల్లా నర్సంపేట డివిజన్‌లోని నర్సంపేట, చెన్నారావుపేట, ఖానాపురం, నెక్కొండ, దుగ్గొండి మండలాల నుంచి టీఆర్‌ఎస్‌లోకి వలసలు కొనసాగాయి. నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సమక్షంలో వివిధ పార్టీలకు చెందిన 220 మంది టీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి ఆయన పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. నర్సంపేట మండలంలోని జంగాలపల్లితండాలో 20 మంది, ఖానాపురంలో 30 మంది, నెక్కొండలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి యాకయ్య, చెన్నారావుపేట మండలం ఎల్లాయిగూడెంలో 40మంది, శంకరంతండాలో 20మంది, ముగ్ధుంపురంలో 50మంది, బోజెర్వులో 20మంది, దుగ్గొండి మండలం పొనకల్ గ్రామంలో 40మంది నాయకులు టీఆర్‌ఎస్ పార్టీలో చేరారు.



వనపర్తి జిల్లాకేంద్రంలో ఎమ్మెల్యే నిరంజన్‌రెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లోకి చేరుతున్న పలువురు నాయకులు



జోగుళాంబ గద్వాల జిల్లా కొండేరులో మీడియాతో మాట్లాడుతున్న ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి మంద జగన్నాథం

ఫెడరల్ ఫ్రంట్‌తో దేశ రాజకీయాలను శాసిస్తాం

- ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి మంద జగన్నాథం

ఇటిక్యాల: బీజేపీ, కాంగ్రెస్‌యేతర ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటుతో దేశరాజకీయాలను శాసిస్తామని ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి మంద జగన్నాథం స్పష్టంచేశారు. జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలంలోని కొండేర్ గ్రామంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ నాయకత్వంలో బీజేపే, కాంగ్రెస్ యేతర ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటవడమే కాకుండా ఫలించి తీరుతుందన్నారు. సీఎం కేసీఆర్‌తో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని అఖిలేశ్‌యాదవ్ ఇప్పటికే ప్రకటించారని చెప్పారు. పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, ఒడిశా సీఎం నవీన్‌పట్నాయక్ ఫెడరల్ ఫ్రంట్ పట్ల సానుకూలంగా స్పందించారన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీల సహకారం లేకుండా ఫెడరల్ ఫ్రంట్ ఎలా సాధ్యమని.. ఏపీ సీఎం చంద్రబాబు మతిలేకుండా మాట్లాడుతున్నారని ఎద్దేవాచేశారు. అనైతిక పొత్తులతో తెలంగాణలో తిష్ఠ వేద్దామనుకున్న బాబుకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్‌ఎస్ నాయకులు మంద శ్రీనాథ్, నాగర్‌దొడ్డి వెంకట్రాములు, టీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి, టీఆర్‌ఎస్వీ నాయకులు పల్లయ్య, రైతుసమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ గిడ్డారెడ్డి, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ నిర్మాణంలో తెరకెక్కుతున్న తుపాకిరాముడు చిత్ర షూటింగ్ బుధవారం కరీంగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం నల్లగొండలో జరిగింది. గ్రామంలోని నరసింహస్వామి ఆలయ సమీపంలో ఒక పాట, కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. ఇందులో రసమయి బాలకిషన్‌తోపాటు హీరోహీరోయిన్లు బిత్తిరి సత్తి, ప్రియ పాల్గొన్నారు. బతుకమ్మ ఫేం టీ ప్రభాకర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. - తిమ్మాపూర్ రూరల్

10 లోపు జాతర ఏర్పాట్లు పూర్తికావాలి

- ఐనవోలు మల్లన్న బ్రహ్మోత్సవాలపై సమీక్షలో కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్

ఐనవోలు: ఐనవోలు మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలకు ఈ నెల 10 లోపు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని వరంగల్ అర్బన్ జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన ఐనవోలు మల్లన్న స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. 13 నుంచి ప్రారంభం కానున్న జాతర పర్యవేక్షణకు 70 సీసీ కెమెరాలు, వంద ఆర్టీసీ బస్సులు, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జాతరలోపు రోడ్ల మరమ్మతులు పూర్తి చేయాలన్నా రు. కార్యక్రమంలో ఆలయ స్పెషల్ ఫీసర్ మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

కొట్టుకున్న కాంగ్రెస్ వర్గీయులు



బుధవారం ఆదిలాబాద్‌లో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో మైనార్టీ నాయకుడు నదీంఖాన్‌పై దాడిచేస్తున్న సాజిద్‌ఖాన్ వర్గీయులు



వేదికపై వాగ్వాదానికి దిగిన మాజీ మంత్రి రామచంద్రారెడ్డి, మైనార్టీ విభాగం నాయకుడు సాజిద్‌ఖాన్

- ఆదిలాబాద్‌లో మైనార్టీ నాయకుడిపై పిడిగుద్దులు
- ఇరువర్గాల మధ్య తోపులాట ▪ రసాభాసగా కార్యకర్తల సమావేశం

ఆదిలాబాద్ / నమస్తే తెలంగాణ ప్రతినిధి: ఆదిలాబాద్‌లో బుధవారం నిర్వహించిన ఆదిలాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం రసాభాసగా మారింది. కార్యకర్తలు బాహాబాహీకి దిగారు. మైనార్టీ నాయకుడు మాట్లాడుతుండగా మరోవర్గం కార్యకర్తలు స్టేజీపైకి దూసుకొచ్చి దాడి చేశారు. పిడిగుద్దులు కురిపించారు. దీంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. ఆదిలాబాద్ నియోజకవర్గంలో కొన్ని రోజులుగా నివురుగప్పిన నిప్పులా ఉన్న గ్రూపు తగాదాలు ఒక్కసారిగా బయటపడ్డాయి. పంచాయతీ ఎన్నికల సన్నద్ధంలో భాగంగా ఆదిలాబాద్ సమీపంలోని గాయత్రి గార్డెన్‌లో బుధవారం ఆదిలాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి రామచంద్రారెడ్డి, ఏఐసీసీ సభ్యురాలు గండ్రత్ సుజాత, నాయకులు భార్గవ్ దేశ్‌పాండే, సాజిద్‌ఖాన్ తదితరులు హాజరయ్యారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన జీ సుజాత మూడో స్థానానికే పరిమితం అయ్యారు. పార్టీ ఓటమి విషయంలో మాజీ మంత్రి రామచంద్రారెడ్డి వర్గానికి చెందిన మైనార్టీ నాయకుడు నదీంఖాన్ మాట్లాడుతూ.. పార్టీ మైనార్టీ నాయకులు కొందరు అనుకూలంగా పనిచేయలేదని విమర్శించారు. దీంతో ఆ పార్టీ మైనార్టీ నాయకుడు సాజిద్‌ఖాన్ వర్గానికి చెందిన కొందరు ఒక్కసారిగా స్టేజీ పైకి దూసుకొచ్చారు. నదీంఖాన్‌పై పిడిగుద్దులు కురిపించారు. దీంతో సమావేశం రసాభాసగా మారింది. కార్యకర్తలు కొట్టుకోవడం చూసిన నాయకులకు ఏం చేయాలో పాలుపోలేదు. కొంతసేపటి తర్వాత ఇరువర్గాల కార్యకర్తలను సముదాయించారు. మరోవైపు మైనార్టీ నాయకుడు సాజిద్‌ఖాన్, మాజీ మంత్రి రామచంద్రారెడ్డి వేదికపైనే వాగ్వాదానికి దిగారు. ఇప్పటికే అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర ఓటమితో సతమతం అవుతున్న నాయకులకు, ఈ గ్రూపుతగాదాలు పెద్ద తలనొప్పిగా మారాయి. నియోజకవర్గంలోని ఈ గ్రూపు విభేదాల కారణంగా ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తల మధ్య సయోధ్య ఉండటం లేదు. తాజా గొడవతో ఈ దూరం మరింత పెరిగింది. నాయకులే ఇలా కొట్టుకుంటుంటే పంచాయతీ ఎన్నికలకు ఎలా సిద్ధమవుతామని కార్యకర్తలు చర్చించుకుంటున్నారు.

పాలమూరులో ఆర్వోబీ ఏర్పాటు చేయండి

- రైల్వే డీఆర్‌ఎంకు ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ విజ్ఞప్తి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లోని బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం నుంచి మోతీనగర్ రైల్వేకాలనీ వరకు రోడ్డు వేయడానికి, రైల్వే అండర్ బ్రిడ్జి(ఆర్వోబీ) ఏర్పాటుకు అనుమతినివ్వాలని రైల్వే డీఆర్‌ఎం అరుణ్‌కుమార్ జైన్‌కు ఎమ్మెల్యే శ్రీనివాస్ గౌడ్ విన్నవించారు. బుధవారం సికింద్రాబాద్‌లో రైల్‌భవన్‌లో డీఆర్‌ఎంతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు సమస్యలను డీఆర్‌ఎం దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించినట్టు శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.



బుధవారం సికింద్రాబాద్ రైల్ భవన్‌లో డీఆర్‌ఎం అరుణ్‌కుమార్ జైన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్

గల్ఫ్ బాధితులను ఆదుకోవడమే జాగృతి ధ్యేయం

- మలేషియాలో చిక్కుకున్న ఐదుగురిని స్వదేశానికి రప్పించాం
- తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్‌ఆచారి

నందిపేట్: గల్ఫ్ బాధితులను ఆదుకోవడమే తమ ప్రధానధ్యేయమని తెలంగాణ జాగృతి ప్రధానకార్యదర్శి నవీన్ ఆచారి పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండల కేంద్రంలో బుధవారం గల్ఫ్ బాధితులతోకలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బాద్గుణ, ఉమ్మెడ, మాయాపూర్ గ్రామాలకు చెందిన ఐదుగురు యువకులు ఏజెంట్ చేతిలో మోసపోయి మలేషియా దేశంలో చిక్కుకోగా వారికి అండగా నిలిచి స్వదేశానికి రప్పించామన్నారు. సరైన పత్రాలు లేకపోవడంతో యువకులను మలేషియా ఎంబసీలో బంధించారని.. వారు 45 రోజులపాటు నరకయాతన అనుభవించారని చెప్పారు.



జాగృతి నాయకులకు వాట్సప్‌ద్వారా పరిస్థితిని తెలుపడంతో వెంటనే స్పందించి ఎంబసీ అధికారులతో మాట్లాడి రూ.2.50 లక్షలు జరిమానా చెల్లించడంతో పాటు విమానచార్జీలు భరించి స్వదేశానికి తీసుకొని వచ్చామన్నారు. డిసెంబర్ 31న వారు స్వదేశానికి చేరుకున్నారని తెలిపారు. జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కవిత ఆధ్వర్యంలో ఎంతోమంది బాధితులను స్వదేశానికి తీసుకొచ్చామని గుర్తుచేశారు. ఈ సమావేశంలో జాగృతి జిల్లా అధ్యక్షుడు అవంతిరావు, నాయకులు మనోజ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌స్తంభాన్ని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- త్రుటిలో తప్పిన పెను ప్రమాదం


ఆలేరు టౌన్: కారును ఓవర్‌టేక్ చేయబోయి ఓ ఆర్టీసీ బస్సు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొన్న ఘటన బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్-1 డిపోకు చెందిన రాజధాని బస్సు బుధవారం ఉదయం హైదరాబాద్ నుంచి హన్మకొండకు బయలుదేరింది. మధ్యాహ్నం 12 గంటలకు ఆలేరులోని సాయిబాబా దేవాలయం దాటగానే ముందున్న కారును ఓవర్‌టేక్ చేయబోయి అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న పెట్రోల్ బంక్ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ స్తంభాన్ని ఢీకొట్టింది. అప్రమత్తమైన డ్రైవర్ బస్సును రివర్స్ తీయగా త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పింది. 35 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు.



బస్సు ఢీకొట్టడంతో విరిగిపోయిన కంరటు స్తంభం. (ఇన్‌సెట్) ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు

నీటి బకెట్‌లో పడి చిన్నారి మృతి

బల్మూరు: నీటి బకెట్‌లోపడి 17 నెలల బాలుడు ప్రాణాలు వదిలిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో జరిగింది. బల్మూరు మండలంలోని తోడెలగడ్డకు చెందిన సాయిబాబు, శ్రీదేవి దంపతులు తమ 17నెలల బాబును తీసుకొని మంగళవారం అమ్రాబాద్ మండలం వంగురోనిపల్లిలో పెండ్లికి వెళ్లారు. అందరూ పెండ్లి పనుల్లో నిమగ్నమై ఉండగా బాలుడు నీటి బకెట్‌లో పడిపోయాడు. చాలాసేపటి వరకు గమనించకపోవడంతో ఊపిరాడక మృతిచెందాడు.



విక్రమ్(ఫైల్)

పుట్టినరోజు తెల్లారే మృత్యుఒడిలోకి..

- మెంతోప్లస్ డబ్బా గొంతులో ఇరుక్కొని చిన్నారి మృతి

పాపన్నపేట: మెంతోప్లస్ డబ్బా గొంతులో ఇరుక్కొని చిన్నారి (1) మృతిచెందిన ఘటన పాపన్నపేట మండల పరిధిలోని కొడుపాకలో విషాదం నింపింది. స్థానికుల సమాచారం మేరకు కొడుపాక గ్రామానికి చెందిన దమ్ము రాజు, యశోద దంపతుల కూతురు బిందు మొదటి పుట్టినరోజు వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. బుధవారం సాయంత్రం రాజు దంపతులు తమ కుమార్తె బిందును తీసుకొని గ్రామంలోని మరొకరి ఇంట్లో శుభకార్యానికి వెళ్లారు. చిన్నారి ఆడుకుంటూ మెంతోప్లస్ డబ్బా నోట్లో పెట్టుకోగా.. అది గొంతులో ఇరుకున్నది. గమనించిన తల్లిదండ్రులు మెదక్‌లోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించగా, చికిత్స ప్రారంభించేలోపే మృతిచెందింది. ఆరేండ్ల తర్వాత పుట్టిన బిడ్డ అకాల మరణంతో కుటుంబం విషాదంలో మునిగింది.

గిరిజన యువతుల అనుమానాస్పద మృతి

చర్ల: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలానికి చెందిన ఇద్దరు గిరిజన యువతులు అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీకాలనీకి చెందిన మడవి జానకి (18), సాయినగర్ కాలనీకి చెందిన శ్యామల సంగీత(19) బుధవారం ఉదయం కూలిపనుల కోసం ఇంట్లో నుంచి వెళ్లారు. సాయంత్రం గోదావరిలంకలో అపస్మారక స్థితిలో పడిఉండటంతో స్థానికులు గమనించి చర్లలోని పీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమించడంతో భద్రాచలం ఏరియా దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ ప్రాణాలు వదిలారు. యువతులు పురుగుల మందుతాగి ఉంటారని వైద్యులు భావిస్తున్నారు. ప్రేమ వ్యవహారమే ఈ అఘాయిత్యానికి కారణమై ఉంటుందని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఈ ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

జూరాల నీటి లెక్కలపై కమిటీ భేటీ నేడు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జూరాల జలాశయానికి వచ్చిన ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో మధ్య తేడాలపై ఆంధ్రప్రదేశ్‌చేసిన ఫిర్యాదుమేరకు కృష్ణాబోర్డు నియమించిన కమిటీ గురువారం తొలిసారి జలసౌధలోని బోర్డు కార్యాలయంలో భేటీ కానుంది. శ్రీశైలం అవుట్‌ఫ్లో-సాగర్ ఇన్‌ఫ్లో మధ్య గత రెండేండ్లుగా భారీ తేడా ఉన్నట్టు తెలంగాణ ఆధారాలతో సహా కృష్ణాబోర్డుకు ఫిర్యాదుచేసిన విషయం తెలిసిందే. దీనిపై బోర్డు రెండేండ్లుగా ఎటూ తేల్చడంలేదు. కొన్నిరోజుల కిందట జూరాల జలాశయానికి వచ్చే ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో మధ్య తేడా ఉన్నదని బోర్డుకు ఏపీ ఫిర్యాదుచేయగా, బోర్డు ఉన్నతాధికారులు దీనిపై కమిటీ వేశారు.

నేటి నుంచి వస్త్ర క్రయవిక్రయదారుల సమావేశాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వస్త్ర క్రయవిక్రయదారుల (టెక్స్‌టైల్ బయ్యర్స్ అండ్ సెల్లర్స్) సమావేశాలు కేంద్ర జౌళి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో గురువారం నుంచి 6 వరకు హైదరాబాద్‌లో జరుగుతాయి. బిజినెస్ టు బిజినెస్ (బీటుబీ) విధానంలో జరిగే సమావేశాలకు బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12లోని కళింగభవన్ వేదిక కానున్నది. సమావేశాలతోపాటు వస్త్రాలను విక్రయించనున్నారు. తెలంగాణ వస్త్ర ఉత్పత్తిదారులతోపాటు గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు, మధ్యప్రదేశ్ తదితర రాష్ర్టాల వ్యాపారులు పాల్గొంటారు. గురువారం ఉదయం 11 గంటలకు సమావేశాలను రాష్ట్ర చేనేత జౌళిశాఖ డైరెక్టర్ శైలజా రామయ్యార్ ప్రారంభిస్తారు. కేంద్ర ప్రభుత్వ పవర్‌లూం డెవలప్‌మెంట్ అండ్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ డైరెక్టర్ కట్టెకోల లక్ష్మీనారాయణ, హైదరాబాద్ కట్‌పీస్ క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సుభాష్ అగర్వాల్ పాల్గొంటారు.



బుధవారం హైదరాబాద్‌లో హోంమంత్రి మహమూద్‌అలీని కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



బుధవారం హైదరాబాద్‌లో హోంమంత్రి మహమూద్‌అలీకి శుభాకాంక్షలు తెలియజేస్తున్న మాజీమంత్రి జూపల్లి కృష్ణారావు

'శాలసిద్ధి'లో పాఠశాలల సమాచారం

- ఎన్సీఈఆర్టీ ప్రత్యేక వెబ్‌పోర్టల్ ఏర్పాటు.. విద్యార్థులు, ఉపాధ్యాయుల వివరాలు
- ఈ పోర్టల్ ద్వారానే సమాచారం సేకరణ.. అభివృద్ధికి అనుకూలంగా చర్యలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు రూపొందించే పలు కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్, రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్సీఈఆర్టీ) ఆధ్వర్యంలో ఏర్పాటైన 'శాలసిద్ధి' ప్రత్యేక పోర్టల్‌లో రాష్ట్రంలోని పాఠశాలకు చెందిన సమగ్ర సమాచారం అప్‌లోడ్ చేస్తున్నారు. ఏయే పాఠశాలల అభివృద్ధి ఏస్థాయిలో ఉన్నది? ఇంత వరకు జరిగిన అభివృద్ధి ఏమిటి? ఇంకా ఏమేం చేయాల్సి ఉన్నది? అందుకు వనరులు ఏవిధంగా ఉన్నాయి? అనే వివరాలతోపాటు విద్యార్థుల పేర్లు (ఎన్‌రోల్‌మెంట్), ఉపాధ్యాయుల వివరాలను శాలసిద్ధి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ ప్రక్రియ దాదాపు పూర్తిచేశారు. ఎన్సీఈఆర్టీ ప్రత్యేకంగా శాలసిద్ధి పేరుతో వెబ్‌పోర్టల్ నమూనాను తయారుచేసి, అందుబాటులోకి తీసుకువచ్చింది. ఎప్పటికప్పుడు వివరాలను www.shalasiddhi.com పోర్టల్‌లో అప్‌లోడ్ చేయడంతో ఎక్కడ లోపాలు ఉన్నాయి? వాటిని ఎలా పూరించాలనేదానిపై పాఠశాల విద్యాధికారులకు, హెడ్‌మాస్టర్లకు పూర్తి అవగాహన కలుగుతుందని అధికారులు స్పష్టంచేశారు. రాష్ట్రంలో మొత్తం 29,118 ప్రభుత్వ పాఠశాలలు ఉంటే ఇప్పటికే 25,038 పాఠశాలల వివరాలు ఈ పోర్టల్‌లో అప్‌లోడ్ చేశారు. 11,763 ప్రైవేటు పాఠశాలలు ఉంటే 9,670 పాఠశాలల వివరాల నమోదు ప్రక్రియ పూర్తిచేసినట్టు ఉన్నతాధికారులు తెలిపారు.

సహజీవనంతో శారీరక సంబంధం

లైంగికదాడి కాదు: సుప్రీం

న్యూఢిల్లీ: సహజీవనం చేస్తూ శారీరక సంబంధం పెట్టుకున్న పురుషుడు.. మహిళను పెండ్లి చేసుకోనప్పటికీ, లైంగికదాడి కాదని సుప్రీంకోర్టు తెలిపింది. ఓ నర్సు, డాక్టర్ గతంలో సహజీవనం చేశారు. వేరే మహిళను డాక్టర్ పెండ్లి చేసుకోగా కేసు నమోదైంది. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ డాక్టర్ బాంబే హైకోర్టును ఆశ్రయించగా తిరస్కరించింది. దీంతో ఆయన సుప్రీంను ఆశ్రయించగా బుధవారం జస్టిస్ ఏకే సిక్రి, ఎస్ అబ్దుల్ నజీర్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. 'లైంగికదాడికి, పరస్పర సమ్మతితో కూడిన శారీరక సంబంధానికి మధ్య స్పష్టమైన గీత ఉన్నది. ఓ వ్యక్తి నిజంగా ఆమెను పెండ్లి చేసుకోవాలనుకున్నాడా? లేక తన లైంగికవాంఛ తీర్చుకోవడానికి తప్పుడు హామీ ఇచ్చాడా? ఇరువురు ఏకాభిప్రాయంతోనే సహజీవనం చేస్తున్నారా? అన్న విషయాన్ని కోర్టు స్పష్టంగా పరిశీలిస్తుంది. ఇద్దరు పరస్పర సమ్మతితో కూడిన శారీరక సంబంధం లైంగికదాడి కిందికి రాదు' అని ధర్మాసనం పేర్కొంది. లైంగికవాంఛ తీర్చుకొని దురుద్దేశంతోనే పెండ్లి చేసుకోకుంటే లైంగికదాడేనని స్పష్టం చేసింది.

రాష్ట్ర విభజన సమయంలోని పోలీస్ అధికారుల వివరాలివ్వండి

- తెలంగాణ డీజీపీని కోరిన ఏపీ డీజీపీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర విభజన సమయంలో పోలీస్‌శాఖలో వివిధ స్థాయిల్లో విధులు నిర్వహిస్తున్న అధికారుల వివరాలు పంపాలని తెలంగాణ డీజీపీని ఆంధ్రప్రదేశ్ డీజీపీ కోరారు. 1 జూన్ 2014 నాటికి పదవిలో కొనసాగుతున్న అధికారుల సమాచారం అందించాలని కోరారు. అనధికారికంగా ఉద్యోగానికి రాకపోవడం, దీర్ఘకాలిక సెలవు, ఆ తర్వాత పదవీ విరమణ పొందిన, మరణించిన, సస్పెండ్ అయిన, ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నవారు, డిస్మిస్ అయినవారి వివరాలను supdt.g.co@gmail.com కు పంపాలని తెలిపారు. మెయిల్ లేదా 9440901973 ఫోన్ నంబర్‌కు వాట్సప్ చేయడంతోపాటు హార్డ్ కాపీలను డీజీపీ కార్యాలయానికి పంపాలని కోరారు.

ఫిబ్రవరిలో ఎలిమెంటరీ డిప్లొమా పరీక్షలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ (ఎన్ఐవోఎస్) ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ డిప్లొమా కోర్సు (డీఎల్ఈడీ) పరీక్షలు వచ్చే నెల 14,15 తేదీల్లో నిర్వహించేందుకు ఏర్పా ట్లు పూర్తిచేసినట్టు ఎన్ఐవోఎస్ ప్రాంతీయ డైరెక్టర్ అనిల్‌కుమార్ తెలిపారు. పరీక్షలకు హాజరయ్యేవారు జనవరి 10వ తేదీలోగా ఫీజు చెల్లించాలని బుధవారం విడుదలచేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో వృత్తివిద్యా కోర్సులు

- వచ్చే విద్యాసంవత్సరం నుంచి అందుబాటులోకి..
- ప్రయోగాత్మకంగా వంద స్కూళ్లలో వృత్తివిద్య
- టీచర్లకు ప్రత్యేక శిక్షణ.. గౌరవ వేతనం
- ఇప్పటికే 192 మోడల్ స్కూళ్లల్లో అమలు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రెగ్యులర్ తరగతులతోపాటు వృత్తివిద్యా (ఒకేషనల్) కోర్సులను అందించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. విద్యార్థులు జీవితంలో స్థిరపడేలా చదువులు ఉండాలని కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించిన నేపథ్యంలో.. అందుకవసరమైన చర్యలను అధికారులు చేపట్టారు. 2015-16 విద్యాసంవత్సరం నుంచి క్రమేణా వృత్తి విద్యా విధానం తీసుకొచ్చారు. ఇప్పటివరకు రాష్ట్రంలోని 177 మోడల్ స్కూళ్లలో వృత్తి విద్య అందుబాటులోకి వచ్చింది. దానివల్ల మంచి ఫలితాలు వస్తుండటంతో 2018-19లో మరో 15 మోడల్ స్కూళ్లకు వర్తింపజేశారు. మొత్తం 192 మోడల్ స్కూళ్లలో వృత్తివిద్యను అందుబాటులోకి తెచ్చిన విద్యాశాఖ.. ఇకనుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో దశలవారీగా అమలుచేసే అంశంపై కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నది. 2019-20 విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి కనీసం 100 పాఠశాలల్లో ఈ కోర్సులను ప్రవేశపెట్టేందుకు చర్యలు చేపట్టింది. అందుకు సంబంధించిన ప్రతిపాదనలు రూపొందించి, కేంద్ర మానవ వనరుల మంత్రిత్వశాఖకు పంపే పనిలో నిమగ్నమయ్యారు. వృత్తివిద్యా కోర్సులను 9,10,11,12 తరగతుల విద్యార్థులకు అందిస్తున్నారు.

60:40 నిష్పత్తితో కేంద్రం నిధులు

పాఠశాల స్థాయినుంచి వృత్తి విద్యావిధానాన్ని అందుబాటులోకి తీసుకురావాలని భావించిన కేంద్రం ఈ మేరకు అన్ని రాష్ట్రాలను ఆదేశించింది. ఇందుకోసం 60:40 నిష్పత్తిలో నిధులు మంజూరు చేస్తుంది. ఒక్కో స్కూల్ పాయింట్‌కు కనీసం రూ.10 లక్షలు తగ్గకుండా నిధులుఇస్తున్నది. కేంద్రం అనుమతించిన ప్రతిస్కూల్‌లో కనీసం రెండురకాల వృత్తి విద్యాకోర్సులను తప్పనిసరిగా అమలుచేయాలి. తరగతిలో 40 మంది విద్యార్థులు ఉండేలా చర్యలు తీసుకోవాలి. కోర్సులను బోధించడానికి టీచర్లను నియమించడంతోపాటు వారికి శిక్షణ ఇస్తారు. కేంద్రం నిర్దేశించినవిధంగా గౌరవ వేతనం అందజేస్తారు. ప్రస్తుతం రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లలో దాదాపు 50 వేలమంది విద్యార్థులు వృత్తివిద్యా కోర్సుల్లో ప్రవేశాలు పొందారు. శిక్షణ పొందిన టీచర్లు 384 మంది అందుబాటులో ఉన్నారు. భవిష్యత్తులో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కూడా వృత్తివిద్యా కోర్సులను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంలో విద్యాశాఖ ముందుకుపోతున్నది.

ప్రస్తుతం అందిస్తున్న ఒకేషనల్ కోర్సులు

మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్, బ్యాంక్ అండ్ ఫైనాన్స్ సర్వీస్, అపారెల్ (ఇంట్లోనే వస్తువుల తయారీ), ఫిజికల్ ఎడ్యుకేషన్, రిటైల్, బ్యూటీ అండ్ వెల్‌నెస్, టూరిజం అండ్ హాస్పిటాలిటీ, ఐటీ, ఐటీ టెక్నాలజీ సర్వీసెస్, అగ్రికల్చర్, హెల్త్‌కేర్, ఎలక్ట్రానిక్స్ అండ్ హార్డ్‌వేర్, మల్టీ స్కిల్ ఫౌండేషన్.

ఏనోటా విన్నా ఆందోళనే

- పంచాయతీ ఎన్నికల్లో తొలిసారి నోటా
- కలవరపడుతున్న ఆశావహ అభ్యర్థులు
- 2018 అసెంబ్లీ ఎన్నికల్లో నోటాకు 2.24 లక్షల ఓట్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గ్రామ పంచాయతీ ఎన్నికల బ్యాలెట్‌లో తొలిసారి నన్ ఆఫ్ ద ఎబౌ (నోటా)కు స్థానం దక్కడంతో బరిలోనిలిచే అభ్యర్థుల్లో ఆందోళనవ్యక్తమవుతున్నది. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఐ, సీపీఎం, టీజేఎస్ పార్టీల కంటే నోటాకే అధిక ఓట్లు పడటం కలవరపెడుతున్నది. ప్రతి ఓటు కూడా గెలుపోటములపై ప్రభావం చూపనుండటంతో భవితవ్యం తారుమారవుతుందని భయం పట్టుకున్నది. ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థుల్లో ఎవరూ నచ్చకపోతే నోటాకు ఓటేసే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించింది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో నోటాకు 2,24,709 ఓట్లు పడగా, పోలైన ఓట్లలో అది దాదాపు 1.1 శాతం.

ఒక్క ఓటైనా ముఖ్యమే

పంచాయతీ ఎన్నికల్లో ఓటర్ల సంఖ్య తక్కువగా ఉండటంతో ప్రతీఓటుకు అభ్యర్థులు ప్రాధాన్యమిస్తారు. ఒక్కో ఓటును దక్కించుకొనేందుకు ఎన్నో కష్టాలు పడుతారు. గ్రామంలో ఉన్న ఓట్లెన్ని? ఎంతమంది తమకు ఓటేస్తే గెలుస్తామనే సమగ్రమైన నివేదికను రూపొందించుకొని అభ్యర్థులు ముందుకుసాగుతారు. గ్రామం బయట ఉన్నవారిని కూడా ఓటేసేందుకు రప్పించేందుకు నానా ఇబ్బందులు పడుతారు. ఇలాంటి సమయంలో బ్యాలెట్‌లోకి వచ్చిన నోటా ఎవరి కొంప ముంచుతుందోనని పోటీచేయనున్న అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. ఒకటిరెండు ఓట్లు కూడా చాలా మంది గెలుపోటములపై ప్రభావం చూపనున్నది. ఈ నేపథ్యంలో ఇటీవల నోటాకు పడ్డ ఓట్లు ఆశావహ అభ్యర్థులను కలవరపెడుతున్నాయి. నిరక్షరాస్యులైన ఓటర్లకు ఒకటికి పదిసార్లు చెప్పి పోలింగ్ బూత్‌కు పంపిస్తారు. కానీ, చదువుకున్నవారి ఓటును నోటాకు పడకుండా ఎలా ఆపగలమని ఆందోళన చెందుతున్నారు.



బ్యాలెట్‌లో చివరగా నోటా

ఈవీఎంలలో మాదిరిగానే పంచాయతీ ఎన్నికల్లోని బ్యాలెట్ పేపర్‌లో కూడా అభ్యర్థుల జాబితా తర్వాత చివరగా నోటా ఉంటుంది. గ్రామీణప్రాంతాల్లో అవగాహన లేక చివరనున్న నోటాకు ఓట్లు పోలయ్యే ప్రమాదం ఉన్నదని ఆశావహ అభ్యర్థులు అంచనా వేస్తున్నారు. నువ్వా.. నేనా.. అన్నట్టు సాగే ఎన్నికల్లో గెలిపించకపోయినా ఓడించే శక్తి మాత్రం నోటాకు ఉన్నది. గ్రామాల్లో నోటాపై అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచారం చేయాల్సి ఉండగా దీనిపై ఎన్నికల కమిషన్ పెద్దగా స్పందించకపోవడం కొంత ఇబ్బందికరంగా మారింది.

రెండో విడుత పోలింగ్ తేదీలు మార్చండి

- ఎన్నికల సంఘానికి ఉపాధ్యాయ సంఘాల విజ్ఞప్తి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఇటీవల విడుదల చేసిన గ్రామపంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్‌లో రెండో విడుత పోలింగ్ తేదీని మరో రోజుకు మార్చాలని పలు ఉపాధ్యాయ సంఘాలు విజ్ఞప్తిచేస్తున్నాయి. రెండో విడుత ఎన్నికలు ఈ నెల 25వ తేదీన జరుపుతున్నట్టు రెండురోజులక్రితం రాష్ట్ర ఎన్నికలసంఘం ప్రకటించింది. గణతంత్ర దినోత్సవం (26వ జనవరి) సందర్భంగా పాఠశాలల్ని ముస్తాబు చేయడం, విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించడం వంటి పనుల్లో ఉపాధ్యాయులు బిజీగా ఉంటారని, అందువల్ల ముందుగా ప్రకటించిన 25వ తేదీని మార్చాలని టీటీఎఫ్, టీటీయూ, తదితర ఉపాధ్యాయ సంఘాల నాయకులు బుధవారం వేర్వేరుగా ప్రకటనలు విడుదలచేశారు.


పదేండ్లపాటు ఇవే రిజర్వేషన్లు

- కొత్త చట్టంతో గ్రామాల అభివృద్ధి
- సర్పంచ్ పదవులపై పెరుగుతున్న ఆసక్తి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పంచాయతీ ఎన్నికల సందర్భంగా ఈసారి ఖరారు చేసిన రిజర్వేషన్లు మళ్లీ వచ్చే పంచాయతీ ఎన్నికలకు కూడా వర్తించనున్నాయి. పదేండ్లపాటు ఒకే రిజర్వేషన్ వర్తించేలా నూతన పంచాయతీరాజ్ చట్టంలో రూపొందించారు. దీంతో ఈసారి ఆయా గ్రామాలకు పోటీచేసే సర్పంచ్ అభ్యర్థుల్లో ఆసక్తి పెరుగుతున్నది. పంచాయతీ ఎన్నికలకు రెండు పర్యాయాలు ఒకే రిజర్వేషన్‌ను వర్తించేలా రూపొందించి, అమలు చేస్తున్నారు. గ్రామాల అభివృద్ధిలో ఇది కీలకంగా మారనుందని ప్రభుత్వం భావిస్తున్నది. ఒకే రిజర్వేషన్‌ను రెండు పర్యాయాలు వర్తింపచేస్తే ఒకసారి కొలువుదీరిన పాలకవర్గం అభివృద్ధి పనులు చేపడుతుందని, మళ్లీ పోటీచేసి గెలిచే అవకాశాలు ఉండటంతో మంచి పాలన అందిస్తుందని చట్టం రూపొందించే సమయంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

ఓటు నమోదు సామాజిక బాధ్యత


- పట్టభద్రులు పేర్లు నమోదు చేసుకోవాలి
- తుది జాబితాను పరిశీలించాలి
- గ్రూప్-1 అధికారుల సంఘం అధ్యక్షుడు మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని గ్రాడ్యుయేట్లంతా పట్టభద్రుల నియోజకవర్గ ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలని గ్రూప్-1 అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్ కోరారు. రాష్ట్రంలో పట్టభద్రుల నియోజకవర్గాల ఓటరు జాబితా ముసాయిదా విడుదలచేశారని తెలిపారు. 2015 నవంబర్ 1 నాటికి డిగ్రీ పూర్తిచేసినవారంతా ఎన్నికలసంఘం వెబ్‌సైట్‌లో దరఖాస్తుచేసుకోవాలన్నారు. ఓటు హక్కు నమోదుకు ఎన్నికలసంఘం వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలతోపాటు ఒక ఫొటో, గెజిటెడ్ అధికారి ధ్రువీకరించిన డిగ్రీ పట్టాను అప్‌లోడ్ చేయాలని సూచించారు. వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోకుంటే ఫాం-18 ద్వారా నేరుగా రెవెన్యూ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకునే అవకాశమున్నదని వివరించారు. ప్రస్తుతం మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గం గ్రాడ్యుయేట్ల ముసాయిదా జాబితా అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో అందుబాటులో ఉన్నదన్నారు. ఈ నెల 31 వరకు ఓటరు జాబితాలో అభ్యంతరాలను సరి చేయడం, ఓటరు నమోదు కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నారని, ఫిబ్రవరి 15 వరకు పరిశీలన చేసి అనుబంధ జాబితా విడుదల చేయనున్నట్టు చంద్రశేఖర్‌గౌడ్ వివరించారు. జనవరి 31 వరకు ఓటరు నమోదుకు అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. ప్రస్తుతం విడుదల చేసిన ముసాయిదా ప్రకారం 1.43 లక్షల మంది పట్టభద్రుల ఓటర్లున్నారని, అయితే చాలా చోట్ల ఓట్లు తక్కువ సంఖ్యలో నమోదు చేసుకున్నట్టు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఈ విషయంపై ఎన్నికల సంఘానికి విన్నవించామని పేర్కొన్నారు. పట్టభద్రుల ఓటుకు ఎంతో ప్రాముఖ్యం ఉన్నదన్నారు. ఇప్పటివరకు దాదాపు 3 వేల నుంచి 4 వేల ఓట్లు తప్పినట్టు భావిస్తున్నామని, వీటిపై పరిశీలన చేయాలని చంద్రశేఖర్‌గౌడ్ కోరారు.

'పంచాయతీ'కి పోలీస్‌శాఖ సన్నద్ధం

- 5వ తేదీలోగా జిల్లాలవారీ నివేదికలు కోరిన డీజీపీ కార్యాలయం



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గ్రామ పంచాయతీ ఎన్నికల నగారా మోగడంతో ఎన్నికల భద్రత ఏర్పాట్లు, పోలీస్ సిబ్బంది కేటాయింపు తదితర అంశాలపై పోలీస్‌శాఖ దృష్టిపెట్టింది. రాష్ట్రంలోని 12,732 గ్రామాల్లో మూడువిడుతల్లో ఎన్నికలు జరుగనున్నాయి. జిల్లాలవారీగా ఎన్ని గ్రామ పంచాయతీలు, వార్డులు ఉన్నాయి, ఎక్కడెక్కడ బందోబస్తు ఎక్కువ ఏర్పాటుచేయాల్సి ఉంటుందన్న వివరాలతో ఈనెల 5లోపు నివేదికలను పంపాలని ఎస్పీలకు డీజీపీ కార్యాలయం నుంచి ఆదేశాలు వెళ్లాయి. తీవ్ర సమస్యాత్మక వార్డులు ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున పూర్తిస్థాయిలో ముందస్తు సమాచారాన్ని సేకరిస్తున్నట్టు పోలీస్ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. జిల్లాలవారీగా సమాచారం సేకరించిన తర్వాత బందోబస్తు ప్రణాళికలు రూపొందించడంతోపాటు విడుతలవారీగా భద్రతా సిబ్బందిని ఎలా కేటాయించుకోవాలన్నది నిర్ణయించనున్నారు. రాష్ట్ర పోలీసులతోపాటు సుమారు పదివేలమంది వరకు సాయుధ బలగాలను అవసరం మేరకు పంచాయతీ ఎన్నికల బందోబస్తులో వాడుకోనున్నారు.

సంగ్రామంలో ఏకగ్రీవం



నిజామాబాద్ జిల్లా గోవింద్‌పల్లిలో ఏకగ్రీవ ఎన్నుకున్న సర్పంచ్ గంగమోహన్, ఉప సర్పంచ్ పద్మను సన్మానిస్తున్న గ్రామస్తులు



నిజామాబాద్ జిల్లా వెంగల్‌పాడ్‌లో సర్పంచ్ బాదావత్ లక్ష్మి, ఉపసర్పంచ్ గంగాధర్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు



నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలం గైరాన్ తండాలో ఏకగ్రీవం కావడంతో సంబురాలు



సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం లక్ష్మీపూర్ తండాలో ఏకగ్రీవమైన సర్పంచ్ మంజులతో పాలకవర్గం

మొదటిపేజీ తరువాయి...

ఏకగ్రీవం కాగా, బుధవారం ఇదే మండలం గోవింద్‌పల్లి, ఇదే జిల్లా ఇందల్వాయి మండలం వెంగల్‌పాడ్, నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలం గైరాన్ తండా, రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలోని లక్ష్మీపూర్‌తండాలు ఏకగ్రీవమయ్యాయి.

మొదలైన ఓట్ల వేట..

మరో నాలుగురోజుల్లో తొలి విడుత నామినేషన్ల ప్రక్రియ మొదలుకానున్నది. ఈ నేపథ్యంలో పంచాయతీల్లో ఓట్లవేట ప్రారంభమైంది. కొత్తగా ఆవిర్భవించిన గ్రామ పంచాయతీల్లో అంతా ఒక్కతాటిపై నిలబడేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రధానంగా యువత ఏకగ్రీవాలపై దృష్టి పెట్టింది. నేతలు కలిసిరానిచోట మాత్రం ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. ఇందులో ప్రజలు గ్రామాభివృద్ధికి పాటుపడే అవకాశమున్నవారి వెంట నడుస్తున్నారు. కొత్తచట్టం నేపథ్యంలో ఎక్కువ నిధులు వచ్చేఅవకాశం ఉండటంతో తమ గ్రామాలను బాగు చేసుకునే పనిలో ఉన్నారు. కొత్త రాష్ట్రం, కొత్త చట్టం, కొత్త పాలకవర్గం కానుండటంతో ఎన్నికలు మరింత హోరెత్తుతున్నాయి. ఇప్పటికే బరిలో నిలిచిన ఉత్సాహవంతులు ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలోపడ్డారు.

కలిసివస్తున్న సంక్షేమపథకాలు

గ్రామాల్లో అధికారపార్టీకి అభివృద్ధి, సంక్షేమ పథకాలు కలిసి వస్తున్నాయి. మిషన్ భగీరథతో ఇంటింటికీ తాగునీటి అందించే పైపులు ఇండ్లకు చేరాయి. ఇన్నిరోజులు తాగునీటికి తండ్లాడిన గ్రామాలు ఇప్పుడు మిషన్ భగీరథ పైపులను చూసి సంబురపడుతున్నాయి. సంక్షేమ పథకాలు, ఆసరా పింఛన్లతోపాటు గ్రామాల అభివృద్ధికి నేరుగా బడ్జెట్‌నుంచే నిధులు రావడం పల్లెల్లో చర్చనీయాంశమవుతున్నది. ఈ నేపథ్యంలో గ్రామాభివృద్ధికి పాటుపడే వారిని ఎన్నుకునేందుకు సిద్ధమవుతున్నారు.

సర్కారు సంస్కరణలకు తోడుగా..

పంచాయతీల అభివృద్ధికి చేసిన నూతన చట్టం గ్రామాల్లో చర్చనీయాంశంగా మారింది. సర్పంచ్‌లకు సర్వాధికారాలను కల్పించడం, నిధులు పక్కదారి పట్టకుండా గ్రామాభివృద్ధే లక్ష్యంగా వినియోగించడం, ప్రజల భాగస్వామ్యం పెంచడం, అవసరమయ్యే పనులు చేయడం, పచ్చదనం, స్వచ్ఛతకు పెద్దపీట వేయడం ఇప్పుడున్న యువతను ఆకర్షిస్తున్నట్టు తెలుస్తున్నది. యువనేతలకు టీఆర్‌ఎస్ సర్కారు కూడా ఎర్ర తివాచీ పరిచింది. గ్రామాభివృద్ధి లక్ష్యంగా పని చేసే యువతకు ప్రభుత్వం చేయూతనిస్తున్నది. యువనేతల రాకతో పల్లెల అభివృద్ధి పరుగులు పెడుతుందని ప్రజలు చర్చించుకుంటున్నారు. యువత కూడా ఇప్పటికే గ్రామ రాజకీయాల్లో మార్పు అంటూ సోషల్ మీడియాతో ప్రచారం మొదలుపెట్టారు. గ్రామాభివృద్ధే లక్ష్యంగా ప్రచారం చేసుకుంటున్నారు. 'మన ఊరి అభివృద్ధి నా ధ్యేయం.. అందుకే నేను సర్పంచ్‌గా పోటీ చేయాలనుకుంటున్నా.. మీ అభిప్రాయం చెప్పండి' అంటూ సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు.

మరో నాలుగు పంచాయతీలు ఏకగ్రీవం

ఇందల్వాయి/ ధర్పల్లి/ చారకొండ/ గంభీరావుపేట: రాష్ట్రవ్యాప్తంగా పలు పంచాయతీలు ఏకగ్రీవం దిశగా కదులుతున్నాయి. పంచాయతీలను మరింత అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ప్రజలంతా ఏకమై ఏకగ్రీవ తీర్మానాలు చేసుకుంటున్నారు. ఏకగ్రీవాల వల్ల ప్రభుత్వం అందించే రూ.10 లక్షలతో గ్రామంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు వీలవుతుందని చెప్తున్నారు. ముఖ్యంగా కొత్తగా ఏర్పడిన పంచాయతీలు ఈ విషయంలో ఆదర్శంగా నిలుస్తున్నాయి. నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం గోవింద్‌పల్లివాసులు బుధవారం సర్పంచ్, ఉపసర్పంచ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సర్పంచ్‌గా గంగమోహన్, ఉపసర్పంచ్‌గా సిరికొండ పద్మను ఎన్నుకున్నారు. గ్రామ అభివృద్ధే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నామని స్థానికులు తెలిపారు. వార్డు సభ్యులను సైతం ఏకగ్రీవంగా ఎన్నుకుంటున్నామని, త్వరలోనే వెల్లడిస్తామన్నారు. అదేవిధంగా ఇందల్వాయి మండలం వెంగల్‌పాడ్ సర్పంచ్‌గా బాదావత్ లక్ష్మి, ఉపసర్పంచ్‌గా లౌడ్య గంగాధర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు జగదాంబ సేవాలాల్ ఆలయ ప్రాంగణంలో తీర్మానం చేశారు. ఇప్పటికే నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం సల్పబండ తండా ఏకగ్రీవమైంది. నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలంలో కొత్తగా ఏర్పాటైన గైరాన్‌తండా పంచాయతీకి సర్పంచ్, ఉపసర్పంచ్‌ను గ్రామస్థులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సర్పంచ్‌గా వడ్త్యావత్ సుజాతను, వార్డు మెంబర్‌గా భారతి బాలునాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం స్థానికులు సంతోషంతో సంబురాలు చేసుకున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలో కొత్తగా ఏర్పడిన లక్ష్మీపూర్‌తండా పంచాయతీ కూడా బుధవారం ఏకగ్రీవమైంది. సర్పంచ్, ఉపసర్పంచ్‌తోపాటు ఆరు వార్డు స్థానాలను ఏకగ్రీవంచేశారు. సర్పంచ్‌గా లకావత్ మంజుల, ఉపసర్పంచ్‌గా భూక్య రమేశ్, వార్డు సభ్యులుగా తేజావత్ మోహన్, లకావత్ రాజ్యానాయక్, బానోతు సరిత, తేజావత్ వనిత, భూక్య లక్ష్మిని ఎన్నకుంటున్నట్టు ప్రకటించారు. అనంతరం స్వీట్లు పంచిపెట్టుకొని సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు లింగన్నగారి దయాకర్‌రావు, సెస్ డైరెక్టర్ కొక్కు దేవేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎడమ చేతి మధ్యవేలుకు సిరాగుర్తు


- బతుకమ్మ చీరెలు, రైతుబంధు చెక్కుల పంపిణీ నిలిపివేత
- పరిశీలకులతో రేపు ఎస్ఈసీ సమావేశం



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్నవారికి ఎడమ చేతి మధ్యవేలుకు సిరాగుర్తు పెడుతారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎడమ చేతి చూపుడు వేలుకు సిరాగుర్తు పెట్టారు. ఆ సిరాగుర్తు వేలుకు ఇంకా అలాగే ఉండటంతో, పంచాయతీ ఎన్నికల్లో ఎడమ చేతి మధ్యవేలుకు సిరాగుర్తు పెట్టాలని నిర్ణయం తీసుకున్నారు. అందుకు అనుగుణంగా రాష్ట్ర ఎన్నికల సంఘం పంచాయతీ ఎన్నికల్లో ఎడమ చేతి మధ్యవేలుకు సిరాగుర్తు పెట్టాలని నోటిఫికేషన్ జారీచేసింది. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో ఎస్ఈసీ పలు నిర్ణయాలు తీసుకున్నది. రాష్ట్రంలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీలు చేపట్టరాదని, బతుకమ్మ చీరెలు, రైతుబంధు, సీఎమ్మార్‌ఎఫ్ చెక్కుల పంపిణీని వెంటనే నిలిపివేయాలని సంబంధిత శాఖలకు సూచించింది. రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల్లో, రాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి, మద్యం సరఫరాపై నిఘాపెట్టారు. రోజుకు రూ.50 వేలు మాత్రమే వెంట తీసుకెళ్లాలని, ఎక్కువ తీసుకెళ్తే సీజ్ చేయాలని నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ ఎన్నికల కోసం సాధారణ పరిశీలకులను ఎన్నికల సంఘానికి డిప్యుటేషన్‌చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో 26 మంది సీనియర్ ఐఏఎస్‌లతో శుక్రవారం సమావేశం కానున్నారు. కాగా, బుధవారం రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ నాగిరెడ్డితో పంచాయతీరాజ్ కమిషనర్ నీతూకుమారిప్రసాద్ బుధవారం భేటీ అయ్యారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణపై చర్చించారు.

గల్లంతైన ఓట్లను జాబితాలో ఎలా చేర్చాలి?

- ఈసీని ప్రశ్నించిన హైకోర్టు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గల్లంతైనవారి ఓట్లను మళ్లీ ఓటర్ల జాబితాలో ఎలా చేర్చాలో చెప్పాలని హైకోర్టు ఎన్నికల కమిషన్‌ను బుధవారం ఆదేశించింది. ఓటర్ల జాబితాలో తన పేరు గల్లంతైందని ప్రీతిసింగ్ దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయస్థానం విచారణ చేపట్టింది. జాబితాలో పేరు లేనివారు మళ్లీ తమ ఓటుహక్కును పొందేందుకు ఏదైనా దరఖాస్తు విధానం (ప్రొఫార్మా) ఉన్నదా అని ఈసీని ప్రశ్నించింది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని తెలిపిన కోర్టు విచారణను ఈ నెల 22కు వాయిదా వేసింది.

నమస్తే తెలంగాణ
ఆట
[హైదరాబాద్]
గురువారం 3 జనవరి 2019
10
WWW.NTNEWS.COM



చిన్ననాటి గురువు రమాకాంత్ అచ్రేకర్‌తో దిగ్గజ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ వినోద్ కాంబ్లీ

ఉత్సాహంగా టీఎన్జీవో స్పోర్ట్స్‌మీట్

ఎల్బీ స్టేడియంలో పోటీలను ప్రారంభించిన శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్



బేగంబజార్: ఎప్పుడూ పనులతో బిజీగా కనిపించే టీఎన్జీవోలు రెండు రోజులపాటు ఎల్బీ స్టేడియంలో ఆటలాడుతూ హుషారెత్తించనున్నారు. రెండురోజులపాటు జరిగే టీఎన్జీవో 4వ స్పోర్ట్స్‌మీట్‌ను తెంగాణ శాసన మండలి చైర్మన్ కె స్వామిగౌడ్ బుధవారం ప్రారంభించారు. షాట్‌పుట్, చెస్, క్యారమ్, కబడ్డీ, క్రికెట్‌లాంటి అంశాలలో పోటీలు జరగనున్నాయి. గురువారం పోటీలకు ఆఖరిరోజు.. రాష్ట్ర ఉద్యోగులంతా పోటీలో పాల్గొనేలా ఏర్పాట్లు చేసిన టీఎన్జీవో హైదారాబాద్‌ను ఆయన అభినందించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వం, ఉద్యోగుల మధ్య స్నేహపూర్వక వాతావరణం నెలకొని ఉందని స్వామిగౌడ్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ జీ దేవీప్రసాద్ మాట్లాడుతూ టీఎన్జీవో ఉద్యోగుల మానసిక ఒత్తిడి తగ్గించేందుకు గతంలోనూ ఎన్నో కార్యక్రమాలు నిర్వహించామని, క్రీడలతో ఉద్యోగులకు మానసికోల్లాసం కలుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ(సాట్స్) చైర్మన్ ఏ వెంకటేశ్వరరెడ్డి, రాష్ట్ర గ్రంధాలయ సంస్థ చైర్మన్ ఆయాచితం శ్రీధర్,టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు కారం రవీందర్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి మామిళ్ల రాజేందర్,కోశాధికారి రామినేని శ్రీనివాస్‌రావు, సుశీలారెడ్డి,ప్రసన్న రాంమూర్తి, టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ముజీబ్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

సచిన్ గురువు అచ్రేకర్ కన్నుమూత

క్రికెట్ ప్రపంచం ఘన నివాళి

ముంబై: బ్యాటింగ్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కోచ్ రమాకాంత్ అచ్రేకర్ (87) బుధవారం సాయంత్రం మరణించారు. గత కొంతకాలంగా ఆయన వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్నారు. 1932లో జన్మించిన అచ్రేకర్ క్రికెట్‌ను కెరీర్‌గా ఎంచుకున్నా సవ్యంగా సాగలేదు. 1943లో క్రికెట్ ఆడటం ప్రారంభించిన రమాకాంత్.. 1945లో న్యూ హిందు స్పోర్ట్స్ క్లబ్‌కు ప్రాతినిధ్యం వహించారు. ఆ తర్వాత యంగ్ మహారాష్ట్ర ఎలెవన్, గుల్ మెహర్ మిల్స్, ముంబై పోర్టు తరఫున ఆడాడు. 1963-64లో మొయనుద్దౌలా టోర్నీలో ఆలిండియా స్టేట్ బ్యాంక్ తరఫున హైదరాబాద్‌పై ఒకే ఒక్క ఫస్ట్‌క్లాస్ మ్యాచ్ ఆడారు. తర్వాత కొంతకాలానికి దాదర్‌లోని శివాజీ పార్క్‌లో కామత్ క్రికెట్ క్లబ్ పేరుతో కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో సచిన్, కాంబ్లీ, ప్రవీణ్ ఆమ్రే, అగార్కర్, బల్వీందర్ సింగ్ సంధూ, సమీర్ దిఘేలాంటి ఎంతో మంది క్రికెటర్లకు కోచింగ్ ఇచ్చినా ప్రపంచ వ్యాప్తంగా పేరు ప్రతిష్ఠలు తెచ్చింది మాత్రం టెండూల్కరే. క్రికెట్‌లో అసమాన సేవలందించినందుకు 1990లో ద్రోణాచార్య, 2010లో పద్మశ్రీ అవార్డులతో కేంద్ర ప్రభుత్వం సత్కరించింది. ముంబైలోని జింఖానా శతాబ్ది ఉత్సవాల సందర్భంగా 'జీవిత సాఫల్య పురస్కారం' అందజేశారు. అంతర్జాతీయ క్రికెట్‌లో సచిన్ సుదీర్ఘంగా కొనసాగడంలో అచ్రేకర్ పాత్ర ఎనలేనిది. అందుకే ప్రతి గురు పౌర్ణమి అందరూ దేవాలయాలకు వెళ్తే మాస్టర్ మాత్రం గురువు ఆశీస్సులు తీసుకునేవాడు. 'నా క్రికెట్ కెరీర్‌లో సర్ (అచ్రేకర్) పాత్ర వెలకట్టలేనిది. నేను బాగా ఆడానని గురువు గారు ఎప్పుడూ చెప్పలేదు. కానీ అప్పుడప్పుడు పానీపూరి తినిపించేందుకు తీసుకెళ్లేవారు. బాగా ఆడినందుకు గురువు గారు సంతోషడ్డారని దాని అర్థం' అని సచిన్ ఓ సందర్భంలో అచ్రేకర్ గురించి వెల్లడించాడు. ప్రపంచం మెచ్చిన క్రికెటర్‌గా ఎదిగేందుకు కఠినమైన క్రమశిక్షణతో పాటు కొన్నిసార్లు మందలించేవాడని కూడా గుర్తు చేసుకున్నాడు. 'సర్ ఆధ్వర్యంలో క్రికెట్ స్వర్గంలా అనిపించేది. అందరిలాగే నేను కూడా అక్కడే ఏబీసీడీలు నేర్చుకున్నా. ఆయన మార్గదర్శకత్వంలోనే ఎన్నో కిటుకులు తెలుసుకున్నా. సర్ పవిత్ర ఆత్మకు శాంతి కలుగాలని కోరుకుంటున్నా' అని సచిన్ నివాళి అర్పించాడు. 'ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఇక లేరనే విషయాన్ని మనం జీర్ణించుకోవాలి. అచ్రేకర్ గొప్ప క్రికెటర్లను అందించడమే కాదు.. వారిని గొప్ప మనుషులుగా తీర్చిదిద్దారు. భారత క్రికెట్ ఆయన చేసిన సేవలు మరువలేనివి' అని బీసీసీఐ వెల్లడించింది. క్రికెట్ ప్రపంచం మొత్తం ఆయన మృతికి ఘనమైన నివాళులు అర్పించింది.

కొత్త చరిత్ర కోసం



కోహ్లీ

నేటి నుంచి ఆసీస్‌తో భారత్ నాలుగో టెస్ట్

గెలిచినా, డ్రా చేసుకున్నా టీమ్‌ఇండియా కొత్త చరిత్ర

గాయాల బెడద ఉన్నా ఫేవరెట్‌గానే విరాట్‌సేన

లెక్క సరిచేయాలన్న పట్టుదలతో కంగారూలు

ఉదయం 5 గంటల నుంచి సోనీ సిక్స్‌లో

70 ఏండ్ల చరిత్రలో మునుపెన్నడూ లేని సరికొత్త ఉత్సాహం..
12సార్ల ఆసీస్ పర్యటనలో గతమెన్నడూ చూడని ఘనత..
47 టెస్టుల పరంపరలో ఎప్పుడూ చూడని విజయోత్సాహం..
కంగారూ గడ్డపై కొత్త చరిత్ర కోసం అడుగు దూరంలో నిలిచిన టీమ్‌ఇండియా.. ఎన్నాళ్లుగానో ఊరిస్తూ వస్తున్న 'టెస్ట్ సిరీస్' విజయాన్ని అందుకునేందుకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో గురువారం నుంచి జరిగే నాలుగో టెస్ట్‌లో ఆస్ట్రేలియాతో అమీతుమీ తేల్చుకోనుంది. నాలుగు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇప్పటికే 2-1 ఆధిక్యంలో ఉన్న విరాట్‌సేన.. ఈ మ్యాచ్‌లో గెలిచినా.. డ్రా చేసుకున్నా కంగారూ గడ్డపై కొత్త అధ్యాయానికి శ్రీకారం చుడుతుంది.
పట్టుబట్టిన ప్రతిసారి ఏదో ఓ సమస్యతో వెనక్కి వచ్చిన భారత్‌ను ఈసారి కూడా గాయాల బెడద వెంటాడుతున్నా... పాత చరిత్రకు పాతర వేయాలన్న ఏకైక లక్ష్యంతో బరిలోకి దిగుతున్న విరాట్ వీరులు.. గత విజయాలు ఇచ్చిన ఆత్మవిశ్వాసాన్ని ఆలంబనగా చేసుకొని కొత్త ఏడాదిలో సరికొత్త విజయంతో భారత క్రికెట్‌లో జోష్ నింపేందుకు సిద్ధమవుతున్నారు..!

సిడ్నీ: కంగారూ గడ్డపై అతిపెద్ద మ్యాచ్‌కు భారత్ సిద్ధమైంది. ఎప్పుడో ఓసారి మాత్రమే వచ్చే ఓ అద్భుత అవకాశాన్ని అందిపుచ్చుకునేందుకు ప్రణాళికలు రచిస్తున్నది. ఈ నేపథ్యంలో నేటి నుంచి ఆసీస్‌తో నాలుగో టెస్ట్‌కు సమయం ఆసన్నమైంది. చరిత్ర బాగాలేకపోయినా.. గాయాలు వెంటాడుతున్నా.. ఈ మ్యాచ్‌లో టీమ్ ఇండియానే ఫేవరెట్. నాలుగు మ్యాచ్‌ల సిరీస్‌లో.. అడిలైడ్‌లో గెలిచి, పెర్త్‌లో బోల్తా కొట్టి, మెల్‌బోర్న్ విజయంతో 2-1 ఆధిక్యంలో నిలిచిన విరాట్‌సేన.. కంగారూ గడ్డపై 'టెస్ట్ సిరీస్'ను గెలువాలన్న కాంక్షను నిజం చేసుకునేందుకు తహతహలాడుతున్నది. 1947-48లో మొదలైన ఇండో-ఆసీస్ సమరంలో భారత్ మూడుసార్లు (1980-81, 1985-86, 2003-04) మాత్రమే సిరీస్‌ను డ్రా చేసుకోగా, ఏడుసార్లు (1967-68, 1977-78, 1991-92, 1999-2000, 2007-08, 2011-12, 2014-15) ఓటమిపాలైంది. సిరీస్ ఆధిక్యంతో ఫైనల్ టెస్ట్ ఆడుతున్న భారత కెప్టెన్‌గా ఘనతను దక్కించుకున్న విరాట్.. ఈ మ్యాచ్ కోసం సరికొత్త వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నాడు. ఎలాగైనా ఈ మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌ను సాధించిన తొలి సారథిగా రికార్డు సృష్టించాలని భావిస్తున్నాడు. దీనికితోడు బాల్ టాంపరింగ్ కారణంగా ఆసీస్ స్టార్ ఆటగాళ్లు ఈ సిరీస్‌కు అందుబాటులో లేకపోవడం కూడా కలిసిసొస్తున్నది.

1
విదేశాల్లో అత్యధిక టెస్ట్‌లు గెలిచిన గంగూలీ (11) రికార్డును అధిగమించేందుకు కోహ్లీ (11)కి మరో విజయం అవసరం.

3
2018లో ఆసీస్ కేవలం మూడు శతకాలు మాత్రమే చేసింది. 1996 తర్వాత ఇదే అత్యల్పం. ఇందులో రెండు వేరే వేదికల్లో చేయగా, మిగతా ఒకటి సిడ్నీలోనే రావడం గమనార్హం. ఖవాజ, షాన్ మార్ష్, మిచెల్ మార్ష్ ఈ సెంచరీలు సాధించారు.

6
కంగారూ గడ్డపై ఒక టెస్ట్ సిరీస్‌లో అత్యధిక వికెట్లు తీసిన కపిల్ దేవ్ రికార్డును అధిగమించేందుకు బుమ్రాకు కావాల్సిన వికెట్ల సంఖ్య. 1991-92లో జరిగిన ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో కపిల్ 25 వికెట్లు పడగొట్టాడు. ఇప్పటివరకు ఆడిన మూడు మ్యాచ్‌ల్లో బుమ్రా 20 వికెట్లు తీశాడు.

స్టార్క్ కోసమే !

ఎంత ఎదిగినా.. ఒదిగి ఉండడమే కోహ్లీకి ఇష్టం. అంతర్జాతీయ క్రికెట్‌లో పరుగుల వరద పారిస్తున్నా.. కొత్త రికార్డులు నమోదు చేస్తున్నా ఆట పట్ల తనకు అంతే అంకితభావం. ఆసీస్‌తో జరుగుతున్న నాలుగుటెస్ట్‌ల సిరీస్‌లో 2-1తో ఆధిక్యంలో ఉన్నా..చివరి టెస్ట్‌లో విజయమే లక్ష్యంగా నెట్స్‌లో తీవ్రంగా శ్రమిస్తున్నాడు. బుధవారం భారత బృందం నెట్ ప్రాక్టీస్‌లో పాకిస్థాన్ యువ పేసర్లు కనిపించడం ఆసక్తికరంగా మారింది. ఈ సిరీస్‌లో భారత టాపార్డర్‌ను ఆసీస్ పేసర్ మిచెల్ స్టార్క్ తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నాడు. అతని బౌలింగ్ అద్భుతమైన నియంత్రణతో సాగుతున్నది. కొలతవేసినట్లుగా బంతులను వేస్తూ కోహ్లీని తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నాడు. మూడోటెస్ట్‌లోనూ కోహ్లీ అతని బౌలింగ్‌లోనే ఔట్ కావడం తెలిసిందే. తొలిసారి ఆసీస్ గడ్డపై టెస్ట్ సిరీస్ విజయం సాధించాలని కోరుకుంటున్న కోహ్లీ సేన అందుకోసం నెట్స్‌లో తీవ్రంగా సాధన చేసింది.కచ్చితత్వంతో కూడిన అతని యార్కర్లను, బౌన్సర్లను కాచుకునేందుకు కోహ్లీ.. పాక్ యువ పేసర్లు సల్మాన్ అర్షద్, హరీశ్ రవూఫ్ బౌలింగ్‌లో ప్రాక్టీస్ కొనసాగించాడు. త్వరలోనే పాకిస్థాన్ సూపర్ లీగ్(పీఎస్‌ఎల్) బరిలోకి దిగే ఈ యువ పేసర్లు ప్రస్తుతం ఆస్ట్రేలియాలో క్లబ్ క్రికెట్ ఆడుతున్నారు. సల్మాన్ అర్షద్ గంటకు 150 కిలోమీటర్లకు పైగా వేగంతో బౌలింగ్ చేస్తుండగా.. హరీశ్ అద్భుతమైన యార్కర్లు వేయడంతో దిట్ట. అందుకే స్టార్క్ బౌలింగ్‌ను ఎదుర్కొనేందుకు పాకిస్థాన్ పేసర్ల సాయం తీసుకున్నారు. పీఎస్‌ఎల్‌లో లాహోర్ జట్టు తరఫున బరిలోకి దిగనున్న అర్షద్, రవూఫ్ ..భారత సారథి కోహ్లీని కలుసుకున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు.

పిచ్, వాతావరణం

పెర్త్, మెల్‌బోర్న్‌తో పోలిస్తే భిన్నంగా కనిపిస్తున్నది. బంతికి, బ్యాట్‌కు మధ్య సమతుల్యం ఉంటుందని క్యురేటర్ అంచనా. తొలి రెండు రోజులు బ్యాటింగ్‌కు, తర్వాతి రోజుల్లో స్పిన్నర్లకు అనుకూలం. నాలుగు, ఐదో రోజు చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

చరిత్రలో నిలువడం ముఖ్యం కాదు: విరాట్

సిడ్నీ: కంగారూ గడ్డపై టెస్ట్ సిరీస్ గెలిచి చరిత్రలో నిలిచిపోవడం తనకు ముఖ్యం కాదని టీమ్‌ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ స్పష్టం చేశాడు. సిడ్నీలో మ్యాచ్ గెలువడం అన్నిటింకటే ముఖ్యమైందన్నాడు. ఆసీస్‌లో సిరీస్ గెలిస్తే అది అద్భుతమేనని వెల్లడించాడు. అప్పట్లో ధోనీ ఇదే వేదికపై అనూహ్యంగా టెస్ట్‌లకు వీడ్కోలు పలికినప్పుడు కోహ్లీ సారథ్య బాధ్యతలు తీసుకున్నాడు. అప్పుడు ఏడో ర్యాంక్‌లో ఉన్న జట్టు ప్రస్తుతం నంబర్‌వన్ స్థాయికి చేరింది.

నాకూ ఫిట్‌నెస్ సమస్యలున్నాయి...

క్రికెట్‌లో ఫిట్‌నెస్ సమస్యలు చాలా సహజమని కోహ్లీ స్పష్టం చేశాడు. తాను కూడా ఈ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నానని చెప్పాడు. మూడో టెస్ట్ మధ్యలో వెన్నునొప్పికి గురైన విరాట్ ఫిజియోతో చికిత్స చేయించుకున్న సంగతి తెలిసిందే. '2011 నుంచే నాకు ఫిట్‌నెస్ సమస్యలు ఉన్నాయి. ఇప్పుడేం కొత్తగా రాలేదు. వాటిని జాగ్రత్తగా అంచనా వేసుకుంటూ శరీరాన్ని కాపాడుకుంటున్నా. పని ఒత్తిడి పెరిగితే ఫిట్‌నెస్‌పై ప్రభావం పడుతుంది. పరిస్థితిని బట్టి రెండు మూడు రోజుల్లో కుదురుకోవచ్చు. నేను ఫిట్‌నెస్‌పై ఎక్కువగా ఆందోళన చెందను. పరిష్కారం కోసం ప్రయత్నిస్తా. ఫిట్‌నెస్ బాగుంటే గాయాలు కాకుండా ఉంటాయి. ఆరోగ్య సమస్యలు వచ్చినంత మాత్రాన కుంగిపోకూడదు' అని విరాట్ వ్యాఖ్యానించాడు.



అశ్విన్, ఇషాంత్ ఔట్

ఈ మ్యాచ్ కోసం టీమ్‌ఇండియా 13 మందితో కూడిన జట్టును ప్రకటించింది. సిడ్నీ పిచ్ సంప్రదాయంగా స్పిన్‌కు అనుకూలం. దీనిని దృష్టిలో పెట్టుకుని ఇద్దరు స్పిన్నర్లు తీసుకోవాలని భావించినా అశ్విన్ పూర్తి ఫిట్‌నెస్ సాధించలేదు. మ్యాచ్‌కు ముందు అతన్ని మరోసారి పరిశీలించి తుది నిర్ణయం తీసుకోనున్నారు. అయితే ముందు జాగ్రత్త చర్యగా అశ్విన్‌కు ప్రత్యామ్నాయంగా కుల్దీప్‌ను 13 మందిలోకి తీసుకున్నారు. కచ్చితంగా ఇద్దరు స్పిన్నర్లతో ఆడాలని విరాట్ భావిస్తే.. జడేజాకు తోడుగా కుల్దీప్, అశ్విన్‌లలో ఒకరికి అవకాశం దక్కుతుంది. ఓవరాల్‌గా అశ్విన్ ఫిట్‌నెస్‌పైనే భారత బౌలింగ్ వ్యూహం ఆధారపడి ఉంది. ముగ్గురు పేసర్లు-ఒక్క స్పిన్నర్, లేదా ఇద్దరు పేసర్లు-ఇద్దరు స్పిన్నర్ల వ్యూహానికి కట్టుబడితే ఆల్‌రౌండర్‌తో అవసరం ఉండదు. అప్పుడు హార్దిక్ పాండ్యా బెంచ్‌కే పరిమితంకానున్నాడు. అశ్విన్, కుల్దీప్ ఇద్దరూ లేకపోతే విహారి రెండో స్పిన్నర్‌గా బాధ్యతలు పంచుకోనున్నాడు. పక్కటెముకల గాయంతో ఇషాంత్ ఈ మ్యాచ్‌కు దూరంగా కాగా, అతని స్థానంలో ఉమేశ్ యాదవ్ వచ్చాడు. రోహిత్ లేకపోవడంతో పామ్‌లో లేని రాహుల్‌కు మరో అవకాశం ఇచ్చారు. రాహుల్ రాకతో విహారి మళ్లీ ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు దిగనున్నాడు. పుజార, కోహ్లీ, రహానే యధా స్థానాల్లో ఆడనున్నారు.

ఒత్తిడిలో ఆసీస్..

మరోవైపు ప్రతి మ్యాచ్‌కు ముందు రోజే తమ తుది 11 మందిని ప్రకటించే ఆసీస్ ఈ సిరీస్‌లో తొలిసారి వరుస తప్పింది. సిరీస్ గెలువకున్నా.. కనీసం డ్రా చేసుకోవాలనుకున్నా ఈ మ్యాచ్‌లో కంగారూలు గెలిచి తీరాలి. కాబట్టి తుది జట్టు ఎంపికకు చాలా కసరత్తులు చేస్తున్నది. టాస్ సందర్భంగానే తమ జట్టును ప్రకటిస్తామని కెప్టెన్ పైన్ చెప్పడమే ఇందుకు నిదర్శనం. మెల్‌బోర్న్‌లో కుప్పకూలిన ఆసీస్‌పై తీవ్ర ఒత్తిడి నెలకొంది. ఇన్నాళ్లూ స్వదేశంలో ఆధిపత్యం చూపెట్టిన ఆసీస్ ఈ సిరీస్‌ను నిలబెట్టుకోవాలంటే శక్తికి మించి కష్టపడాలి. ఈ మ్యాచ్‌లో గెలువాలంటే స్పిన్ పటిష్ఠంగా ఉండాలన్న నేపథ్యంలో ఆసీస్ మార్నస్ లబ్స్‌చాంగ్నిని తీసుకొచ్చింది. వరుసగా విఫలమవుతున్న ఓపెనర్ ఆరోన్ ఫించ్‌ను లైనప్‌లో కిందకు తీసుకురావడమా? మొత్తానికి ఉద్వాసన పలకడమా? అనే దానిపై ఆసీస్ ఏటూ తేల్చుకోలేకపోతున్నది. మిచెల్ మార్ష్‌ను తీసేసి ఓపెనింగ్ కోసం పీటర్ హ్యాండ్స్‌కోంబ్‌ను పిలిపించారు. ఈ మ్యాచ్‌లో కమిన్స్, స్టార్క్ మరోసారి కీలకం కానున్నారు. హాజిల్‌వుడ్ కూడా సహకారం అందిస్తే భారత్‌కు కాస్త ఇబ్బందులు తప్పవు. స్పిన్నర్ నాథన్ లియోన్ మ్యాజిక్ కోసం ఎదురుచూస్తున్నారు. హారిస్, ఖవాజ గాడిలో పడాల్సిన అవసరం చాలా ఉంది. ఓవరాల్‌గా లెక్క సరిచేయాలన్న పట్టుదలతో ఉన్న పైన్ బృందం నుంచి విరాట్‌సేనకు ఎన్ని కష్టాలు వస్తాయో చూద్దాం.

జట్ల అంచనా

భారత్: కోహ్లీ (కెప్టెన్), మయాంక్, రాహుల్, పుజార, రహానే, విహారి, రిషబ్, జడేజా, షమీ, ఉమేశ్, బుమ్రా.
ఆస్ట్రేలియా: పైన్ (కెప్టెన్), హారిస్, ఖవాజ, షాన్ మార్ష్, హ్యాండ్స్‌కోంబ్ / ఫించ్, హెడ్, లబ్స్‌చాంగ్ని, కమిన్స్, స్టార్క్, లియోన్, హాజిల్‌వుడ్.

హే.. నువ్వు స్లెడ్జింగ్ చేశావు కదా!



సిడ్నీ: భారత యువ వికెట్ కీపర్ రిషబ్ పంత్‌కు ఊహించని షాక్.. ఆస్ట్రేలియా పర్యటనలో వికెట్‌కీపింగ్‌లో రికార్డులతోపాటు బ్యాటింగ్‌లోనూ అలరిస్తున్న పంత్.. మాటల యుద్ధంలోనూ మెనగాడినపించుకుంటున్నాడు. సోమవారం సిడ్నీలో ఆస్ట్రేలియా ప్రధాని స్కాట్ మోరిస్ అధికారిక నివాసంలో భారత్, ఆస్ట్రేలియా జట్లకు విందు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా భారత జట్టు మేనేజర్ సుబ్రమణ్యం భారత ఆటగాళ్లను ఆయనకు పరిచయం చేస్తుండగా అనూహ్య సంఘటన జరిగింది.ఇతను రిషబ్ పంత్ అని చెబుతుండగానే 'ఓహ్.. నీవు స్లెడ్జింగ్ చేశావు కదా' అని మారిసన్ ప్రశ్నించారు. అంతేకాదు..పోటాపోటీగా ఆడే నీలాంటి ఆటగాళ్లంటే ఎంతో ఇష్టం అని ఆయన అన్నారు. దీంతో రిషబ్ మర్యాదపూర్వకంగా చిరునవ్వు చిందించాడు. మెల్‌బోర్న్‌లో ముగిసిన మూడో టెస్ట్‌లో ఆసీస్ కెప్టెన్ టిమ్ పైన్, రిషబ్ పంత్ పరస్పరం స్లెడ్జింగ్ చేసుకున్న విషయం తెలిసిందే. స్వయానా ప్రధాని కూడా పంత్‌ను గుర్తు పెట్టుకున్నాడంటే బాక్సింగ్ డే టెస్ట్ స్లెడ్జింగ్ ఎపిసోడ్ ఎంతగా పాపులరైందో తెలుస్తుంది.

గురుకులాల ఇంటర్ సొసైటీ

స్పోర్ట్స్‌లీగ్ ప్రారంభం

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలి
రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యసలహాదారు రాజీవ్ శర్మ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర గురుకుల విద్యాలయాల 4వ ఇంటర్ సొసైటీ స్పోర్ట్స్ లీగ్ ను బుధవారం హైదరాబాద్, గచ్చిబౌలి క్రీడామైదానంలో జ్యోతి వెలిగించి రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పాఠశాలల ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీవర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి ప్రోత్సహిస్తున్నదన్నారు. విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును ఉపయోగించుకొని ఉన్నత లక్ష్యాలు సాధించాలని సూచించారు. మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ గురుకుల విద్యాలయాల సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ స్పోర్ట్స్ లీగ్‌లో రాష్ట్రంలోని అన్ని సంక్షేమ గురుకులాలు, రెసిడెన్షియల్ స్కూళ్లు ఉమ్మడిగా పాల్గొన్నాయి. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు, క్రీడా విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, ఎస్సీ, గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, మైనార్టీ గురుకులాల కార్యదర్శి షఫియుల్లా, బీసీ గురుకులాల సొసైటీ కార్యదర్శి మల్లయ్య బట్టు తదితరులు పాల్గొన్నారు.







అఫ్రిది నన్ను జట్టులోకి రాకుండా చేశాడు



సల్మాన్ భట్

కరాచి: స్పాట్ ఫిక్సింగ్ కేసులో నిషేధ కాలం పూర్తి చేసుకున్నా 2016 టీ20 ప్రపంచకప్ జట్టులోకి తనను ఎంపిక చేయకుండా అప్పటి పాకిస్థాన్ కెప్టెన్ షాహిద్ అఫ్రిది అడ్డుకున్నాడని పాకిస్థాన్ మాజీ కెప్టెన్ సల్మాన్ భట్ ఆరోపించాడు. 2010లో ఇంగ్లండ్‌తో టెస్ట్ సిరీస్ ఆడుతున్న సందర్భంగా అప్పటి జట్టు కెప్టెన్ సల్మాన్ భట్, పేసర్లు మహ్మద్ ఆసిఫ్, మహ్మద్ ఆమెర్ స్పాట్ ఫిక్సింగ్‌కు పాల్పడి దోషులుగా తేలిన సంగతి తెలిసిందే. ఐదేండ్ల నిషేధం పూర్తైన తర్వాత దేశవాళీ క్రికెట్‌లో మళ్లీ ఆడుతున్న సమయంలో 2016 టీ20 ప్రపంచకప్ ఆడే జట్టులో దాదాపు చోటు ఖాయం చేసుకున్నా..అఫ్రిది అడ్డుపడడంతో తనకు చోటు దక్కలేదన్నాడు. 'జాతీయ క్రికెట్ అకాడమీకి రమ్మంటూ అప్పటి జట్టు చీఫ్ కోచ్ వకార్ యూనిస్, బ్యాటింగ్ కోచ్ గ్రాండ్ ఫ్లవర్ నన్ను పిలిచారు. నెట్స్‌లో నాతో బ్యాటింగ్ ప్రాక్టీస్ చేయించి నా ఫిట్‌నెస్‌తో పాటు నా ఆటతీరును గమనించారు. జాతీయ జట్టులోకి రావడానికి మానసికంగా సిద్ధంగా ఉన్నావా అని వకార్ భాయ్ అడిగాడు. నేను సిద్ధమే అని చెప్పా' అని మంగళవారం రాత్రి మీడియాతో మాట్లాడుతూ సల్మాన్ వివరించాడు. ప్రపంచకప్ ఆడుతావని వకార్, ఫ్లవర్ చెప్పినా ..అఫ్రిది ఎందుకు అడ్డుకున్నాడో నాకు తెలియదని, ఈ విషయం అతనితో ఎప్పుడూ మాట్లాడలేదన్నాడు.

సెన్సెక్స్	నిఫ్టీ
35,891	10,792
↘363	↘118

ముడి చమురు (బ్రెంట్) ↗ 55.72 డాలర్లు

బంగారం ధరలు

న్యూఢిల్లీ(రూ.లలో)	
24 క్యారెట్లు	32,500
22 క్యారెట్లు	32,350
వెండి (కిలో)	39,350

విదేశీ మారకం

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలర్	66.80	72.30
యూరో	76.40	84.40
బహ్రెయిన్ దినార్	177.70	189.70
కువైట్ దినార్	220.40	233.40
సౌదీ రియాల్	17.60	19.40
యూఏఈ దిర్హామ్	17.70	19.30

చికెన్ ధరలు (రూ.లలో)

ఫారం ధర	92.00
రిటైల్ లైవ్	114.00
డ్రెస్డ్	165.00
స్కిన్‌లెస్	188.00

నెక్ (వంద గుడ్లకు) (రూ.లలో)

హైదరాబాద్	439-00
రంగారెడ్డి	439-00
మెదక్	439-00
కరీంనగర్	441-00
వరంగల్	441-00
రిటైల్ ప్రైస్	5-00

ఒక్కటిగా మూడు బ్యాంకులు
కేంద్రం పచ్చజెండా

బీవోబీలో దేనా, విజయా బ్యాంకుల విలీనం



న్యూఢిల్లీ, జనవరి 2: మూడు ప్రభుత్వరంగ బ్యాంకుల విలీనానికి కేంద్ర క్యాబినెట్ పచ్చజెండా ఊపింది. బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ)లో దేనా, విజయా బ్యాంకుల విలీన ప్రతిపాదనకు ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం సమావేశమై ఆమోదం తెలిపింది. విలీనం తర్వాత బీవోబీ దేశంలో మూడో అతిపెద్ద బ్యాంకుగా అవతరించనున్నది. తొలి స్థానంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉండగా, రెండో స్థానంలో ఐసీఐసీఐ బ్యాంక్ ఉన్నది. బ్యాంకుల విలీనంతో ఉద్యోగుల సర్వీసుకు ఎలాంటి భంగం వాటిల్లదని, అలాగే సిబ్బందిని తొలగించే అవకాశాలు లేవని కేంద్ర న్యాయ శాఖ మంత్రి రవి శంకర్ ప్రసాద్ తెలిపారు. క్యాబినెట్ సమావేశ అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..అంతర్జాతీయ స్థాయిలో బ్యాంక్ ఆర్థికంగా బలోపేతం అయ్యే అవకాశాలున్నాయని చెప్పారు. దీంతో దేనా, విజయా బ్యాంకులకు చెందిన ఉద్యోగులు బీవోబీ కిందికి రానున్నారు. ఈ మూడు బ్యాంకుల విలీనానికి సెప్టెంబర్‌లోనే అంకురార్పణ జరిగింది. మొండి బకాయిలతో సతమతమవుతున్న బ్యాంకులను ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశంతో పెద్ద బ్యాంకుల్లో చిన్నస్థాయి బ్యాంకులను విలీనం చేయాలని కేంద్రం సంకల్పించింది. ఇప్పటికే ఎస్‌బీఐలో ఐదు అనుబంధ బ్యాంకులతోపాటు భారతీయ మహిళా బ్యాంకు కూడా విలీనమైన విషయం తెలిసిందే. దీంతో ప్రపంచంలో టాప్-50 బ్యాంకుల్లో ఎస్‌బీఐ చేరింది. ఈ విలీనాన్ని వ్యతిరేకిస్తు బ్యాంక్ ఉద్యోగులు సమ్మె చేసి వారం రోజులు కూడా కాకముందే కేంద్రం ఆమోదం తెలుపడం విశేషం. మరోవైపు విజయా, దేనా బ్యాంకుల షేర్ల కేటాయింపులపై బీవోబీ తుది రూపునిచ్చింది. బీవోబీకి చెందిన వెయ్యి షేర్లకుగాను విజయా బ్యాంకు 402 ఈక్విటీ షేర్లు, అదే దేనా బ్యాంకు 110 షేర్లు లభించనున్నాయి. బీవోబీ షేరు ధర 3.16 శాతం క్షీణించి రూ.119.40కి, విజయా బ్యాంక్ షేరు నిలకడగా రూ.51.05 వద్ద, దేనా బ్యాంక్ షేరు కూడా రూ.17.95 వద్ద ముగిసింది.

ఎగుమతిదారులకు 3 శాతం వడ్డీ రాయితీ



వాణిజ్య ఎగుమతిదారులను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకున్నది. ఇప్పటికే పలు రాయితీలు ఇస్తున్న కేంద్రం తాజాగా మూడు శాతం వడ్డీ రాయితీని ఇవ్వనున్నట్లు బుధవారం ప్రకటించింది. ఈ నిర్ణయంతో రూ.600 కోట్ల మేర లబ్ధిపొందనున్నారు. నిధులు లేక సతమతమవుతున్న వాణిజ్య ఎగుమతిదారులకు ఈ నిర్ణయం మరింత బూస్టినివ్వనున్నది. ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ బుధవారం సమావేశమై ఈ నిర్ణయం తీసుకున్నది. వాణిజ్య మంత్రిత్వ శాఖ ప్రతిపాదనకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపిందని, వడ్డీ సమానత్వ పథకం కింద రూపాయల్లో ఎగుమతి చేసినవారిని గుర్తించి వారికి ఈ మూడు శాతం వడ్డీ రాయితీని కల్పించనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపింది కేంద్రం. ఇందుకోసం 416 వస్తువులను గుర్తించింది. వీటిని ఎగుమతి చేసిన వారికి మాత్రమే వడ్డీ రాయితీ లభించనున్నది. వీటిలో అత్యధికంగా ఎంఎస్ఎంఈ/క్యాపిటల్-ఇంటెన్సివ్ యూనిట్లు పొందే రంగాలైన వ్యవసాయం, టెక్స్‌టైల్స్, చర్మ, హస్తకళలు, యంత్రాలకు చెందినవి ఉన్నాయి. ఎగుమతిదారుల్లో పోటీతత్వాన్ని పెంచడానికి, ఎంఎస్ఎంఈలు తయారు చేస్తున్న వస్తువులకు విదేశాల్లో మార్కెట్‌ను సృష్టించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తున్నది. ఏప్రిల్ 2015 లోనే కేంద్రం ఈ వడ్డీ రాయితీ స్కీంను ప్రవేశపెట్టింది. జూన్ 23, 2017న రూ.39 వేల కోట్లు ఉన్న ఎగుమతిదారుల చెల్లింపులు జూన్ 22, 2018 నాటికి రూ.22,300 కోట్లకు తగ్గాయి. ఎగుమతిదారులకు ఈ నిర్ణయం ఊతమివ్వనున్నదని ఎఫ్ఐఈవో ప్రెసిడెంట్ గణేశ్ కుమార్ గుప్తా తెలిపారు. తక్కువ వడ్డీకే రుణాలు లభించనుండటం మంచి పరిణామమని చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-నవంబర్ మధ్యకాలంలో ఎగుమతులు 11.58 శాతం పెరిగి 217.5 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి.

సింఘానియా x సింఘానియా

- **రేమాండ్ గ్రూప్‌పై తండ్రీకొడుకుల ఆధిపత్య పోరు**



న్యూఢిల్లీ, జనవరి 2: భారతీయ టెక్స్‌టైల్ దిగ్గజం రేమాండ్ గ్రూప్‌లో కుటుంబ విభేదాలు భగ్గుమన్నాయి. గ్రూప్ వ్యవస్థాపకుడు విజయ్‌పథ్ సింఘానియా, ఆయన కుమారుడు గౌతమ్ సింఘానియా మధ్య ఆధిపత్య పోరు రాజుకున్నది. మూడేండ్ల క్రితం గౌతమ్‌కు రేమాండ్ పగ్గాలను అప్పగించిన విజయ్‌పథ్.. ఆ తర్వాత తనను గౌతమ్ సరిగ్గా చూసుకోవడం లేదని, కుటుంబానికి చెందిన అపార్టుమెంట్ నుంచి గెంటేశాడని, కంపెనీ కార్యాలయాల నుంచీ బయటకు పంపాడని ప్రస్తుతం ఆరోపిస్తున్నారు. 80 ఏండ్ల విజయ్‌పథ్.. ఓ చిన్న వస్త్ర వ్యాపారాన్ని దేశంలోనే గొప్ప సంస్థగా మార్చిన విషయం తెలిసిందే. 2015లో తనకున్న 37 శాతం వాటాను గౌతమ్‌కు ఇచ్చేశారు. దీంతో విజయ్‌పథ్ కష్టాలు మొదలవగా, అప్పుడు చేసిన పనికి ఇప్పుడు పశ్చాత్తాపం చెందుతున్నారు. అయితే రెండేండ్లుగా కొడుకుతో మాట్లాడని విజయ్‌పథ్.. ఇటీవలి కోర్టు తీర్పుతో తన వ్యాపార సామ్రాజ్యాన్ని మళ్లీ తన చేతుల్లోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. 2007లో చేసిన ఓ చట్టం కింద తల్లిదండ్రుల కనీస అవసరాలనూ పిల్లలు తీర్చకపోతే వారికిచ్చిన ఆస్తులను తిరిగి తీసుకోవచ్చు. దీంతో విజయ్‌పథ్ ఆ దిశగా అడుగులు వేస్తుండగా, మరోవైపు రేమాండ్ గ్రూప్ చైర్మన్‌గా, ఓ కొడుకుగా తన బాధ్యతలు వేర్వేరుగా ఉంటాయంటున్న గౌతమ్ తానే తప్పు చేయలేదని పేర్కొంటున్నారు. 55కుపైగా దేశాలకు ఎగుమతులు చేస్తున్న రేమాండ్ గ్రూప్.. ఈమధ్యనే ఇథియోపియాలోనూ ఓ భారీ కర్మాగారాన్ని ప్రారంభించింది. 2018 ద్వితీయ త్రైమాసికంలో సంస్థ లాభాలు 50 శాతం పెరిగాయి.

కార్పొరేట్లలో కుటుంబ విభేదాలెన్నో

దేశీయ కార్పొరేట్ రంగంలో చోటుచేసుకుంటున్న కుటుంబ విభేదాలపై పరిశ్రమ వర్గాలు, నిపుణులు ఒకింత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముకేశ్ అంబానీ, అనిల్ అంబానీ మధ్య కూడా గతంలో తగాదాలు ఏర్పడిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఔషధ రంగానికి చెందిన అన్నదమ్ములు మల్వీందర్ సింగ్, శివీందర్ సింగ్ మధ్య కూడా గొడవలు జరుగుతున్న సంగతీ విదితమే. ఇక 2012లో తమ కంపెనీపై పోరులో భాగంగా లిక్కర్, ప్రాపర్టీ వ్యాపారులు పోంటీ చద్దా, హర్దీప్ చద్దాలు ఒకరినొకరు కాల్చుకుని చనిపోయారు. ఈ క్రమంలో ఇప్పుడు రేమాండ్ గ్రూప్ వ్యవహారం ప్రాధాన్యతను సంతరించుకోగా, కుటుంబ వ్యాపారాల పంపకాలు, వాటి నిర్వహణ అంశాల్లో అంతర్జాతీయ ప్రమాణాలు పాటించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు.

సచిన్ బన్సల్ అడ్వాన్స్ ట్యాక్స్
రూ.699 కోట్లు!



న్యూఢిల్లీ, జనవరి 2: దేశీయ ఈ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ వ్యవస్థాపకుల్లో ఒకరైన సచిన్ బన్సల్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2018-19) తొలి త్రైమాసికానికి (ఏప్రిల్-జూన్)గాను అడ్వాన్స్ ట్యాక్స్‌గా రూ.699 కోట్లను డిపాజిట్ చేశారు. ఫ్లిప్‌కార్ట్‌లోని తన వాటాను అమెరికా రిటైల్ దిగ్గజం వాల్‌మార్ట్ కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో వచ్చిన ఆదాయంపై మూలధన లాభాల పన్నునూ సచిన్ బన్సల్ చెల్లించారు. అయితే సచిన్ బన్సల్‌తోపాటు ఫ్లిప్‌కార్ట్‌లోని వాటాను అమ్మేసిన బిన్నీ బన్సల్ మాత్రం ఇంకా తన ఆదాయ వివరాలను, పన్ను చెల్లింపులను జరుపలేదని ఆదాయం పన్ను (ఐటీ) శాఖకు చెందిన వర్గాలు తెలియజేశాయి. ఫ్లిప్‌కార్ట్‌లోని 77 శాతం వాటాను దాదాపు 16 బిలియన్ డాలర్లతో వాల్‌మార్ట్ కొనుగోలు చేసిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో వాల్‌మార్ట్ సైతం గతేడాదే ఐటీ శాఖకు విత్‌హోల్డింగ్ ట్యాక్స్‌గా రూ.7,440 కోట్లను చెల్లించింది.

మళ్లీ బేర్స్ విజృంభణ




ప్రపంచ మార్కెట్ల పతనం, చైనా ఆర్థిక వ్యవస్థ మందగిస్తున్నదన్న వార్తలు, మెటల్, ఆటో షేర్లలో భారీ అమ్మకాల ఒత్తిడి మార్కెట్ పతాన్ని బుధవారం శాసించాయి. చైనా ఆర్థిక వ్యవస్థ గణాంకాలు నిరాశజనకంగా ఉండడంతో ఆసియా మార్కెట్లన్నీ నష్టాల్లో ట్రేడ్ అయ్యాయి. దీనికి తోడు యూరోపియన్ మార్కెట్లు, అమెరికన్ మార్కెట్ ఫ్యూచర్స్ కూడా నష్టాల్లోనే ట్రేడ్ అవుతుండడంతో దేశీయ స్టాక్‌మార్కెట్లు నష్టాలతో ముగిశాయి. ఆటో అమ్మకాలు గత మూడు నెలలుగా మందగిస్తూండటంతో ఆటో రంగ షేర్లన్నీ నష్టాలకు గురయ్యాయి. అలాగే మెటల్ షేర్లలోనూ భారీ నష్టాలు నమోదు కావడంతో సెన్సెక్స్ ఒకదశలో 500 పాయింట్లకు పైగా నష్టపోయింది. చివరికి స్వల్పంగా కోలుకుని నికరంగా 363.05 పాయింట్ల నష్టంతో 35,891.52 వద్ద ముగియగా, నిఫ్టీ 117.6 పాయింట్ల నష్టంతో 10,792.50 వద్ద ముగిసింది. అన్నిరంగాల సూచీలు నష్టాల్లోనే ముగిశాయి. దీనికి తోడు రూపాయి మారకం విలువ మధ్యాహ్నం తర్వాత ఒక్కసారిగా రూ. 70.06 చేరుకోవడంతో కూడా సెంటిమెంట్ ఒక్క సారిగా బలహీన పడింది. వర్ధమాన దేశాల కరెన్సీలలో రూపాయ మారకం విలువనే అత్యధికంగా పతనం అయింది. దేశీయంగా జీఎస్టీ వసూళ్లు వరుసగా రెండో నెలలో కూడా తగ్గిపోవడంతో బడ్జెట్‌లో లక్ష్యాలుగా నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోలేమన్న భయాలు కూడా మార్కెట్లో నెలకొన్నాయి. దీంతో సంస్థాగత ఇన్వెస్టర్ల అమ్మకాలకు మొగ్గుచూపారు. మెటల్ ఇండెక్స్ గరిష్ఠంగా 3.41 శాతం నష్టపోగా, ఆటో ఇండెక్స్ 3.05 శాతం నష్టపోయింది. రియల్టీ 1.43 శాతం, మీడియా 1.31 శాతం, బ్యాంక్ నిఫ్టీ 0.79 శాతం, ఎఫ్ఎంసీజీ 0.67 శాతం, ఫార్మా 0.47 శాతం చొప్పున నష్టపోయాయి. మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.21 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 1.02 శాతం నష్టపోయాయి. ఇన్‌ఫ్రా, సీపీఎస్ఈ, ఎనర్జీ, కమొడిటీస్, కన్స్యూమర్ రంగాల ఇండెక్స్ కూడా సగటున ఒకటిన్నర శాతం మేర పెరిగాయి. కాగా, ఎన్ఎస్ఈలో కేవలం 1,211 షేర్లు నష్టపోగా, 541 షేర్లు మాత్రమే లాభపడ్డాయి. నిఫ్టీలోని 50 షేర్లలో కేవలం 9 షేర్లే లాభాలతో ముగిశాయి. సన్‌ఫార్మా 1.48 శాతం, ఇన్‌ఫ్రాటెల్ 1.12 శాతం, టీసీఎస్ 0.85 శాతం, ఏషియన్ పెయింట్స్ 0.62 శాతం చొప్పున లాభపడ్డాయి. అయితే ఐషర్ మోటార్స్ 9.40 శాతం, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ 5.44 శాతం, టాటాస్టీల్ 4.51 శాతం, వేదాంత 4.4 శాతం, ఎం అండ్ ఎం 4.24 శాతం చొప్పున నష్టపోయాయి. ఎఫ్ఐఐలు రూ. 621.06 కోట్లు, డీఐఐలు రూ. 226.18 కోట్ల అమ్మకాలను జరిపారు. దాదాపు 30 షేర్లు కొత్త 52 వారాల కనీస స్థాయిని నమోదు చేశాయి.

శక్తి 'కాంతి' వరుస భేటీలు

ఎన్‌బీఎఫ్‌సీ, ఎంఎస్ఎంఈలతో వచ్చే వారం సమావేశం • ఇప్పటికే బ్యాంకర్లను కలిసిన ఆర్బీఐ గవర్నర్

ముంబై, జనవరి 2: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్.. వచ్చే వారం సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల (ఎంఎస్ఎంఈ) ప్రతినిధులతో సమావేశం కానున్నారు. బ్యాంకింగేతర ఆర్థిక సంస్థల (ఎన్‌బీఎఫ్‌సీ)తోనూ భేటీ కానున్నట్లు బుధవారం ట్విట్టర్ ద్వారా ఆయన తెలిపారు. ఆర్బీఐ గవర్నర్‌గా ఊర్జిత్ పటేల్ అనూహ్య రాజీనామాతో గత నెల సెంట్రల్ బ్యాంక్ పగ్గాలు చేపట్టిన దాస్.. ఇప్పటికే బ్యాంకర్లతో సమావేశమైన విషయం తెలిసిందే. ప్రభుత్వ రంగ బ్యాంకర్లను రెండుసార్లు, ప్రైవేట్ రంగ బ్యాంకర్లను ఒకసారి కలిశారు. ఇప్పుడు ఎన్‌బీఎఫ్‌సీ, ఎంఎస్ఎంఈ పరిశ్రమలతోనూ సమావేశం అవుతుండగా, వ్యవస్థలో ద్రవ్యకొరత, రుణ లభ్యత క్షీణించిన వేళ ఈ వరుస సమావేశాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కాగా, ఎంఎస్ఎంఈలకు రూ.25 కోట్ల వరకున్న రుణాలను ఒకసారి పునర్‌వ్యవస్థీకరించుకోవడానికి ఆర్బీఐ మంగళవారం అవకాశం కల్పించిన విషయం తెలిసిందే. ఇదిలావుంటే బ్యాంకింగ్ రంగంలో రుణాల వృద్ధి బలంగానే ఉందని, డిసెంబర్ 21తో ముగిసిన 15 రోజుల్లో 15.11 శాతం పెరుగుదల కనిపించిందని ఆర్బీఐ తాజా గణాంకాల్లో తేలింది. 2017 డిసెంబర్ 21తో ముగిసిన పక్షం రోజుల్లో రూ.80.68 లక్షల కోట్లుగా ఉన్న బ్యాంక్ క్రెడిట్.. 2018 ఇదే వ్యవధిలో రూ.92.87 లక్షల కోట్లకు చేరిందని వివరించింది.



సిన్హా నేతృత్వంలో నిపుణుల కమిటీ

ఎంఎస్ఎంఈ రంగంలో ఆర్థిక సుస్థిరతను నెలకొల్పి, వాటి ఇబ్బందులను తీర్చడానికి మార్కెట్ రెగ్యులేటర్ సెబీ మాజీ చైర్మన్ యూకే సిన్హా నేతృత్వంలో ఓ నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది ఆర్బీఐ. ప్రస్తుతం ఎంఎస్ఎంఈలు ఎదుర్కొంటున్న ఆర్థికపరమైన కష్టాలను పరిశీలించి వాటికి దీర్ఘకాలిక పరిష్కారాలను ఎనిమిది మంది సభ్యులు గల ఈ కమిటీ సూచించనున్నది. ఈ ఏడాది జూన్ ఆఖరుకల్లా నివేదికను కమిటీ సమర్పిస్తుందని ఆర్బీఐ ఈ సందర్భంగా ఓ ప్రకటనలో తెలియజేసింది. దేశ ఆర్థిక వ్యవస్థలో ఎంఎస్ఎంఈల ప్రాధాన్యాన్ని గుర్తిస్తున్నామన్న ఆర్బీఐ.. వాటి మనుగడను కాపాడుతామన్నది. దేశీయ తయారీ రంగంలో 45 శాతం, ఎగుమతుల్లో దాదాపు 40 శాతం వాటా ఎంఎస్ఎంఈ సంస్థలకున్నది.

అన్నింటికీ వర్తింపజేయాలి

వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) కింద ఇంకా నమోదు కాని ఎంఎస్ఎంఈలకూ ఆర్బీఐ తాజాగా అనుమతించిన రుణ పునర్‌వ్యవస్థీకరణ పథకాన్ని వర్తింపజేయాలని భారతీయ ఎంఎస్ఎంఈ సమాఖ్య ప్రధాన కార్యదర్శి అనిల్ భరద్వాజ్ డిమాండ్ చేశారు. నోట్ల రద్దు, జీఎస్టీ నిర్ణయాలతో ఎంఎస్ఎంఈ పరిశ్రమ కుదేలైందన్న ఆయన ఈ రంగంలోని బాధితులందరికీ ఆర్థిక భరోసాను కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

పీసీఏ బ్యాంకులకు లాభం

ఎంఎస్ఎంఈల రుణ పునర్‌వ్యవస్థీకరణ నిర్ణయం.. ప్రాంప్ట్ కరెక్టివ్ యాక్షన్ (పీసీఏ) పరిధిలో ఉన్న బ్యాంకులకు లాభించగలదని కోటక్ సెక్యూరిటీస్ నివేదిక ఒకటి తెలిపింది. 11 ప్రభుత్వ రంగ బ్యాంకులు పీసీఏ నిబంధనలను ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఈ బ్యాంకుల మొండి బకాయిలు (నిరర్థక ఆస్తులు లేదా ఎన్‌పీఏ) చాలావరకు ఎంఎస్ఎంఈల రంగంలోనే ఉన్నాయి. దీంతో ఆయా బ్యాంకులకు ఊరటగానే అభివర్ణించింది కోటక్ సెక్యూరిటీస్. ఈ నెల 1 నాటికి రుణ విలువ ఏ రకంగానూ రూ.25 కోట్లకు మించకపోతే.. దాన్ని వచ్చే ఏడాది మార్చి 31దాకా పునర్‌వ్యవస్థీకరించుకోవచ్చని ఆర్బీఐ మంగళవారం ఓ ప్రకటనలో స్పష్టం చేసిన విషయం తెలిసిందే.



పరుపుల తయారీలో అగ్రగామి సంస్థయైన స్లీప్‌వెల్.. నూతన సంవత్సరం సందర్భంగా మారథాన్‌ను నిర్వహించింది. ఈ మారథాన్‌లో 40 ఏండ్లలోపు వయసున్న పురుషుల్లో పంకజ్ సింగ్, అశిష్ పాండే, అంకిత్ శర్మలు, మహిళల్లో సంధ్య సింగ్, ప్రీతి సింగ్, రూపమ్ శర్మలు బహుమతులు గెలుచుకున్నారు.

ఎస్ఏఎఫ్ఏ అధ్యక్షుడిగా పీవీఎస్

- **తెలంగాణ వ్యక్తికి తొలిసారి దక్కిన గౌరవం**



హైదరాబాద్ (తెలుగు యూనివర్సిటీ), జనవరి 2: సౌత్ ఏషియన్ ఫెడరేషన్ అకౌంటెంట్స్ (ఎస్ఏఎఫ్ఏ) అధ్యక్షుడిగా తెలంగాణకు చెందిన డాక్టర్ పీవీఎస్ జగన్‌మోహన్ రావు బుధవారం నియమితులయ్యారు. గతేడాది ఉపాధ్యక్షుడిగా పనిచేసిన ఆయన ఈ సంవత్సరానికిగాను అధ్యక్షుడిగా నియమితులవగా, తెలంగాణ వ్యక్తి తొలిసారి ఈ ఘనతను సాధించినట్లైంది. కాగా, గతంలో అకౌంటెంట్స్ రంగానికి చెందిన అనేక ప్రభుత్వ, ప్రభుత్వేతర, స్వచ్ఛంద సంస్థలలో పీవీఎస్ కీలక భూమిక పోషించారు.



- **మానవత్వం పరిమళించే..**

ఫుట్‌పాత్‌లపై చలికి వణుకుతూ నిద్రించేవారిని ఆదుకొనేందుకు జీహెచ్‌ఎంసీ ముందుకొచ్చింది. చలినుంచి ఉపశమనం పొందేందుకు జీహెచ్‌ఎంసీ కమిషనర్ దానకిశోర్ అదనపు కమిషనర్ హరిచందనతోపాటు ఇతర అధికారులు బుధవారం బంజారాహిల్స్ బసవతారకం క్యాన్సర్ దవాఖాన వద్ద బ్లాంకెట్లను పంపిణీచేశారు. దాదాపు మూడు వేల మందికి బ్లాంకెట్లు, దుప్పట్లను పంపిణీచేశారు. నిరాశ్రయ రహిత నగరంగా గ్రేటర్ హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నామని కమిషనర్ దానకిశోర్ తెలిపారు.



బుధవారం చార్మినార్ పరిసరాల్లో వర్షపునీటి కాలువ మ్యాపును పరిశీలిస్తున్న పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్ కుమార్

చార్మినార్ మెరువాలి

- ఆధునిక లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయండి
- వారంలో నయాపూల్ మెరుగవ్వాలి: పురపాలక ముఖ్యకార్యదర్శి అరవింద్‌కుమార్

హైదరాబాద్ సిటీ బ్యూరో, నమస్తే తెలంగాణ: చార్మినార్ పరిసర ప్రాంతాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచాలని.. రాత్రిపూట ధగధగా మెరిసిపోవాలని.. ఇందుకోసం ఆధునిక లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన పాతనగరంలో వర్షపు నీటి కాల్వలను పరిశీలించారు. చార్మినార్ పరిసరాలను, శాలిబండ, హిమ్మత్‌పుర, అబ్దుల్లా బిల్డింగ్, ముర్గి చౌక్, సిటీ కాలేజీ, నయాపూల్ ప్రాంతాల్లో ఉన్న కాల్వలను పరిశీలించారు. శాలిబండ ప్రాంతంలో దశాబ్దాల క్రితం నిజాం హయాంలో ఏర్పాటుచేసిన పాత నీటి కాల్వలే నేటికీ సమర్థంగా ఉన్నాయని అన్నారు. 1908లో మూసీ వరదల నేపథ్యంలో.. మోక్షగుండం విశ్వేశ్వరయ్య మార్గదర్శకత్వంలో ఈ కాల్వలను నిర్మించారని గుర్తు చేశారు. ఆ సమయంలోనే నగరంలో మంచినీటి సరఫరా వ్యవస్థను తీర్చిదిద్దారని తెలిపారు. వారంలోగా నయాపూల్ పరిసరాల్లో పరిశుభ్రతలను మెరుగుపర్చాలని జోనల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఆర్చ్ బ్రిడ్జికి లైటింగ్, ఫెన్సింగ్ ఏర్పాటుచేయాలని పేర్కొన్నారు.

పోస్టర్లు అతికిస్తే జరిమానా

ప్రజా ఆస్తుల పరిరక్షణ చట్టాన్ని కఠినంగా అమలుచేయాలని అరవింద్‌కుమార్ జీహెచ్‌ఎంసీ అధికారులను ఆదేశించారు. నగర అందానికి భంగం కలిగించే ఫ్లెక్సీలు, బ్యానర్లను తక్షణమే తొలగించాలని జోనల్ కమిషనర్లకు సూచించారు. పుట్టిన రోజు శుభాకాంక్షలు, రాజకీయ బ్యానర్లు, విద్యసంస్థలు, కళాశాలలు, కోచింగ్ సెంటర్ల ఫ్లెక్సీలను అంతర్గత రహదారులు, వీధి దీపాలు, జంక్షన్లలో ఏర్పాటు చేసేవారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. బస్ షెల్టర్ల గోడలు, డివైడర్లు, ఫ్లైఓవర్ల గోడలు, సెంట్రల్ డివైడర్ బ్లాకులు, మెట్రో స్టేషన్ గోడలు వంటివాటిపై పోస్టర్లు అతికించే సంస్థలు, వ్యక్తులపై జరిమానా విధించాలని సూచించారు. జీహెచ్‌ఎంసీ చీఫ్ ఇంజినీర్ జియావుద్దీన్, జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



పాతబస్తీలో వర్షపునీటి కాలువను పరిశీలిస్తున్న ముఖ్య కార్యదర్శి అరవింద్ కుమార్

చైన్‌స్నాచింగ్‌లు బవారియా గ్యాంగ్ పనే!

- కేసుల్లో వీడిన చిక్కుముడి.. అదుపులో పలువురు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలో పంజా విసిరిన చైన్‌స్నాచింగ్ కేసుల్లో నెలకొన్న మిస్టరీ వీడిపోయింది. గత బుధ, గురువారాల్లో 9 స్నాచింగ్‌లతో స్వైరవిహారం చేసిన స్నాచర్‌లు ఢిల్లీకి చెందిన బవారియా గ్యాంగ్‌గా పోలీసులు గుర్తించారు. వీరు ఉపయోగించిన కేటీఎం బైక్‌ను హైదరాబాద్ భవానీనగర్ పోలీసులు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. స్నాచర్‌లు బైక్‌ను అద్దెకు తీసుకున్నట్టు పోలీసులు తేల్చారు. ఈ ముఠాలో మొత్తం ఆరుగురు సభ్యులు ఉన్నట్లు పోలీసులు తెలుసుకున్నారు. స్నాచింగ్ చేసిన దుండగులకు నగరంలో ఇద్దరు సహకరించగా, మరో ఇద్దరు వాహనాలను అద్దెకు సమకూర్చారు. 9 స్నాచింగ్ ఘటనల్లో దాదాపు 30 తులాల బంగారం కాజేసిన దుండగులు విమానంలో ఢిల్లీకి చెక్కేశారని ఆధారాలు లభించడంతో రాచకొండ, హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఢిల్లీతోపాటు ఉత్తరాది రాష్ట్రాల్లో దర్యాప్తును ముమ్మరం చేశారు. స్నాచర్‌ల చిక్కుముడి వీడటంతో వారి అరెస్టు, రికవరీపై దృష్టి సారించారు. సీసీ కెమెరాల పొటోలు, ఇతర సాంకేతిక పరిజ్ఞానంతో రాచకొండ, హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్నాఛర్‌ల ముఠాను నీడలా వెంటాడుతూ పలువురిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

చెలరేగిన భరత్‌పూర్ సైబర్ గ్యాంగ్

- రూ. కోటిన్నరకు పైగా మోసం
- ఓఎల్‌ఎక్స్‌లో వాహనాలు అమ్మకానికి పెట్టి దగా
- ఆర్మీ ఫొటోలు పెట్టి చీటింగ్
- హైదరాబాద్‌లో 80 మంది బాధితులు



హైదరాబాద్ సిటీ బ్యూరో, నమస్తే తెలంగాణ: ఆర్మీ ఫొటోలతో నమ్మకం కలిగిస్తూ.. అమాయకులకు తక్కువ ధర ఆశచూపి ఓఎల్‌ఎక్స్ అడ్డాగా నిండా మోసంచేస్తున్నారు. రాజస్థాన్‌లోని భరత్‌పూర్ కేంద్రంగా సైబర్ నేరగాళ్లు ఈ దందాకు తెరలేపారు. హైదరాబాద్‌లోని మూడు కమిషనరేట్ల పరిధిలో 80 మందిని మోసం చేసినట్టు పోలీసులు బుధవారం గుర్తించారు. దర్యాప్తులో భాగంగా పోలీసు బృందం భరత్‌పూర్ వెళ్లి వచ్చినప్పటి నుంచి మోసాలు రెట్టింపయ్యాయి.

గుడ్డిగా నమ్మేస్తున్నారు!

కారు, ద్విచక్రవాహనం, సెల్‌ఫోన్, ఇతరత్రా వస్తువులను తక్కువ ధరకు విక్రయిస్తామంటూ ఓఎల్‌ఎక్స్‌లో ప్రకటన వేస్తారు. అయితే అవి ఆర్మీలో పనిచేసే వ్యక్తులవేననే నమ్మకం కలిగేలా ఆర్మీలో పనిచేస్తున్న వారి ఫొటోలను వాడుతూ మోసాలకు తెగబడుతున్నారు. వెస్పా-2017ను రూ. 40 వేలకు విక్రయిస్తామనే ప్రకటన చూసిన సురేశ్ అనే వ్యక్తి సదరు నంబరులో సంప్రదించాడు. విక్రయదారుడు (సైబర్ చీటర్) మాట్లాడుతూ.. బెంగుళూర్‌లో పనిచేస్తుండగా కొన్నానని, హైదరాబాద్‌లో ఉన్న తన భార్యకు ప్రమాదంలో కాలు విరిగినందున తక్కువ ధరకు విక్రయించేందుకు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో పార్కుచేశాని తెలిపాడు. రూ.35 వేలకు బేరం కుదరడంతో ఎయిర్‌పోర్టు చార్జీల పేరుతో రూ. 3,500 పేటీఎం ద్వారా వసూలుచేశాడు. తరువాత వాహనం ప్యాక్‌చేసి పంపిస్తున్నానని లెటర్‌ను వాట్సాప్‌లో పంపడంతో మరో రూ.20 వేలు చెల్లించాడు. ఇంతలో మరోమారు ఫోన్ చేసిన సైబర్ చీటర్.. కొరియర్ వీ వద్దకు వచ్చేసింది.. మిగతా డబ్బు పంపించాలనడంతో ఆ డబ్బు కూడా చెల్లించేశాడు. ఎంతకూ వాహనం రాకపోవడంతో శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఆరా తీశాడు. మోసపోయానని తెలిసి సైబర్‌క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. ఇలా బుధవారం 25 మంది వరకు బాధితులు సైబర్‌క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. అంతా రూ. 20 వేల నుంచి లక్ష రూపాయల వరకు పోగొట్టుకున్నవారే ఉన్నారు. మొత్తానికి కోటిన్నర రూపాయల ఇలా చీటింగ్ చేసినట్టు తెలుస్తున్నది. ఇలా మోసపోయిన వారిలో ఇద్దరు గోల్కొండ ఆర్మీ విభాగంలో పనిచేస్తున్న వారు సైతం ఉన్నారు.

వెనుకా ముందు ఆలోచించండి



ఆర్మీలో పనిచేసే వారి ఫొటోలను ఇంటర్‌నెట్ నుంచి సేకరించి భరత్‌పూర్ అడ్డాగా ఈ తరహా మోసాలకు పాల్పడుతున్నారు. ఇండియన్ ఆర్మీ కదా.. మోసం చేయరు అనే భావనతో తక్కువ ధరకు వస్తువు దొరుకుతుందంటే వెనుకా ముందు ఆలోచించకుండా డబ్బులు డిపాజిట్ చేస్తున్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో పార్కింగ్ ఎందుకు చేస్తారు.. ప్రకటనపై నమ్మకం ఉంటే.. పార్కింగ్ చేసిన చోటకు వెళ్లి వాహనాన్ని చూసుకోవాలి. అలాకాకుండా డబ్బులు చెల్లించిన తరువాత..వాహనం చూడాలనే ఆలోచన రావడంలో అర్థం లేదు. సైబర్‌నేరగాళ్లను పట్టుకోవడం కోసం ప్రత్యేక కార్యాచరణతో పనిచేస్తున్నాం.

రఘువీర్, సైబర్‌క్రైమ్స్ అదనపు డీసీపీ

రాజ్యసభ మీడియా అడ్వైజరీ కమిటీ

- ప్రకటించిన ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- 18 మంది కమిటీలో సీనియర్ జర్నలిస్ట్ ఏ కృష్ణారావుకు చోటు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: 2019 సంవత్సరానికి గాను రాజ్యసభ మీడియా సలహా కమిటీ ఏర్పాటయింది. ట్రైబ్యూన్ పత్రిక ఎడిటర్ కేవీ ప్రసాద్ చైర్మన్‌గా 18 మందితో కూడిన కమిటీని రాజ్యసభ చైర్మన్ వెంకయ్యనాయుడు బుధవారం ప్రకటించారు. ఏడాదిపాటు కొనసాగనున్న ఈ కమిటీలో సీనియర్ జర్నలిస్ట్ ఏ కృష్ణారావుకు చోటు లభించింది. తెలుగు జర్నలిజానికి విశేషసేవలందించిన కృష్ణారావును రాజ్యసభ సెక్రటేరియట్.. కమిటీలో సభ్యుడిగా నియమించి గౌరవించింది. ఆంధ్రజ్యోతి దినపత్రికతోపాటు వివిధ పత్రికల్లో కృష్ణారావు పనిచేశారు.



హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్చార్డీలో నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బీపీ ఆచార్య



బుధవారం అరణ్యభవన్‌లో కొత్త సంవత్సరం వేడుకల్లో పాల్గొన్న తెలంగాణ అటవీశాఖ పీసీసీఎఫ్ పీకే ఝా, రఘువీర్, పృథ్వీరాజ్ తదితరులు



బుధవారం టీఎస్‌పీఎస్సీలోని టీజీవో సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, కార్యదర్శి వాణీప్రసాద్



రాష్ట్ర సమాచార కమిషన్ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా కేక్ కట్‌చేస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ అధర్‌సిన్హా. చిత్రంలో సమాచార ప్రధాన కమిషనర్ రాజాసదారాం, కమిషనర్ బుద్దా మురళి కూడా ఉన్నారు.

యూఏఈలో న్యూ ఇయర్ వేడుకలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: యూఏఈలోని ఎమిరేట్స్ తెలంగాణ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొత్త సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి . యూఏఈలోని తెలంగాణవాసులకు సంఘం అధ్యక్షుడు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఇదేరోజున ఈటీసీఏ అధ్యక్షుడు సత్యం రాధారపు జన్మదినం కావడంతో ఆయనకు సంఘం వ్యవస్థాపకులు కిరణ్‌కుమార్ పీచర, వైస్ ప్రెసిడెంట్ అరవింద్‌బాబు, ఎన్నారై టీఆర్‌ఎస్ సెల్ సభ్యులు నరేశ్ మన్యం, భరద్వాజ్ వల, సురేందర్‌రావు, అరవింద బొండ్ల, రాజ్‌కిరణ్, నరేశ్ అల్లూరు, లోకేశ్, సుధాకర్‌రెడ్డి, భరత్‌యాదవ్ శుభాకాంక్షలు తెలిపారు. గతంలో మాదిరిగానే అందరం కలిసికట్టుగా ముందుకుసాగాలని ఆకాంక్షించారు.

నౌ'హీరా' కేసులో ఉగ్రకోణం!

- ఉగ్రవాదుల డిపాజిట్లు ఉన్నట్టు అనుమానం
- జాతీయ, అంతర్జాతీయ దర్యాప్తు సంస్థలకు లేఖలు
- భారీగా విదేశీ నిధుల గుర్తింపు
- విదేశాల్లో 8 బ్యాంకు ఖాతాలున్నట్టు నిర్ధారణ
- నౌహీరా కుటుంబసభ్యులపై బిగుస్తున్న ఉచ్చు



హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: నౌహీరా షేక్ సారథ్యంలోని హీరా గ్రూప్స్ స్కామ్‌లో రోజుకో కొత్త విషయం వెలుగులోకి వస్తున్నది. తాజాగా ఈ కేసులో ఉగ్రకోణం ఉన్నట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నౌహీరా షేక్ తమ వ్యాపార వివరాలు వెల్లడించకపోవడానికి ఉగ్రకోణమే ప్రధాన కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ క్రమంలోనే 8 విదేశీ బ్యాంకు ఖాతాల ద్వారా వందల కోట్ల విదేశీ నిధుల లావాదేవీలు జరిపినట్టు బయటపడింది. దీంతో మరికొందరు నౌహీరా షేక్ కుటుంబ సభ్యులు, బంధువులను కేసులో నిందితులుగా చేర్చేందుకు సీసీఎస్ పోలీసులు కోర్టు అనుమతి కోరుతున్నారు.

కీలకంగా మారిన హార్డ్ డిస్క్

బంజారాహిల్స్‌లోని అద్దె ఇంట్లో ఉంచిన ప్రధాన సర్వర్‌ను సీసీఎస్ పోలీసులు స్వాధీనం చేసుకొని విశ్లేషించారు. ఇందులో వేల సంఖ్యలో ఉన్న డిపాజిటర్ల పేర్లను సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తుండగానే నిఘావర్గాల నుంచి ఒక జాబితా అందింది. ఉగ్రవాద ఆరోపణలు ఎదుర్కొంటున్నవారు, అరెస్టయినవారితోపాటు సేకరించిన పలువురి పేర్లతో కూడిన మరో జాబితాను సీసీఎస్ పోలీసులకు నిఘాసంస్థలు అందించాయి. మరింత స్పష్టత కోసం జాతీయ, అంతర్జాతీయ దర్యాప్తు సంస్థలకు సీసీఎస్ పోలీసులు లేఖలు రాశారు. వారి నుంచి స్పష్టత వస్తే ఈ కేసు కీలక మలుపు తిరిగే అవకాశమున్నది. విదేశీ పెట్టుబడులకు అవసరమైన అనుమతులను కేంద్రం నుంచి తీసుకొని, పెట్టుబడులను భారత కరెన్సీలోనే స్వీకరించాలి. రూ.5,647 కోట్లు భారతీయుల నుంచి స్వీకరించగా, 6 లక్షల డాలర్లు, 132 కోట్ల యూఏఈ దిర్హమ్స్, 10 కోట్ల కువైట్ దినార్స్, 45 కోట్ల సౌదీ రియాల్స్‌ను డిపాజిట్లుగా సేకరించినట్టు దర్యాప్తులో వెల్లడయ్యింది. రూ.6 వేల కోట్లనుకున్న స్కామ్ విలువ రూ.8 వేల కోట్లకుపైగానే ఉన్నట్టు తేలింది. ఫెమా నిబంధనలను పూర్తిగా ఉల్లఘించినట్టు సీసీఎస్ పోలీసులు నిర్ధారించారు.

రూ.60 కోట్లతో కొచ్చిన్‌లో ఫైవ్‌స్టార్ హోటల్ కొనుగోలు!

కేరళ రాష్ట్రంలోని కొచ్చిన్‌లో రూ.60 కోట్లు వెచ్చించి నౌహీరా షేక్ ఫైవ్‌స్టార్ హోటల్‌ను కొనుగోలుచేసినట్టు వెల్లడయింది. మరింత సమాచారం కోసం కేరళ పోలీసులకు సీసీఎస్ పోలీసులు లేఖ రాశారు. నౌహీరా కుమారుడు అబుబకర్.. చేవెళ్లలో మన్నన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ నిర్వహిస్తూ, దుబాయ్‌లోని హీరా గ్రూప్ వ్యవహారాలను పర్యవేక్షించినట్టు దర్యాప్తులో వెల్లడైంది. ఈ క్రమంలోనే నౌహీరా సోదరి ముబారక్‌జాన్ షేక్, సోదరుడు షేక్ ఇస్మాయిల్, అతని భార్య కమలర్‌జాన్ షేక్, బంధువులు షేక్ నఫీనా, షేక్ హమ్మద్‌అశ్రఫ్‌లను నిందితులుగా చేరుస్తూ న్యాయస్థానం అనుమతి కోరారు.



బుధవారం సింగరేణి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియమితులైన జే ఆల్విన్‌ను అభినందిస్తున్న సీఎండీ శ్రీధర్

సింగరేణి ఈడీగా ఆల్విన్ నియామకం

- సింగరేణి భవన్‌లో బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూమెంట్) గా రైల్వేశాఖలో సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్‌గా పనిచేస్తున్న డాక్టర్ జే ఆల్విన్‌ను నియమించారు. బుధవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సీఎండీ ఎన్ శ్రీధర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకొన్నారు. ఈ సందర్భంగా మార్కెటింగ్ అండ్ కోఆర్డినేషన్ జనరల్ మేనేజర్ ఆంథోనిరాజా, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ జనరల్ మేనేజర్ సీహెచ్‌వీ నర్సింహమూర్తి, మార్కెటింగ్, కోల్ మూమెంట్ అండ్ సేల్స్ విభాగం అధికారులు ఎన్‌వీకే శ్రీనివాసరావు, ఎన్‌వీ రాజశేఖర్‌రావు, తాడబోయిన శ్రీనివాసరావు, ఎస్ సంజయ్, ఎన్ భాస్కర్, పీఆర్‌వో బీ మహేశ్, డిప్యూటీ మేనేజర్ దుండె వెంకటేశం తదితరులు ఆల్విన్‌కు ఘనస్వాగతం పలికారు.

సగానికిపైగా ఇంజినీరింగ్ సీట్లు మిగులు

- దేశ వ్యాప్తంగా ఇదే తీరు
- 2020 నుంచి కొత్త కాలేజీలకు, కోర్సులను అనుమతులు వద్దు
- బ్లాక్‌చైన్, రోబోటిక్స్, డాటాసైన్స్ వంటి కోర్సులకు అవకాశం ఇవ్వండి
- ఏఐసీటీఈకి బీవీఆర్ మోహన్‌రెడ్డి నివేదిక



హైదరాబాద్, నమస్తే తెలంగాణ : దేశ వ్యాప్తంగా ఉన్న ఇంజినీరింగ్ కాలేజీల్లో సగానికి పైగా సీట్లు మిగులుతున్నాయని, దీంతో నాణ్యమైన విద్య అందుబాటులోకి రావటం లేదని, ఐఐటీ హైదరాబాద్ బోర్డు ఆఫ్ గవర్నర్స్ చైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. 2016-17 విద్యా సంవత్సరంలో దేశ వ్యాప్తంగా 3,291 ఇంజినీరింగ్ కాలేజీల్లో 15.50 లక్షల (బీఈ/బీటెక్) సీట్లు ఉన్నాయి. వాటిలో 51 శాతం సీట్లు మిగిలాయని ఏఐసీటీఈకి గత నెల 26న బీవీఆర్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటైన కమిటీ నివేదిక అందించింది. ఈ కమిటీ రెండు నెలలపాటు అధ్యయనం చేసింది. ఇంజినీరింగ్ విద్య పారిశ్రామిక అవసరాలను అవి తీర్చలేక పోతున్నదని కమిటీ అభిప్రాయపడినట్టు తెలిసింది. ఈ కారణంగా 2020 నుంచి దేశ వ్యాప్తంగా ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలకు, కంప్యూటర్ సైన్స్, ఈసీఈ, వంటి బీఈ/బీటెక్ కోర్సులకు కూడా అనుమతులు ఇవ్వొద్దని సిఫార్సులు చేసినట్లు సమాచారం. ఇంజినీరింగ్ కాలేజీలు, సీట్లపై ప్రతి రెండు సంవత్సరాలకు ఒక సారి సమీక్షించాలన్నారు.

కొత్త కోర్సులకు స్వాగతం పలుకండి..

ఇంజినీరింగ్ గ్రాడ్యుయేషన్ స్థాయిలో కంప్యూటర్ సైన్స్, ఐటీ వంటి కోర్సులకు కాకుండా, డిమాండ్ ఉన్న నూతన కోర్సులకు స్వాగతం పలుకాలని కమిటి సిఫార్సు చేసినట్టు సమాచారం. ముఖ్యంగా త్రిడీ ప్రింటింగ్ అండ్ డిజైనింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ, బ్లాక్‌చైన్, రోబోటిక్స్, క్వాంటమ్, డాటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ వంటి కోర్సులకు అనుమతించే అంశాన్ని పరిశీలించవచ్చునని తెలిపింది. ఇబ్బడిముబ్బడిగా పెరిగి పోయిన ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలు నిబంధనలు పాటించడం లేదని, అవినీతి కూడాపెరిగిందని అభిప్రాయపడింది. అనేక కారణాల వల్ల బీటెక్ స్థాయిలో ఉద్యోగాలు లభించడం లేదని స్పష్టం చేసినట్టు సమాచారం.

నాణ్యతా ప్రమాణాల్లో ముందున్న తెలంగాణ

నాణ్యమైన ఇంజినీరింగ్ విద్యను అందుబాటులోకి తేవటంలో తెలంగాణ ప్రభుత్వం ముందున్నది. నాలుగేండ్ల క్రితమే ఈ నిర్ణయం తీసుకున్నది. రాష్ట్రంలో 2015-16 విద్యా సంవత్సరం నుంచి కొత్త ఇంజినీరింగ్ కాలేజీలకు, అదనపు కోర్సులు, సీట్లకు అనుమతులు ఇవ్వొదన్న విధానపరమైన నిర్ణయం తీసుకోవడం విశేషం. ఏఐసీటీఈకి రాష్ట్ర ప్రభుత్వం స్వయంగా లేఖ రాసింది. రాష్ట్రంలో ఇప్పటికే ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల సంఖ్య పెరిగిపోవడంతో నాణ్యామైన విద్య అందుబాటులోకి రావడం లేదని, దీంతో పరిశ్రమలు ఇంజినీరింగ్ విద్యార్థులకు సరైన ఉద్యోగాలను కల్పించలేక పోతున్నట్టు తెలిపారు. ఈ క్రమంలో 2018-19 విద్యా సంవత్సరం నాటికి రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలలో దాదాపు 80 శాతానికిపైగా విద్యా ప్రమాణాలు మెరుగుపడ్డాయని, కొన్ని కాలేజీలలో 100 శాతానికి పైగా ప్రమాణాలు ఉన్నాయని జేఎన్‌టీయూటీహెచ్ అధికారులు అభిప్రాయపడుతున్నారు.

ఆ పదమూడు టీఎంసీలపై కుంటిసాకులు

- రిజర్వు పేరిట తెలంగాణ వాటాకు గండికొట్టే యత్నం
- తెలంగాణ లేఖ రాసినా స్పష్టత ఇవ్వని అధికారులు
- త్రిసభ్య కమిటీ సమావేశం జరుగకుండా కృష్ణా బోర్డు, ఏపీ హైడ్రామా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కృష్ణాజలాల్లో తెలంగాణ వాటాకు గండికొట్టేందుకు కృష్ణా బోర్డు యత్నిస్తున్నది. రాష్ట్రానికి వాటా కింద అందాల్సిన 60 టీఎంసీల నీటి విడుదలకు ఉత్తర్వులు ఇవ్వాల్సిన బోర్డు ఉన్నతాధికారులు రిజర్వు పేరిట కొత్త డ్రామాకు తెరలేపారు. రెండు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపిణీపై కొన్ని రోజుల కిందటి వరకు స్పష్టతనివ్వని బోర్డు ఉన్నతాధికారులు చివరకు తెలంగాణకు 60, ఏపీకి సుమారు 34 టీఎంసీల వాటా ఉన్నదని తేల్చారు. 46.9 టీఎంసీల నీటి విడుదలకు మాత్రమే ఉత్తర్వులు ఇచ్చి, మిగిలిన 13 టీఎంసీలపై విచిత్రసాకులు చెప్తున్నది. వాస్తవంగా తెలంగాణ తన వాటాలో తొమ్మిది టీఎంసీలను వచ్చే నీటి సంవత్సరంలో హైదరాబాద్‌తోపాటు, మిషన్‌భగీరథ, ఇతర తాగునీటి అవసరాలకు నిల్వ ఉంచుకుంటున్నది. ఈ నేపథ్యంలో 2018-19 వాటా మేరకు నీటి విడుదల ఉత్తర్వులు ఇస్తే అవసరానికనుగుణంగా వాడుకోవాలని చూస్తున్నది. కానీ, బోర్డు ఉన్నతాధికారులు మాత్రం గతంలో ఎన్నడూలేనివిధంగా రిజర్వు అంటూ నీటివిడుదల ఉత్తర్వుల్లో కొత పెడుతున్నారు. దీంతోపాటు, రిజర్వులో ఉంచిన పరిమాణాన్ని వచ్చే నీటి సంవత్సరం ఖాతాలో జమ చేయమనే దానిపై బోర్డు స్పష్టత కూడా ఇవ్వడం లేదు. వచ్చే ఏడాది జూన్-ఆగస్టులో ఈ తొమ్మిది టీఎంసీలను వాడుకుంటున్నందున వాటిని వచ్చే నీటి సంవత్సరం ఖాతాలో జమచేస్తే.. తెలంగాణ ఆ మేరకు నష్టపోకతప్పదని ఆందోళన వ్యక్తంచేస్తున్నది.

నాలుగు టీఎంసీలు ఎడమ కాల్వ పరిధిలో..

13 టీఎంసీల్లో మరో నాలుగు టీఎంసీలను సాగర్ ఎడమ కాల్వ పరిధిలో రిజర్వు చేసింది. ఎడమ కాల్వ పరిధిలో మొదటి రెండు జోన్లలో తెలంగాణ ఆయకట్టు ఉంటే.. మూడోజోన్‌లో ఏపీ ఆయకట్టు ఉన్నది. అయితే ఏపీకి ఎడమ కాల్వ కింద ఇచ్చే నీటిలో సరఫరా, ఆవిరి నష్టాలపై కొన్నేండ్లుగా అయోమయం నెలకొన్నది. పాలేరు తర్వాత ఏపీ ఆయకట్టుకు సరఫరా చేసే నీటిలో 39శాతం నష్టాలు ఉన్నట్టు తెలంగాణతోపాటు బోర్డు వేసిన కమిటీ కూడా స్పష్టం చేసినా.. ఏపీ మాత్రం 13శాతం నష్టాలు మాత్రమే ఉన్నట్టు చెప్తున్నది. తెలంగాణ వాటాలో నీటిని రిజర్వు చేసే అధికారం బోర్డుకు ఎలా ఉంటుందనే ప్రశ్నలు రేకెత్తుతున్నాయి. దీంతోపాటు కేసీ కెనాల్ కింద రికార్డుల్లో నమోదుచేసిన దానికంటే ఏపీ రెండు టీఎంసీలు ఎక్కువ వాడుకున్నదని తెలంగాణ ఆధారాలతో సహా ఫిర్యాదు చేసింది. వాస్తవంగా ఈ రెండు టీఎంసీలను ఏపీ వాటాలో నుంచి రిజర్వులో ఉంచాలి. అలాకాకుండా తెలంగాణ వాటాను మాత్రమే రిజర్వు చేయడంపై ఇప్పటికే తెలంగాణ నీటిపారుదలశాఖ ఘాటుగా లేఖ రాసింది. దీనిపై బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశాన్ని ఏర్పాటుచేయగా.. ఏపీ అధికారులు డుమ్మా కొట్టారు. దీంతో సమావేశాన్ని వాయిదావేసి బోర్డు చేతులు దులుపుకున్నది.



బుధవారం సింగరేణి కార్యాలయంలో సంస్థ అధికారిక వెబ్ సైట్‌లో సోషల్ మీడియా వాల్‌ను ప్రారంభిస్తున్న సంస్థ డైరెక్టర్ ఎస్ చంద్రశేఖర్

సింగరేణి 'సోషల్ మీడియా వాల్'

- ప్రారంభించిన సంస్థ డైరెక్టర్ ఎస్ చంద్రశేఖర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సింగరేణి సంస్థ సామాజిక మాధ్యమాలన్నీ ఒకే చోట కనిపించేలా రూపొందించిన 'సోషల్ మీడియా వాల్'ను బుధవారం సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎస్ చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణిలో పనిచేస్తున్న ఉద్యోగులకు సంస్థ సమాచారాన్ని తెలియజేయాలనే ఉద్దేశంతో సోషల్ మీడియా వాల్‌ను ఏర్పాటుచేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో సింగరేణి డీజీఎం రాంకుమార్, మేనేజర్ హరికుమార్, సీనియర్ ప్రోగ్రామర్ పీ కిరణ్మయి పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ
జిందగీ
గురువారం 3 జనవరి 2019 WWW. NTNEWS.COM /nt.zindagi

విమానంలో ఒక్కరే ఉంటే!

ఒక విమానంలో ఒక్కరే ప్రయాణం చేయాల్సి వస్తే ఎలా ఉంటుంది? ఒకవైపు భయం వేసినా, మరోవైపు థ్రిల్లింగ్‌గా ఉంటుంది. ఇలాంటి అరుదైన అవకాశం ఒక అమ్మాయిని వరించింది. ఇంతకీ ఎవరా అమ్మాయి?



తన పేరు లూయిసా ఎరిస్పే. గతేడాది డిసెంబర్ 24న దావోస్ నుంచి మనీలాకు వెళ్లేందుకు పీఆర్ 2820 విమానంలో టికెట్ బుక్ చేసుకున్నది. ప్రయాణ సమయం రానే వచ్చింది. విమానంలోకి ఎంటర్ అయింది. లోపలికి వెళ్లి చూడగా విమానం అంతా ఖాళీగా ఉన్నది. అక్కడ సిబ్బంది తప్ప, ఒక్క ప్రయాణికుడు కూడా లేడు. దీంతో లూయిసా ఖంగు తిన్నది. విమానంలో తాను ఒక్కతే అని విమానం ఎక్కాక తెలిసింది. లూయిసా మొదట్లో కంగారుపడినప్పటికీ.. ఆ తర్వాత అంతా సర్దుకున్నది. ఇంకేముంది భయం పోయింది. విమానానికి తానే మహారాణి అన్నట్టు ఆడి పాడింది. అక్కడి సిబ్బందితో సెల్ఫీలు తీసుకుంటూ చాలా ఎంజాయ్ చేసింది. ఆ ఫొటోలను తన ఫేస్‌బుక్ పేజ్‌లో పోస్ట్ చేయడంతో పోస్ట్ కాస్త వైరల్ అయింది. విమానానికి మహారాణి అంటూ తన ఆనందాన్ని ఫేస్‌బుక్‌లో పోస్ట్ పెట్టింది. గమ్యస్థానానికి చేరుకోగానే విమాన సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపింది. ఎంతమంది విమానంలో ఉన్నారనేదాన్ని పట్టించుకోకుండా ఒక్కరినైనా సరే గమ్యస్థానానికి చేర్చడంలో ఫిలిప్పీన్స్ ఎయిర్‌లైన్స్ సంస్థ ఎంతటి కమిట్‌మెంట్‌తో పనిచేస్తుందో అని చెప్పడానికి ఈ సంఘటన నిదర్శనమని పలువురు నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.



జొన్న.. రుచిలో మిన్న!



జొన్న బిస్కెట్స్

కావాల్సినవి :
జొన్న పిండి : 2 కప్పులు, **కింగ్ సోడా :** అర టీస్పూన్, **కస్తూరీ మేతీ :** 2 టీస్పూన్స్, **నువ్వులు :** 2 టీస్పూన్స్, **ఓమా :** ఒక టీస్పూన్, **మిరియాలు :** ఒక టీస్పూన్, **నూనె :** 4 టేబుల్‌స్పూన్స్, **ఉప్పు :** తగినంత

తయారీ :
ఒక గిన్నెలో జొన్నపిండి, బేకింగ్ సోడా, ఉప్పు వేసి కలుపాలి. కొద్దిగా నూనెను వేడి చేసి అందులో పోసి బాగా కలుపుకోవాలి. దీన్ని కాసేపు పక్కన పెట్టాలి. ఈలోపు మిరియాలను పొడి చేసి పెట్టుకోవాలి. ఇందులోనే కస్తూరీమేతీ, నువ్వులు, ఓమా, మిరియాల పొడి వేసి కలుపాలి. నీళ్లను కూడా వేడి చేసి ఈ పిండిలో వేసి కలుపుతుండాలి. దాదాపు 3/4 కప్పు నీళ్లు పోయాల్సి ఉంటుంది. దీనిమీద ఒక కవర్ కప్పి పావుగంట పాటు పక్కన పెట్టాలి. ఈలోపు ఓవెన్‌ని 180 డిగ్రీల సెంటిగ్రేడ్స్ వద్ద ముందే హీట్ చేసుకోవాలి. బేకింగ్ షీట్ వేసి ఉంచాలి. పిండిని రెండు, మూడు భాగాలు చేసి ఒక దాన్ని బేకింగ్ షీట్ మీద పరిచి రోలింగ్ పిన్‌తో రోల్ చేయాలి. క్లింగ్ రాప్ చేసి పిజ్జా కట్టర్‌తో ముక్కలు చేసుకోవాలి. ఇదే వేడితో 20 నిమిషాల పాటు బేక్ చేయాలి. ఆ తర్వాత బయటకు తీసి నూనెతో టాప్ అప్ చేయాలి. మళ్లీ కాసేపు బేక్ చేసి బయటకు తీయాలి. ఈ బిస్కెట్స్‌ని టీతో పాటు తీసుకుంటే యమ టేస్టీగా ఉంటాయి.

జవార్ బర్ఫీ

కావాల్సినవి :
జొన్నపిండి : ఒక కప్పు, **బెల్లం :** 3/4 కప్పు, **నెయ్యి :** పావు కప్పు, **యాలకుల పొడి :** పావు టీస్పూన్

తయారీ :
పెద్ద కడాయిలో జొన్న పిండి వేసి వేయించి పక్కన పెట్టాలి. దీన్ని కాస్త చల్లారనివ్వాలి. ఈలోపు ఒక గిన్నెలో కొన్ని నీళ్లు పోసి బెల్లం కరిగే వరకు కలుపుతుండాలి. చిక్కటి పాకం వచ్చేవరకు ఉంచాలి. దీంట్లో జొన్న పిండి వేసి ఉండలు కట్టకుండా కలుపుకోవాలి. ఇందులోనే నెయ్యి, యాలకుల పొడి వేసి రెండు నిమిషాలు ఉంచి దించేయాలి. ఒక ప్లేట్‌కి నెయ్యి రాసి ఈ మిశ్రమం పోయాలి. ఆ తర్వాత చిన్న ముక్కలుగా కోయాలి. పై నుంచి జీడిపప్పులు లేదా బాదం పప్పులతో గార్నిష్ చేయాలి. తియ్యని బర్ఫీలు తప్పక మీ నోరూరిస్తాయి.





జవార్ కిచిడీ

కావాల్సినవి :
జొన్నలు : అర కప్పు, **ఎర్ర క్యాప్సికం ముక్కలు :** పావు కప్పు, **గ్రీన్ క్యాప్సికం ముక్కలు :** పావు కప్పు, **యెల్లో క్యాప్సికం ముక్కలు :** పావు కప్పు, **కీరా ముక్కలు :** పావు కప్పు, **నూనె :** ఒక టీస్పూన్, **జీలకర్ర :** ఒక టీస్పూన్, **ఇంగువ :** పావు టీస్పూన్, **పాలు :** అర కప్పు, **పచ్చిమిరపకాయలు :** 2, **కొత్తిమీర :** చిన్న కట్ట, **ఉప్పు :** తగినంత

తయారీ :
జొన్నల్లో నీళ్లు పోసి రాత్రంతా నానబెట్టాలి. ఉదయం నీళ్లు వడకట్టి పక్కన పెట్టాలి. ఈ జొన్నలను కుక్కర్‌లో వేసి.. ఒక కప్పు నీళ్లు పోసి కొద్దిగా ఉప్పు వేసి ఐదు విజిల్స్ వచ్చేవరకు ఉడికించాలి. అయితే జొన్నల్లో ఉన్న నీరు ఇంకిపోతే మళ్లీ పెట్టి మరో విజిల్ వచ్చేవరకు ఉంచాలి. ఇప్పుడు కడాయిలో నూనె పోసి జీలకర్ర వేసి వేయించాలి. ఇందులో ఇంగువ, పచ్చిమిరపకాయలు, అన్ని రంగుల క్యాప్సికం ముక్కలు, కీరా ముక్కలు వేసి సన్నని మంట మీద రెండు నిమిషాల పాటు వేయించాలి. ఇప్పుడు ఉప్పు, నీటితో సహా జొన్నలను వేసి ఐదు నిమిషాలు ఉడుకనివ్వాలి. ఆ తర్వాత పాలు పోసి మరో రెండు నిమిషాలు కలుపుతుండాలి. చివరగా కొత్తిమీర వేసి రెండు నిమిషాలు ఉంచి దించేయాలి. వేడి వేడిగా ఆరగిస్తే కిచిడీ అదిరిపోతుంది.



జవ్వార్ బనానా మఫిన్స్

కావాల్సినవి :
జొన్న రవ్వ : 3/4 కప్పు, **అరటిపండు గుజ్జు :** 3/4 కప్పు, **చక్కెర :** 6 టేబుల్ స్పూన్స్, **నూనె :** పావు కప్పు, **బేకింగ్ పౌడర్ :** అర టీస్పూన్, **బేకింగ్ సోడా :** అర టీస్పూన్, **వెనీలా ఎసెన్స్ :** అర టీస్పూన్, **బాదం, జీడిపప్పులు :** గార్నిష్ కొరకు, **ఉప్పు :** తగినంత

తయారీ :
గిన్నెలో జొన్న రవ్వ, బేకింగ్ సోడా, బేకింగ్ పౌడర్, ఉప్పు వేసి కలిపి పక్కన పెట్టాలి. ఓవెన్‌ని 180 డిగ్రీల సెంటీగ్రేడ్స్ వద్ద ముందే హీట్ చేసి పెట్టుకోవాలి. ఎనిమిది మఫిన్ కప్స్‌లో పేపర్ లైనర్స్ వేసి పక్కన పెట్టాలి. ముందుగా కలిపిన మిశ్రమంలో అరటిపండుగుజ్జు, నూనె, చక్కెర, వెనీలా ఎసెన్స్ వేసి కలుపుకోవాలి. చక్కెర కరిగే వరకు అలాగే కలుపుతుండాలి. మఫిన్ కప్పులో ఈ మిశ్రమాన్ని సగం కంటే కాస్త ఎక్కువగా వేసి నింపుకోవాలి. పైన జీడిపప్పు, బాదం పప్పులను వేసి ఓవెన్‌లో ఉంచాలి. 20 నిమిషాల పాటు బేక్ చేసి బయటకు తీయాలి. పూర్తిగా చల్లారాక తింటే రుచిగా ఉంటాయి.



మచ్చలు మాయం

గాయాలు క్రమంగా మచ్చలుగా ఏర్పడుతాయి. కొన్ని మచ్చలు అలానే ఉండిపోతాయి. వాటిని తొలిగించడానికి కొన్ని చిట్కాలను పాటించండి.

- పసుపు, తేనె, చక్కెరని సమపాళ్లలో కలుపాలి. ఈ మిశ్రమాన్ని మచ్చలు ఉన్న ప్రదేశంలో రాయాలి. 15 నిమిషాల తరువాత గోరువెచ్చని నీటితో శుభ్రపరుచాలి. కొన్నిరోజులు ఇలానే చేస్తే మచ్చలు పోతాయి.
- కలబంద గుజ్జు, రోజ్‌వాటర్ రెండింటినీ కలుపాలి. ఈ మిశ్రమాన్ని కాలిన చర్మానికి రాయాలి. 20 నిమిషాల తరువాత నీటితో శుభ్రం చేయాలి. వారానికి రెండుసార్లు ఇలా చేస్తే మచ్చలు తొలిగిపోతాయి.
- పాలు, పసుపుని కలుపాలి. దూదిని ఈ మిశ్రమంలో ముంచి కాలిన మచ్చలున్న ప్రదేశంలో రాయాలి. 20 నిమిషాల తరువాత చల్లని నీటితో కడుగాలి. తరచూ ఇలా చేస్తే మంచి ఫలితం ఉంటుంది.
- టమాట గుజ్జు, పెరుగు, గుడ్డు తెల్లసొనని బాగా కలుపాలి. ఈ మిశ్రమాన్ని వేళ్లతో మచ్చలకి రాయాలి. 15 నిమిషాల తరువాత గోరువెచ్చని నీటితో శుభ్రపరుచుకోవాలి. రోజుకి రెండుసార్లు చేస్తే త్వరగా మచ్చలు తొలిగిపోతాయి.





వి.మాధవి
హైదరాబాద్

15 చుక్కలు.. సందుచుక్క 8 వచ్చేవరకు

ముగ్గులు పంపాల్సిన మా చిరునామా:
సిరి ముగ్గు, నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9,
కృష్ణాపురం, బంజారాహిల్స్,
రోడ్ నెం - 10, హైదరాబాద్ - 500034.
zindagi.nt@gmail.com

శ్రమ తక్కువ.. శుభ్రత ఎక్కువ

సాధారణంగా ప్యాంట్లు త్వరగా మురికి పడుతాయి. వాటి మురికి వదిలించాలంటే కొన్ని చిట్కాలు మీకోసం.



- రోడ్డు మీద నడుస్తుంటే వాహనాల బురద, మురికి గుంటల్లో ఉండే బురదనీరు బట్టలపై పడుతుంటుంది. వెంటనే తుడిచే ప్రయత్నం చేయవద్దు. వీలైనంత సమయం ప్యాంట్‌ను హ్యాంగర్‌కు తగిలించి ఆరబెట్టాలి.
- ఎండలో ఆరబెట్టిన ప్యాంటును తీసుకొని మరక ఆరిందా లేదా చూడాలి. ఎండిన తరువాత దానిని ఉతక్కూడదు. వాక్యూమ్ క్లీనర్‌ని ఉపయోగించి బురదను ప్యాంట్ నుంచి తొలిగించండి.
- గోరువెచ్చని నీటిలో డిటర్జంట్ పౌడర్ కలుపాలి. అందులో ప్యాంట్‌ను 20 నిమిషాల పాటు నానబెట్టాలి. ఇలా చేస్తే బురద మరకలు తేలికగా పోతాయి.
- వేడినీటిలో ఉన్న ప్యాంట్‌ను బయటకు తీసి డిటర్జెంట్‌తో ఉతకాలి. బురద పోయిందో లేదో చూడండి. ఒకవేళ పోకుంటే మరల ఉతకండి.
- బట్టలపైన మరకలను తొలిగించడానికి నిమ్మకాయను కూడా ఉపయోగించవచ్చు. సగానికి కోసిన నిమ్మకాయను మరకపై రుద్ది మరకను తొలిగించవచ్చు.
- నీటిలో బేకింగ్‌సోడా కలిపి మరక ఉన్న బట్టను నానబెట్టాలి. 20 నిమిషాల తరువాత డిటర్జెంట్‌తో ఉతికితే మరకలు సులువుగా పోతాయి.

నమస్తే తెలంగాణ
చిత్రం
[హైదరాబాద్]
గురువారం 3 జనవరి 2019



ప్రభాస్

'కెజీఎఫ్' దర్శకుడితో..

'బాహుబలి' సినిమాకు నాలుగేళ్లు కేటాయించి ఆ సమయంలో మరో చిత్రంలో నటించని ప్రభాస్ ఆ సినిమా తరువాత వరుస చిత్రాల్ని అంగీకరిస్తూ స్పీడు పెంచారు. ప్రస్తుతం సుజిత్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'సాహో' చిత్రంలో నటిస్తున్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీలో హీరో ప్రభాస్ పరిచయానికి సంబంధించిన సన్నివేశాల్ని చిత్రీకరిస్తున్నారు. అత్యంత భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ చిత్రం తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఈ ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాతో పాటు ప్రభాస్ రాధాకృష్ణకుమార్‌తో ఓ సినిమా చేస్తున్నారు. దీనితో పాటు ఆయన మరో చిత్రాన్ని అంగీకరించినట్లు తెలిసింది. కన్నడ స్టార్ యష్ హీరోగా 'కెజీఎఫ్' చిత్రాన్ని రూపొందించిన ప్రశాంత్ నీల్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించే అవకాశం వుందని తాజా సమాచారం. ద్విభాషా చిత్రంగా అత్యంత భారీ బడ్జెట్‌తో రూపొందనున్న ఈ చిత్రాన్ని యువీ క్రియేషన్స్ పతాకంపై ప్రమోద్ ఉప్పలపాటి, వంశీకృష్ణారెడ్డి నిర్మించే అవకాశం వుందని తెలిసింది. దీనికి సంబంధించిన మరిన్ని వివరాల్ని చిత్ర బృందం త్వరలో వెల్లడించనున్నట్లు సమాచారం.

ట్వీట్



సోనాలీ బింద్రే
@iamsonalibendre



నేను బాగా ఇష్టపడే నా జుట్టు తప్పనిసరి పరిస్థితుల్లో కట్ చేయాల్సి వచ్చింది. ఇప్పుడు అది పెరుగుతున్నది. బహుశా 2019లో కూడా మరోసారి కత్తిరించాల్సి వస్తుందొచ్చు. ఈ ప్రయాణం నాకు జీవితపు వాస్తవాలెన్నింటినో నేర్పింది.

సోనాలీ బింద్రేను ఫాలో అవుతున్న వారి సంఖ్య
298,138



కమల్‌హాసన్

పొల్లాచ్చిలో షురూ

'2.ఓ' చిత్రంతో పెద్ద విజయాన్ని దక్కించుకున్నారు దర్శకుడు శంకర్. సైంటిఫిక్ ఫాంటసీ కథాంశంతో తెరకెక్కిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా ఏడు వందల కోట్లకు పైగా వసూళ్లను సాధించింది. ఈ విజయోత్సహంతో తన తదుపరి చిత్రం 'ఇండియన్-2'ను మొదలుపెట్టబోతున్నారు శంకర్. కమల్‌హాసన్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్ర రెగ్యులర్ షూటింగ్ ఈ నెల 18న పొల్లాచ్చిలో ప్రారంభం కానుంది. తొలి షెడ్యూల్‌లో కమల్‌హాసన్‌తో పాటు ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాల్ని తెరకెక్కించేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తున్నది. పొల్లాచ్చి అనంతరం ఉక్రెయిన్‌లో మరో షెడ్యూల్ ప్లాన్ చేస్తున్నట్లు తెలిసింది. కాజల్ అగర్వాల్ కథానాయికగా నటిస్తున్నది. ఈ సినిమా కోసం ప్రస్తుతం ప్రాచీన యుద్ధవిద్యల్లో ఆమె శిక్షణ తీసుకుంటున్నది. కమల్‌హాసన్, శంకర్ కలయికలో 1996లో విడుదలైన 'ఇండియన్' సినిమాకు సీక్వెల్ ఇది. సమకాలీన రాజకీయాల నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో కమల్‌హాసన్ పాత్ర ప్రయోగాత్మకంగా ఉండనున్నట్లు తెలిసింది. తన కెరీర్‌లో 'ఇండియన్-2' చివరి సినిమా కావచ్చునని కమల్‌హాసన్ ఇటీవలే ప్రకటించారు.

కొత్త ప్రయాణం ప్రారంభం

ప్రస్తుతం కథానాయికలంతా పెళ్లిబాట పడుతున్నారు. తమ ప్రణయ బంధాల్ని పరిణయంగా మార్చుకుంటూ ఏడడుగులు వేసేందుకు ఆసక్తిని ప్రదర్శిస్తున్నారు. ప్రియాంకచోప్రా, దీపికా పదుకునే ఇటీవలే వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టారు. తాజాగా కథానాయిక అమీజాక్సన్ పెళ్లి పీటలెక్కబోతున్నది. చిరకాల మిత్రుడు, ప్రియుడు జార్జ్ పనయోటోను ఆమె పెళ్లాడనున్నది. లండన్‌కు చెందిన వ్యాపారవేత్త పనయోటోతో చాలా కాలంగా ప్రేమలో ఉన్నది అమీజాక్సన్. ప్రస్తుతం నూతన సంవత్సర వేడుకల్ని ఆఫ్రికాలోని జాంబియా దేశంలో జరుపుకుంటున్నది ఈ ప్రేమజంట. జనవరి 1న వీరి నిశ్చితార్థం జరిగినట్లు సమాచారం. ఈ సందర్భంగా ప్రియుడు పనయోటో తన బుగ్గపై ప్రేమగా ముద్దిస్తున్న ఓ ఫొటోను ఇన్‌స్టాగ్రామ్ ద్వారా అభిమానులతో పంచుకున్నది అమీజాక్సన్. 'మా జీవితంలో కొత్త ప్రయాణం ప్రారంభమైంది. ప్రపంచంలోనే అత్యంత ఆనందాన్ని నాకు పంచుతున్నందుకు ధన్యవాదాలు. ఐ లవ్ యూ' అంటూ వ్యాఖ్యానించింది. అయితే పెళ్లి తేదీని మాత్రం వెల్లడించలేదు అమీజాక్సన్.



అమీజాక్సన్

బాషా, నరసింహ చిత్రాల స్థాయిలో..

'కండక్టర్ స్థాయి నుంచి సూపర్‌స్టార్‌గా ఎదిగిన రజనీకాంత్ అంటే నాకు అమితమైన అభిమానం. ఆయనే నాకు స్ఫూర్తి. అలాంటి వ్యక్తి నటించిన చిత్రాన్ని రిలీజ్ చేసే స్థాయికి నేను ఎదగడం ఆనందాన్ని కలిగిస్తోంది' అన్నారు అశోక్ వల్లభనేని. రజనీకాంత్ కథానాయకుడిగా నటించిన తమిళ చిత్రం 'పేట్ట'. ఇదే చిత్రాన్ని తెలుగులో నిర్మాత అశోక్ వల్లభనేని 'పేట' పేరుతో విడుదల చేస్తున్నారు. ఈ నెల 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో నిర్మాత మాట్లాడుతూ 'ఓ పేట నేపథ్యంలో సాగే యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. ఇందులో రజనీకాంత్ యువకుడిగానూ, వయసు మళ్లిన వ్యక్తిగానూ రెండు పార్శ్వాల్లో సాగే పాత్రలో కనిపిస్తారు. దర్శకుడు కార్తీక్ సుబ్బరాజు స్వతహాగా రజనీ అభిమాని కావడంతో ఈ చిత్రంలో రజనీని గత చిత్రాలకు పూర్తి భిన్నంగా సరికొత్త గెటప్‌లో చూపించబోతున్నారు. ఆయనను 20 ఏళ్లు వెనక్కి తీసుకెళ్లారు. ఇటీవల విడుదలైన ట్రైలర్ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో వుంది. అనిరుధ్ అందించిన సంగీతం ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటోంది. గతంలో వచ్చిన బాషా, నరసింహ చిత్రాల స్థాయిలో ఆలరించే చిత్రమిది. ఈ నెల 6న ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించబోతున్నాం. దీనికి రజనీకాంత్‌తో పాటు చిత్ర బృందం మొత్తం హాజరవుతారు. ఇదే వేదికపై రజనీ చేతుల మీదుగా కొన్ని అనాథశరణాలయాలకు ఆర్థిక సహాయం అందించబోతున్నాం.



అశోక్ వల్లభనేని

యాభై శాతం బిజినెస్ పూర్తయింది. సర్కార్, నవాబ్ చిత్రాల్ని విడుదల చేసిన తీరు నచ్చి సన్ పిక్చర్స్ వారు ఎంత మంది పోటీకి వచ్చినా దాదాపు కోటిన్నర తక్కువకే 'పేట' తెలుగు హక్కులు ఇచ్చారు. నాపై వారు పెట్టుకున్న నమ్మకాన్ని తప్పకుండా నిలబెట్టుకుంటాను. సంక్రాంతి రేసులో పెద్ద చిత్రాలు పోటీపడుతున్నాయి. థియేటర్ల కొరత వున్నా తొలుత తక్కువ థియేటర్లలో విడుదల చేసి టాక్‌ని బట్టి మరిన్ని పెంచాలనుకుంటున్నాను. ఈ సినిమా తరువాత త్వరలో స్ట్రెయిట్ తెలుగు చిత్రాన్ని నిర్మించబోతున్నాను. ఇప్పటికే కొంత మంది స్టార్స్‌ని కలిశాను. కథకు తగ్గ నటుడు కుదిరితే వెంటనే సినిమా మొదలుపెడతాను. లేదంటే కొత్త వాళ్లతో ప్రయత్నిస్తాను' అన్నారు.

కామన్‌మ్యాన్ వాయిస్

అన్నింటికన్నా పెద్దశాపం పేదరికం. చావుకు.. బతుక్కి మధ్య వంతెనలా ఉంటుంది. ఇల్లు ఇరుకుగా ఉన్నా కల్మషంలేని మనుషులు.. స్వార్థం.. ద్వేషం తెలియని మంచోళ్లు పేదోళ్లు.
– భాస్కర్ అనబోతుల

ఊరు గురించి తపించేవారికే ఓటేయండి. అభివృద్ధికి అవకాశమున్న అభ్యర్థినే గెలిపించుకోండి. మీతో కలిసి పనిచేసే వారే సర్పంచ్‌గా ఎన్నుకొని ఊరును బాగుచేసుకోండి.
– రాజేష్ కుమార్

నీ ఆలోచన ఎక్కడ ఆగుతుందో నీ జీవితం అక్కడే ఆగుతుంది. నీ తోటివారి ఎదుగుదల ఎక్కడ ఆగాలని కోరుకుంటావో నీ ఎదుగుదల అక్కడే ఆగుతుంది.
– జైపాల్‌రెడ్డి కాసల

వైరల్ వీడియో



మమ్ముట్టి కథానాయకుడుగా నటిస్తున్న చిత్రం యాత్ర. ఈ సినిమాకు సంబంధించిన రాజన్న నిన్నాపగలరా ఫుల్ లిరికల్ సాంగ్ విడుదలై సందడి చేస్తున్నది.

Rajanna Ninnapagalara Full Song Lyrical | Yatra Movie Songs | YSR | Mammootty | Mango Music

Total views : 115,223+
Published: 01 January 2019

ఏవీఎస్ తనయుడు దర్శకుడిగా..

మహేష్, ప్రవీణ్, వెంకటేష్, సందీప్, ప్రణతి, అఖిల, లావణ్య ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'వైదేహి'. దివంగత హాస్యనటుడు ఏవీఎస్ కుమారుడు రాఘవేంద్ర ప్రదీప్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. యాక్టివ్ స్టూడియోస్ పతాకంపై ఎ.జనని ప్రదీప్ నిర్మిస్తున్న ఈ చిత్ర ట్రైలర్‌ని ప్రముఖ దర్శకుడు ఎన్.శంకర్ బుధవారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'ఏవీఎస్ నాకు మంచి మిత్రుడు. అద్భుతమైన కమెడియన్‌గా, జర్నలిస్టుగా, కాలమిస్టుగా కెరీర్ ప్రారంభించి బాపు, రమణల ప్రోత్సాహంతో నటుడిగా మారారు. సినిమాని, సాహిత్యాన్ని అవపోసన పట్టారు. ఆయన లేని లోటు ఎప్పటికీ తీరదు. ఆయన జయంతి రోజున ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేయడం ఆనందంగా వుంది. ట్రైలర్ బాగుంది. హారర్ జోనర్ సినిమాలు తప్పకుండా ఆకట్టుకుంటాయి. సక్సెస్‌ఫుల్ దర్శకుడిగా నిరూపించుకునేందుకు ప్రదీప్ ఈ జోనర్‌ని ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ట్రైలర్ ముగింపు ఆసక్తికరంగా వుంది. స్టార్స్ లేని సినిమాకు కథ, కథనం ముఖ్యం. ఈ చిత్రంలో కావాల్సిన అంశాలన్నీ వున్నాయి. సినిమా పెద్ద హిట్ కావాలి' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'ట్రైలర్ రిలీజ్ చేయడానికి మంచి సందర్భం కోసం ఎదురుచూశాను. నాన్న జయంతిన ట్రైలర్ విడుదల చేయడం ఆనందంగా వుంది. మన మైండ్‌లో వున్నదాన్ని తెరపైకి తీసుకురావాలంటే మంచి కెమెరామెన్ ముఖ్యం. దేవా చాలా ఫ్రీడమ్ తీసుకుని నేను ఊహించిన విధంగా తెరపైకి తీసుకొచ్చాడు. సినిమాకు సహకరించిన నటీనటులకు, సాంకేతిక నిపుణులకు కృతజ్ఞతలు. శంకర్‌గారు మా కుటుంబానికి అత్యంత ఆప్తులు. ఆయన ట్రైలర్ విడుదల చేయడం మా నాన్నే వచ్చి రిలీజ్ చేసినట్టుంది' అన్నారు.



చక్రవర్తి, పసుపులేటి రామారావు, ఎన్.శంకర్, రాఘవేంద్రప్రదీప్



ఎన్.ఆర్.రెడ్డి, డేవిడ్, శిరీష, రాజ్ కందుకూరి, కృష్ణుడు

పల్లెటూరి పోలీస్

ఎన్.ఆర్.రెడ్డి కథానాయకుడిగా నటిస్తూ దర్శకత్వం వహించిన చిత్రం 'ఉన్మాది'. ఎన్.రామారావు నిర్మాత. శిరీష కథానాయిక. డేవిడ్ స్వరాలను సమకూర్చిన ఈ చిత్ర గీతాలు మంగళవారం హైదరాబాద్‌లో విడుదలయ్యాయి. ఆడియో సీడీలను నిర్మాత రాజ్ కందుకూరి ఆవిష్కరించారు. ట్రైలర్‌ను దర్శకుల సంఘం అధ్యక్షుడు ఎన్.శంకర్ విడుదలచేశారు. ఈ సందర్భంగా ఎన్.శంకర్ మాట్లాడుతూ 'హీరోయిజం, రౌడీయిజం రెండింటి మేళవింపుతో ఎన్.ఆర్.రెడ్డి ఈ సినిమాను తెరకెక్కించారు. ఇలాంటి కథతో సినిమా చేయడానికి చాలా ధైర్యం కావాలి' అని పేర్కొన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'గ్రామీణ నేపథ్య చిత్రమిది. రొటీన్‌కు భిన్నమైన కథ, కథనాలతో చక్కటి థ్రిల్‌ను కలిగిస్తుంది. పోలీస్ అధికారిగా నా పాత్ర శక్తివంతంగా ఉంటుంది. ఉన్మాదిని పట్టుకునే క్రమంలో ఓ పోలీస్‌కు ఎదురయ్యే పరిణామాలు ఆసక్తిని పంచుతాయి' అని తెలిపారు. సినిమాలో తాను అభినయానికి ప్రాధాన్యమున్న మంచి పాత్రను పోషించానని శిరీష చెప్పింది. ఈ కార్యక్రమంలో డేవిడ్, కృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.



సప్తగిరి

వజ్ర కవచధర గోవింద

సప్తగిరి కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'వజ్ర కవచధర గోవింద'. అరుణ్ పవార్ దర్శకుడు. శివ శివమ్ ఫిలింస్ పతాకంపై నరేంద్ర యెడల, జీవీఎస్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వైభవి జోషి కథానాయిక. అరవై శాతం చిత్రీకరణ పూర్తయింది. దర్శకుడు మాట్లాడుతూ 'గోవిందు అనే సరదా దొంగ కథ ఇది. అతడికో పెద్ద లక్ష్యం ఉంటుంది. అదేమిటి? ఈ లక్ష్యసాధనలో గోవిందుకు ఎదురైన సంఘటనలేమిటన్నదే ఈ చిత్ర ఇతివృత్తం. ఆద్యంతం వినోదభరితంగా సాగుతుంది. యాక్షన్, భావోద్వేగాలతో పాటు వాణిజ్య హంగులు పుష్కలంగా ఉంటాయి' అని తెలిపారు. నిర్మాతలు మాట్లాడుతూ ''సప్తగిరి ఎక్స్‌ప్రెస్' తర్వాత సప్తగిరి, దర్శకుడు అరుణ్ పవార్ కలయికలో రూపొందుతున్న చిత్రమిది. యాక్షన్ ఎంటర్‌టైనర్ కథాంశంతో వినూత్నంగా ఉంటుంది' అని అన్నారు. అర్చనా వేద, టెంపర్ వంశీ, అప్పారావు, అవినాష్, రాజేంద్రజాన్ కొట్టోలి, వీరేన్ తంబిదొరై ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: విజయ్ బుల్గానిన్, కెమెరా: ప్రవీణ్ వనమాలి, ఎడిటింగ్: కిషోర్ మద్దాలి.

సుడోకు

డైలీ సుడోకు 25 సమాధానం

2	5	8	3	6	9	4	7	1
1	3	4	5	7	8	6	9	2
6	9	7	1	2	4	8	3	5
7	6	5	8	1	3	9	2	4
4	8	3	2	9	6	1	5	7
9	1	2	4	5	7	3	6	8
3	7	1	6	4	2	5	8	9
5	2	6	9	8	1	7	4	3
8	4	9	7	3	5	2	1	6

1. నిలువుగా, అడ్డంగా ప్రతి వరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -26

							3	1
			7			8	6	9
2		1		5			7	
3			9					
	8		3	4				
	6	4			5		1	
		3				6	9	2
	1				8		5	7

నిపుణ — విద్య, ఉద్యోగ సమాచారం —

నెస్ట్-2019

ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కోర్సులో ప్రవేశానికి దేశవ్యాప్తంగా నిర్వహించే నేషనల్ ఎంట్రెన్స్ స్క్రీనింగ్ టెస్ట్ (నెస్ట్)-2019 నోటిఫికేషన్ విడుదలైంది.



- **పరీక్ష పేరు:** నేషనల్ ఎంట్రెన్స్ స్క్రీనింగ్ టెస్ట్ (నెస్ట్)
- **ప్రవేశాలు కల్పించే కోర్సులు:** ఐదేండ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ (బయాలజీ, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్)
- **సీట్ల సంఖ్య:** 249
- **ప్రవేశాలు కల్పించే సంస్థలు:** భువనేశ్వర్‌లోని నైసర్, ముంబైలోని యూఎం-డీఏఈ సీఈబీఎస్. ఈ రెండు సంస్థలు అటామిక్ ఎనర్జీ పరిధిలో పనిచేస్తాయి.
- **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో 10+2 లేదా తత్సమానకోర్సు ఉత్తీర్ణత. ఇంటర్ సెకండియర్ పరీక్షలు రాస్తున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **వయస్సు:** ఆగస్టు 1999 తర్వాత జన్మించినవారు. ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీలకు ఐదేండ్లు వయోపరిమితిలో సడలింపు ఇస్తారు.
- **పరీక్ష విధానం:** ఆన్‌లైన్/కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. మొత్తం ఐదు సెక్షన్లు ఉంటాయి. 180 మార్కులకు పరీక్ష ఉంటుంది. సెక్షన్-1లో నెగెటివ్ మార్కింగ్ విధానం ఉండదు. మిగిలిన సెక్షన్లలో కొన్నింటిలో నెగెటివ్ మార్కింగ్ విధానం ఉంటుంది. పూర్తి విషయాలు ప్రశ్నపత్రంలో చూడవచ్చు.
- **స్కాలర్‌షిప్:** ఇన్‌స్పైర్, దిశ ప్రోగ్రామ్ కింద ఏడాదికి రూ.60,000/- స్కాలర్‌షిప్ ఇస్తారు. దీనికి అదనంగా సమ్మర్ ఇంటర్న్‌షిప్ కింద ఏడాదికి రూ.20,000/- ఇస్తారు.
- **పరీక్ష తేదీ:** 2019, జూన్ 1 (మొదటి సెషన్: ఉదయం 9 నుంచి 12.30 వరకు, రెండో సెషన్: మధ్యాహ్నం 2.30 నుంచి 6 గంటల వరకు)
- **ఫీజు:** జనరల్/ఓబీసీ బాలురు- రూ.1,200/-
- ఎస్సీ, ఎస్టీ, అన్ని కేటగిరీలకు చెందిన బాలికలు, పీహెచ్‌సీలకు రూ.600/-
- ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించాలి.
- **పరీక్ష కేంద్రాలు:** దేశవ్యాప్తంగా 90కి పైగా పట్టణాలల్లో ఉన్నాయి. రాష్ట్రంలో హైదరాబాద్, వరంగల్, కరీంనగర్‌లో పరీక్ష కేంద్రాలు ఉంటాయి.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో జనవరి 7 నుంచి ప్రారంభం
- **చివరితేదీ:** మార్చి 11
- **ఫలితాల వెల్లడి:** జూన్ మూడోవారంలో
- **వెబ్‌సైట్:** https://www.nestexam.in

బీఎస్ఎఫ్‌లో మెడికల్ ఆఫీసర్లు

బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్)లో కాంట్రాక్టు ప్రాతిపదికన స్పెషలిస్ట్, డెంటల్ సర్జన్స్, జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **పోస్టులు:** జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్-59 ఖాళీలు
- **జీతం:** నెలకు రూ. 75,000/-
- **అర్హత:** ఎంబీబీఎస్, ఇంటర్న్‌షిప్ చేసినవారు
- స్పెషలిస్టులు-18 ఖాళీలు
- **విభాగాలు:** మెడిసిన్, సర్జరీ, జీ అండ్ ఓ, రేడియాలజిస్ట్, సైకియాట్రి, పాథాలజీ, అనెస్థీషియా, ఆప్తాల్మాలజీ.
- **అర్హతలు:** సంబంధిత స్పెషాలిటీలో పీజీ/డిప్లొమాతోపాటు ఏడాదిన్నర అనుభవం ఉండాలి.
- **జీతం:** నెలకు రూ.85,000/-
- డెంటల్ సర్జన్- 2 పోస్టులు
- **అర్హతలు:** బీడీఎస్‌లో కనీసం 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత. పీజీ ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తారు.
- **జీతం:** నెలకు రూ.75,000/-
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **ఇంటర్వ్యూ తేదీలు:** జనవరి 14 నుంచి 18 వరకు
- **వెబ్‌సైట్:** http://bsf.nic.in

బ్రిడ్జ్ అండ్ రూఫ్‌లో

భారత ప్రభుత్వ రంగ సంస్థ బ్రిడ్జ్ & రూఫ్ కంపెనీ (ఇండియా) లిమిటెడ్‌లో కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

- **పోస్టులు:** ఆఫీసర్ (అఫీషియల్ లాంగ్వేజ్)-1, ఆఫీసర్ (అకౌంట్స్)-4, మేనేజర్ (సెక్యూరిటీ అండ్ అడ్మినిస్ట్రేషన్)-1
- **పనిచేయాల్సిన ప్రదేశాలు:** హౌరా, కోల్‌కతా, వైజాగ్, భువనేశ్వర్, ఢిల్లీ, ముంబై.
- **ఎంపిక:** రాతపరీక్ష/ ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** నిర్ణీత నమూనాలో
- **చివరితేదీ:** జనవరి 19
- **వెబ్‌సైట్:** http://www.bridgeroof.co.in

ఐఐఎంలో

కోజికోడ్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)లో కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

- **పోస్టులు:** జూనియర్ అసిస్టెంట్-5, స్టోర్ అసిస్టెంట్-1, అసిస్టెంట్-2, టెక్నికల్ అసిస్టెంట్-1, జూనియర్ ఇంజినీర్ (సివిల్)-1, అకౌంటెంట్-1 ఖాళీ ఉన్నాయి.
- **అర్హతలు:** జూనియర్ అసిస్టెంట్‌కు డిగ్రీతో పాటు కంప్యూటర్ నాలెడ్జ్, ఐదేండ్ల అనుభవం ఉండాలి. వయస్సు 35 ఏండ్లు మించరాదు. జూనియర్ ఇంజినీర్ పోస్టుకు సివిల్ ఇంజినీరింగ్‌లో మూడేండ్ల డిప్లొమా ఉత్తీర్ణతతోపాటు కనీసం ఎనిమిదేండ్ల అనుభవం ఉండాలి. మిగిలిన పోస్టుల అర్హతలు వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
- **కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేసే పోస్టులు:** ఫ్రంట్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్, ఫెసిలిటీ సూపర్‌వైజర్
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** జనవరి 26
- **హార్డ్‌కాపీలను పంపాల్సిన తేదీ:** ఫిబ్రవరి 15లోగా చేరేలా పంపాలి.
- **వెబ్‌సైట్:** http://www.iimk.ac.in


అడ్వాన్స్‌డ్ డిప్లొమాలు

కాలికట్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ

- (ఎన్ఐఈఎల్‌టీ) అడ్వాన్స్‌డ్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం ప్రకటన విడుదల చేసింది.
- **కోర్సులు:** అడ్వాన్స్‌డ్ డిప్లొమా ఇన్ ఎలక్ట్రానిక్ ప్రొడక్ట్ డిజైన్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్, పీజీ డిప్లొమా ఇన్ ఎంబెడెడ్ సిస్టమ్ డిజైన్, వీఎల్ఎస్ఐ ఎంబెడెడ్, క్లౌడ్ కంప్యూటింగ్, ఇండస్ట్రియల్ ఆటోమేషన్ సిస్టమ్ డిజైన్ వీటితోపాటు అడ్వాన్స్‌డ్ డిప్లొమా (3/4 నెలలు), సర్టిఫికెట్ కోర్సులు ఉన్నాయి.
- **అర్హతలు:** బీఈ/బీటెక్, ఎంసీఏ, ఎమ్మెస్సీ లేదా తత్సమాన కోర్సు లేదా డిప్లొమా ఉత్తీర్ణులు.
- క్యాంపస్/ఆఫ్ క్యాంపస్ రిక్రూట్‌మెంట్ సపోర్ట్ ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ట్యూషన్ ఫీజులో రాయితీ ఉంటుంది. హాస్టల్ వసతి ఉంటుంది.
- **దరఖాస్తు:** వెబ్‌సైట్‌లో
- **వెబ్‌సైట్:** http://nielt.gov.in

నమస్తే తెలంగాణ
రైతుబడి
[హైదరాబాద్]
గురువారం 3 జనవరి 2019

raithubadi@ntnews.com



యాసంగి వరినాట్లు సస్యరక్షణ

కాల్వశ్రీరాంపూర్: ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో నీటి వసతి ఉన్నచోట వరి సాగు నాటు దశలో ఉన్నది. కొన్నిచోట్ల నాట్లు జోరందుకున్నాయి. ఈ నేపథ్యంలో నాటు వేసే సమయంలో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి. దీంతో రైతులు ఎక్కువ దిగుబడులు సాధించవచ్చని కూనారం వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త సిద్ధి శ్రీధర్ రైతులకు వివరించారు. మరిన్ని వివరాలకు ఈ నంబర్ 9849635235 ద్వారా వారిని సంప్రదించవచ్చు. ప్రస్తుత సమయంలో నాటు వేసే రైతులకు ఆయన పలు సూచనలు చేశారు. ఆ వివరాలు..



సిద్ధి శ్రీధర్, శాస్త్రవేత్త, కూనారం వ్యవసాయ పరిశోధనా కేంద్రం

వరి నాట్లు: నాటు వేయడానికి 15-20 రోజుల ముందుగానే ప్రధాన పొలాన్ని 2- 3 సార్లు దుమ్ము చేసి ఆ తర్వాత చదును చేయాలి

- 25-30రోజుల వయస్సుగల నారు తీయడానికి వారం రోజుల ముందు 2 గుంటల నారు మడికి 1కిలో కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు వేసుకోవాలి. దీనివల్ల మొగి పురుగును కొంత వరకు అరికట్టవచ్చు.
- నారును పైపైన నాటుకుంటే పిలుకలు ఎక్కువగా తొడిగే అవకాశం ఉంటుంది. నాటుకున్న తర్వాత ప్రతి రెండు మీటర్లకు 20 సెం.మీ కాలిబాటలను తూర్పు, పడమర దిశలుగా తీసుకోవాలి. దీనివల్ల గాలి వెలుతురు బాగా సోకి చీడపీడల బెడద తక్కువగా ఉంటుంది. అలాగే ఎరువులు, పురుగు మందులు కలుపు మందులు చల్లడానికి, పంట పరిస్థితిని గమనించడానికి అవకాశం ఉంటుంది.

జింక్ లోప నివారణ: యాసంగిలో చలి వల్ల జింక్ లోపం వస్తుంది. దీని నివారణకు చివరి దుక్కిలో ఎకరా కు 20కిలోల జింక్ సల్ఫేట్ తప్పనిసరిగా వేసుకోవాలి. ఒకవేళ పంట పై జింక్ లోపం గమనించినప్పు డు లీటరు నీటికి 2గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపి, వారంరోజుల వ్యవధిలో రెండు మూడుసార్లు పైరుపై పిచికారీ చేయాలి. జింక్ సల్ఫేట్‌ను భాస్వరం ఎరువులో గాని, ఏ ఇతరత్రా పురుగు తెగుళ్ళ మందులలో కలిపి చల్లడం గాని, పిచికారీ గాని చేయకూడదు.

మొగిపురుగు నివారణ: వరిలో ప్రధాన సమస్య అయిన మొగిపురుగు నివారణకు నాటు వేసేటప్పుడు నారు కొనలను తుంచి నాటుకుంటే కొంత వరకు ప్రధాన పొలంలో మొగిపురుగు అదుపులో ఉంటుంది. ఒక చదరపు మీటరు ప్రధాన పొలంలో 5 శాతం చచ్చిన మొవ్వులు లేదా ఒక రెక్కల పురుగు, గుడ్ల సముదాయం కనిపిస్తే, ఎకరాకు 8కిలోల చొప్పున కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జి గుళికలు లేదా, కార్బోఫ్యూరాన్ 3జిగుళికలు 10కిలోల చొప్పున పొలంలో వెదజల్లాలి. ఒకవేళ ఈ పురుగు ఉధృతి ఎక్కువగా కనిపిస్తే ఎకరాకు 4కిలోల చొప్పున క్లోరాంట్రానిల్‌ప్రోల్ (0.4 శాతం) గుళికలు వెదజల్లి సమర్థవంతంగా నివారించుకోవచ్చు.

- వీటితో పాటుగా సమగ్ర ఎరువుల యాజమాన్యం, కలుపు యాజమాన్యం, పంట పరిస్థితిని బట్టి వివిధ సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు పొందవచ్చు అని తెలిపారు.

ఉద్యానపంటల్లో చేపట్టాల్సిన పనులు

ఉద్యాన పంటల్లో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించడం ఒక ఎత్తయితే.. సరైన సమయంలో సేద్యం పనులు సమగ్రంగా చేయాలి. అప్పుడే రైతులు మంచి ఆదాయం పొందే అవకాశాలుంటాయి. ఉద్యాన పంటల్లో ప్రస్తుతం చేపట్టాల్సిన పనులు ఉద్యానశాఖ అధికారులు వివరించారు.

మామిడి



తెల్లపూత సమయంలో తేనె మంచు పురుగు, తామర పురుగు, పూత చుట్టు పురుగుతో పాటు బూడిద తెగులు కూడా సోకే అవకాశం ఎక్కువగా ఉంటుంది. వీటిని వెంటనే నివారించేందుకు తెల్లపూతకు హాని జరుగని మందులు మాత్రమే వాడాలి. అవి ఒక లీటరు నీటికి ఇమిడ్రాక్లోప్రిడ్ 0.3మి.లీ.+డైక్లోరోవాస్ 0.5మి.లీ.+సోఫ్ పొడి 1గ్రా. + ప్లానోఫిక్స్ 0.25 మి.లీ.లు కలిపి పిచికారీ చేయాలి.

- పదేళ్ల వయస్సు దాటిన చెట్టుకు కనీసం 8-10లీ. మందు ద్రావణాన్ని పిచికారీ చేయాలి.
- రాతి మంగు రాకుండా నల్లపూత దశలో 2మి.లీ.ఫిప్రోనిల్ మందును లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలి.

జామ

సెర్కోస్పొరా ఆకుమచ్చ తెగులు వల్ల జామలో ముదురు ఆకుల అడుగు భాగంలో గోధుమ రంగు మచ్చలు, పై భాగంలో పసుపు పచ్చ మచ్చలు ఏర్పడుతాయి. ఎక్కువగా ముదురు ఆకుల మీద ఈ తెగులు ఆశిస్తుంది. ఉధృతి ఎక్కువైనప్పుడు ఆకులు ముడుచుకొని రాలిపోతాయి. దీని నివారణకు మాంకోజెబ్ మందును 2.5గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలి.

పందిరి కూరగాయలు

అనప, దోస, కాకరలను జనవరి రెండో పక్షం నుంచి నాటుకోవచ్చు. గుమ్మడి, పొట్లను జనవరి చివరి వరకు నాటుకోవచ్చు. గుమ్మడి పెంకు పురుగుల పిల్ల పురుగులు పెరుగుదల దశలో ఆకులను కొరికి తింటాయి. నివారణకు మలాథియాన్ 2మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

- ముఖ్యంగా పెరుగుదల దశ నుంచి పూత వచ్చే వరకు 5శాతం వేపగింజల కషాయాన్ని 15రోజుల వ్యవధితో పిచికారీ చేసుకోవాలి.



బత్తాయి, నిమ్మ

ఈ మాసంలో లేత చిగుర్లపై ఆకు ముడుత పురుగులు ఆశిస్తాయి. ఈ ఆకులపై తెల్లటి పొరలు వంకర టింకరగా ఏర్పడి, ఆకులు ముడుతలు పడి, గజ్జి తెగులు ఎక్కువగా ఆశించి ఆకులు రాలిపోతాయి. దీని నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.5 మి.లీ. లేదా డైమిథోయేట్ 2మి.లీ. లేదా మోనోక్రోటోఫాస్ 1.6మి.లీ. లీటరు నీటిని కలిపి లేత చిగుర్ల దశలోనే 10రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.



అరటి

చలి వాతావరణం వల్ల ఆకుల ఈనెల వెంబడి తెల్లనిచారలు ప్రారంభమై ఆకులు పాలిపోయినట్లు కనబడుతాయి. ఆకుల అడుగుభాగాన ముదురు ఉదా రంగు మచ్చలు ఏర్పడుతాయి. దీని నివారణకు ఒక్కొక్క మొక్కకు 10గ్రా. జింకు సల్ఫేట్ భూమిలో వేయాలి. ఆకులపై 2గ్రా. జింకు సల్ఫేట్‌ను లీటరు నీటికి చొప్పు న కలిపి పదిరోజుల వ్యవధిలో 2సార్లు పిచికారీ చేసుకోవాలి.



పుచ్చ

2.5మీ. ఎడంతో, 60సె.మీ.వెడల్పు గల నీటి కాలువలు తయారుచేసుకొని, కాలువలకు ఇరువైపులా 30-50సె.మీ. ఎడంతో విత్తనాలు విత్తుకోవాలి.

గోరు చిక్కుడు

వేసవి పంటను జనవరిలో రెండవ పక్షం నుంచి నాటుకోవచ్చు.

మునగ

కాయ తొలుచు ఈగ పూత దశలో ఆశించి, పిందె దశలో కాయలోకి ప్రవేశించి లోపలి పదార్థాన్ని తిని నాశనం చేయడం వల్ల కాయల ఆకారం మారిపోయి వంకరగా అవుతాయి. నివారణకు, పూత దశలో, లీటరు నీటికి ఫాసలోన్ 2మి.లీ. చొప్పున కలిపి పిచికారీ చేయాలి. పిందె దశలో 1మి.లీ. డైక్లోరోవాస్‌ను లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి.



చిక్కుడు

వేసమి చిక్కుడును ఈ మాసంలో విత్తుకోవచ్చు. ఎకరాకు తీగ రకాలకు 1కిలో, పొద రకాలకు 12-16 కిలోల విత్తనం విత్తుకోవాలి. విత్తనాన్ని థైరమ్ 3గ్రా. కిలో విత్తనానికి చొప్పున కలిపి విత్తనశుద్ధి చేయడం ద్వారా వేరుకుళ్లు తెగులును నివారించుకోవచ్చు.

మిరప

ఈ మాసంలో పేనుబంక పురుగులు ఆకుల అడుగు భాగాన, లేత కొమ్మల నుంచి రసాన్ని పీల్చటం వల్ల మొక్కలు గిడసబారుతాయి. నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా థయామిథాక్సామ్ 0.5గ్రా. లేదా అసిటామిప్రిడ్ 0.5గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

బెండ

బెండ పంటను జనవరి రెండవ పక్షం నుంచి విత్తుకోవచ్చు. ఒక ఎకరాకు 100 కిలోల చొప్పున వేప పిండిని దుక్కిలో వేసుకోవాలి.

ఉసిరి

కాయలపై గోధుమ వర్ణం మచ్చలు ఏర్పడుతాయి. దీన్ని తుప్పు తెగులు అంటారు. కాయలు కోతకు ముందే రాలిపోతాయి. నివారణకు మాంకోజెబ్ 2.5 గ్రా.లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలి.

బొప్పాయి

బూడిద తెగులు ఎక్కువగా ఆశిస్తుంది. ఆకులపైన, కాడలపైన, తెల్లటి బూడిద లాంటి శిలీంధ్రపు పెరుగుదల కనిపిస్తుంది. నివారణకు 1మి.లీ. డినోకాప్ లేదా 1మి.లీ. కెరాథేన్ లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేసి సమర్థవంతంగా నివారించుకోవచ్చు.



వంకాయ

వేసవి పంట నారు కోసం జనవరి రెండవ పక్షం నుంచి విత్తనంను నారుమడిలో విత్తుకోవచ్చు.

టమాటా

వేసవి పంటను ఈ మాసం నుంచి నా టుకోవచ్చు. 21-25రోజుల వయస్సు ఉండి, 3-4 ఆకులు గల మొక్కలను 45X 30 సెం.మీ. దూరంలో నాటుకోవాలి. సాధ్యమైనంత వరకు 30రోజులు మించిన ముదురు నారు నాటరాదు.



ఈ దశ కీలకం

ఉద్యాన పంటలకు ఈ దశ ఎంతో కీలకం. సరైన సమాయంలో సరైన యాజమాన్య పద్ధతులు పాటించి సాగు చేయడం ఉపయోగం. పెట్టుబడి తగ్గడమే కాకుండా ఆశించిన దిగుబడి సాధించడానికి అవకాశం ఉంటుంది.

– కె. సూర్యనారాయణ
జిల్లా ఉద్యానశాఖ అధికారి
మహబూబాబాద్, 79977 25108

అల్లం

సాధారణంగా అల్లం దుంపలు ఈ మాసంలో తవ్వకానికి వస్తాయి, ఆకులు పసుపు పచ్చగా మారి ఎండిపోవడం, కాండం ఎండిపోవడాన్ని బట్టి అల్లం దుంపలు పక్వానికి వచ్చినట్లు గుర్తించి తవ్వుకోవచ్చు.

– గుండెల రాజు,72889 85757
మహబూబాబాద్

దుక్కి దున్నకుండా మక్కజొన్న సాగు

యాసంగిలో మక్కజొన్నను నేలను దున్నకుండానే పంటను (జీరోటిల్లేజ్ పద్ధతి) సాగు చేయవచ్చు. రైతులు వాన కాలంలో వరి సాగు తర్వాత యాసంగిలో ఆరుతడి పంటగా మక్కజొన్నను పండించవచ్చు. ఆరుతడి పంటగా యాసంగిలో మక్కజొన్న లాభదాయకం. నీటి లభ్యత తక్కువగా ఉన్న సమయంలో పొలం దున్ని నేలను తయారు చేసి మక్కజొన్నను విత్తుకునే బదులు జీరోటిల్లేజ్ విధానం ద్వారా వరి మాగాణాల్లో దుక్కి దున్నకుండా మక్కజొన్నను తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో సులభంగా సాగు చేయవచ్చని పొలాస పరిశోధనా స్థానం సేద్య విజ్ఞాన విభాగ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.నవత తెలిపారు. వరి మాగాణాల్లో పొలం దున్నకుండా మక్కజొన్నను సాగు చేసే పద్ధతుల గురించి ఈ కింది విధంగా రైతులకు వివరించారు.





ఎన్.నవత, శాస్త్రవేత్త
పొలాస పరిశోధనా స్థానం

సాగు యాజమాన్యం : వానకాలంలో వరి కోసేటప్పుడు పూర్తిగా తేమ ఆరిన తర్వాత కోయాలి. తడిగా ఉన్న పొలాన్ని హార్వెస్టర్‌తో కోసినప్పుడు హార్వెస్టర్ పొలంలో దిగబడి పొలం అంతా ఎగుడు, దిగుడుగా మారుతుంది. అప్పుడు మక్కజొన్న పెరుగుదల సరిగా ఉండదు. వరి కోసేటప్పుడు సాధ్యమైనంత మేరకు నేలకు దగ్గరగా వరిని కోయాలి. మక్కజొన్నలో ఏ రకం విత్తనం అయినా శూన్య దున్నడం పద్ధతిలో విత్తుకోవచ్చు. వరి కోసిన తర్వాత ఒక నీటి తడి ఇచ్చి సరైన తేమ ఉన్నప్పుడు తాళ్ళ సహాయంతో వరుసకు వరుసకు మధ్య 60 సెం.మీ., మొక్కకు మొక్కకు మధ్య 20 సెం.మీ. ఉండేలా విత్తుకోవాలి. విత్తడానికి ముందు సిఫార్సు చేసిన మొత్తం భాస్వరం ఎరువును, నాలుగవ వంతు నత్రజని ఎరువు, సగం పొటాష్ ఎరువును తేమ ఉన్నప్పుడు విత్తనపు సాళ్ళలో వేసుకోవాలి. విత్తనానికి 5 సెం.మీ. దూరంలో మట్టిలో కప్పిపెట్టాలి. విత్తిన తర్వాత సరైన తేమ లేకపోతే 1 నుంచి 2 రోజుల్లో మరొక తేలిక పాటి తడి ఇవ్వాలి. మక్కజొన్న విత్తనాన్ని విత్తిన తర్వాత సరైన తేమ ఉన్నప్పుడు 24 నుంచి 48 గంటల్లోపు అట్రాజిన్ అనే కలుపు మందును 1 కిలో, పారాక్వాట్ అనే కలుపు మందును లీటరును ఎకరం పొలానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. అట్రాజిన్ అనేది కలుపును మొలకెత్తకుండా చేస్తుంది. అలాగే పారాక్వాట్ అంతకు ముందున్న వరి కాడలను నిర్మూలిస్తుంది. ఒకవేళ విత్తిన తర్వాత కలుపు మొలిస్తే సోడియం సాల్ట్ 400 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి లేదా ఇతర కలుపు మొక్కలు ఉంటే అట్రాజిన్ 1 కిలోకు 200 లీటర్ల నీటిలో కలిపి మక్కజొన్న సాళ్ళ మధ్యలో కలుపుపై పడేటట్లు పిచికారీ చేసి కలుపు మొక్కలను నివారించవచ్చు. విత్తనం పెట్టిన తర్వాత నుంచి పంట కోసే వరకు ఎటువంటి అంతరకృషి అవసరం లేదు.

ఎరువుల నిర్వహణ : సాధారణంగా యాసంగిలో 100 కిలోల నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులను, 20 కిలోల జింక్ సల్ఫేట్‌ను ఎకరానికి వేయాలి. విత్తనం విత్తేటప్పుడు మొత్తం భాస్వరం ఎరువును, సగం పొటాష్, నాలుగవ వంతు నత్రజని ఎరువులను వేయాలి. మిగిలిన నత్రజని ఎరువులను 25 నుంచి 30 రోజుల తర్వాత నాలుగవ వంతు 40 నుంచి 45 రోజుల తర్వాత నాలుగవ వంతు, 60 నుంచి 65 రోజుల తర్వాత నాలుగవ వంతు వేయాలి. మిగిలిన సగం పొటాష్ ఎరువులను 60 నుంచి 65 రోజుల తర్వాత వాడాలి. పైపాటుగా ఎరువులు వేసేటప్పుడు సరైన తేమ ఉన్నప్పుడు చాళ్ళ వెంట వేసి మొక్కకు 5 సెంటీ మీటర్ దూరంలో మట్టి తీసిపెట్టాలి. జింక్ లోప నివారణకు జింక్ సల్ఫేట్ 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

నీటి నిర్వహణ : మక్కజొన్నకు పూతకు ముందు, పూత దశలో, గింజ పాలు పోసుకునే దశలో నీరు తప్పనిసరి. 30-40 రోజుల్లోపు ఉన్న లేత పైరుకు ఎక్కువ నీరు పెట్టడం హానికరం. విత్తిన తర్వాత చేల్లో నీరు నిలిస్తే విత్తనం మురిగిపోయి మొలకెత్తదు. దుక్కి దున్నకుండా మక్కజొన్న సాగులో తక్కువ నీటి తడులు అవసరం. అలాగే ఎక్కువగా నీరు పెడితే వరి మాగాణాల్లో కాబట్టి నీరు నిలిచి మొక్క ఎర్రబడి చనిపోతుంది. మక్కజొన్నలో ఆకులు చుట్టుకుంటే నీటి ఆవశ్యకత ఉన్నట్లు గమనించి నీటితడి ఇవ్వాలి.

పంట కోత : పంట కోతకు వచ్చినప్పుడు బుట్టలపై పొరలు ఎండినట్లు గమనించి, కండెల్లోని గింజలను వేలిగోరుతో నొక్కినప్పుడు పాలుగారే స్థితిలో లేక గట్టిగా ఉన్నప్పుడు పంట కోతకు వచ్చినట్లు గమనించాలి.

సమయం, ఖర్చు ఆదా : ప్రధాన పొలం తయారీకి అయ్యే ఖర్చును, సమయాన్ని ఆదా చేసుకోవచ్చు. నేల స్వభావాన్ని బట్టి 2-3 తడులు ఆదా చేసుకోవచ్చు. అంతరకృషి చేయాల్సిన అవసరం కూడా లేదు. మొక్క మొలకెత్తినప్పటి నుంచి వేరు వ్యవస్థ బలంగా ఉండి గాలికి పడిపోదు. మొక్కల ఎత్తు ఒకే రకంగా ఉండి కంకి కూడా ఒకే సైజులో ఉన్నట్లయితే దిగుబడి పెరిగే అవకాశం ఉన్నది. వరి కోయలు భూమిపై పరుచుకొని కలుపును తగ్గించడమే కాకుండా, తేమ తొందరగా పోకుండా ఉండి మొక్కకు నిరంతరం పోషక పదార్థాలను అందించడం వల్ల దిగుబడులు పెరిగే అవకాశం ఉంటుంది.

–బానుక శ్రీనివాస్
జగిత్యాల టౌన్, 9490530001

సొంతంగా విత్తనోత్పత్తి



కల్తీ విత్తనాల కారణంగా రైతులు ఆరుగాలం పడ్డ కష్టమంతా ఆవిరవుతున్నది. దిగుబడి రాక అన్నదాత అప్పుల పాలు కావాల్సి వస్తున్నది. ఈ క్రమంలో కల్తీలను నిరోధించి స్వయంగా విత్తనోత్పత్తితో కర్షకులు నాణ్యమైన విత్తనాలు పొంది అధిక దిగుబడులు సాధించేందుకు కలెక్టర్ శరత్ ఆధ్వర్యంలో చేపట్టిన 'మన ఊరు-మన విత్త నం' కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తున్నది. జగిత్యాల జిల్లా కోరుట్ల నియోజకవర్గంలోని మెట్‌పల్లి మండలం వేంపేటకు చెందిన యువ రైతులు సొసైటీగా ఏర్పడి జగిత్యాల మండలం లక్ష్మీపూర్ బాటలో నడుస్తున్నారు. స్వగ్రామంలోనే విత్తనోత్పత్తిని చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. పొలాస వ్యవసాయ క్షేత్రాన్ని, లక్ష్మీపూర్ విత్తనోత్పత్తి కేంద్రాలను సందర్శించి, శాస్త్రవేత్తల సూచనలు, తోటి రైతుల అనుభవాలను తెలుసుకొని ముందుకు సాగుతున్నారు. వచ్చే సీజన్‌కు 3 వేల ఎకరాల కోసం విత్తనాలను సిద్ధం చేసేందుకు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా జేజీఎల్ 24423, బతుకమ్మ బ్రీడ్, ఇతర కొత్తరకం వంగడాలను అందుబాటులో ఉంచేందుకు నడుం సిద్ధమవుతున్నారు.

విత్తనోత్పత్తి కేంద్రం ఏర్పాటు ఇలా..

విత్తనోత్పత్తి కేంద్రం ఏర్పాటు చేసుకోవాలనుకునే రైతులు పొల్యూషన్ బోర్డు, జిల్లా వ్యవసాయశాఖ అధికారుల నుంచి అనుమతి పొందాలి. విత్తనోత్పత్తి కేంద్రం ఏర్పాటునకు కావాల్సిన యంత్రాలు పొందేందుకు రైతులకు ప్రభుత్వం రాయితీతో పాటు రుణ సదుపాయాన్ని కల్పిస్తున్నది. వరి కాకుండా అన్నిరకాల పంటల విత్తనోత్పత్తి చేసేందుకు యంత్రాలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి.

–అల్లె సంతోష్
9440333744

సమిష్టి కృషితోనే



రైతుల సమిష్టికృషితోనే విత్తనోత్పత్తి చేసుకుంటూ ముందుకు సాగుతున్నం. గత సీజన్‌లో సుమారు 800 ఎకరాలకు విత్తనాలను సొసైటీ ఆధ్వర్యంలో అమ్మినం. ప్రస్తుతం 3వేల ఎకరాలకు విత్తనోత్పత్తి చేసే లక్ష్యాన్ని పెట్టుకున్నాం. సొసైటీ ద్వారా చేస్తున్న విత్తనోత్పత్తికి వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు చాలా ఉపయోగపడుతున్నాయి.


– ఏలేటి విజయ్‌రెడ్డి,
వేంపేట సొసైటీ అధ్యక్షుడు

విత్తనోత్పత్తికి అనుకూలం



రాష్ట్రంలో వాతావరణం విత్తనోత్పత్తికి అనుకూలంగా ఉంటుంది. రైతులు పండించిన ప్రతి గింజా విత్తనమే. రైతులు వరి, నూనెగింజలు, పప్పుధాన్యాలు, సూటి విత్తనాలు వాడవచ్చు. రైతులు ముందుకొచ్చి సొసైటీగా ఏర్పడి నాణ్యమైన విత్తనాలను తయారు చేసుకొని సొంతంగా వాడుకుంటూ ఇతరులకు విక్రయిస్తే నకిలీ విత్తనాల ఊసే ఉండదు.

– అశోక్‌కుమార్, జగిత్యాల జిల్లా
వ్యవసాయ సలహాదారు


STUDIOS
A HAVISH LAKSHMAN KONERU
PRODUCTION
HAPPY BIRTHDAY
PEDDITI RAM
PRODUCTION NO.1
SATYANARAYANA KONERU RAMESH VARMA PENMETSA
MULTIDIMENSION VAASU